అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 14-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 195 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00



మోడీ, బీజేపీ చరిష్మా క్రమంగా మసకబారుతోంది. చావుతప్పి కన్ను లొట్టపోయిన చందాన కేంద్రంలో సంకీర్ణ సర్కార్ ఏర్పడింది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి కర్రు కాల్చి వాతపెట్టిన ఓటరు.. ఇపుడు బైపోల్స్‌లోనూ షాక్ ఇచ్చాడు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 13 శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఘన విజయం సాధించింది. ఇండియాకు 10 స్థానాలు లభించగా ఎన్డీఏ కేవలం రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. బీహార్‌లో బీజేపీతో అంటకాగిన అధికార జేడీయూకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలోని రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి ఎనిమిది వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

మైండ్‌బ్లాక్..

సార్వత్రికం నుంచి బైపోల్స్ వరకు..

రాలుతున్న కమలం

ఉప ఎన్నికల్లో ఇండియా బ్లాక్ హవా

13 స్థానాల్లో 10 చోట్ల జయభేరి

ఎన్డీఏకు దక్కింది రెండే..మరోచోట స్వతంత్ర అభ్యర్థి గెలుపు

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని మానిక్‌తలా, బాగ్దా, రాణాఘాట్ దక్షిణ్, రాయ్‌గంజ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా వాటన్నింటినీ తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రాలో రాష్ట్ర ముఖ్యమంత్రి, సుఖ్వీందర్ సింగ్ సఖు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ తన సమీప బీజేపీ అభ్యర్థిపై తొమ్మిది వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలోని నాలాగఢ్ స్థానాన్ని కూడా కాంగ్రెస్ పార్టీయే గెలుచుకుంది. ఆ పార్టీ అభ్యర్థి హర్‌దీప్ సింగ్ బావా సమీప బీజేపీ అభ్యర్థిపై ఎనిమిది వేల ఓట్ల మెజారిటీ సాధించారు. హమీర్‌పూర్‌లో మాత్రం బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థి మొహిందర్ భగత్ తన సమీప బీజేపీ అభ్యర్థిపై 37 వేల భారీ మెజారిటీతో విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని అమర్‌వారా స్థానాన్ని బీజేపీ గెలుచుకుంది. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగలౌర్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బద్రీనాథ్‌లో లఖ్‌పత్ సింగ్ బుటోలా, మంగలౌర్‌లో...13లో

ఎల్జీకి మరిన్ని అధికారాలు

జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు గందరగోళం


13లో

కేంద్రం తీరుపై రాజ్యాంగ, న్యాయ నిపుణుల విమర్శలు



అసెంబ్లీ సమావేశాల్లో

జాబ్‌క్యాలెండర్

యూపీఎస్సీ తరహాలో విడుదల చేస్తాం

- మార్చి 31 నాటికి ఖాళీల గుర్తింపు, జూన్ 2 నాటికి నోటిఫికేషన్లు
- డిసెంబర్ 9 నాటికి నియామకాలు పూర్తి చేస్తాం
- ప్రణాళికాబద్ధంగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు
- నోటిఫికేషన్ల ప్రకారమే నిర్వహిస్తాం
- వాయిదా వేస్తే నిరుద్యోగులకే నష్టం
- ఈ ఏడాది నుంచి సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు
- బకాయిల బాధ్యతలు మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగింత
- ఆర్థిక సమస్యలున్నా ఒక్కోటి పరిష్కరిస్తూ ముందుకెళ్తాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జేఎన్టీయూహెచ్‌లో నాణ్యమైన విద్యపై యాజమాన్యాలతో సమావేశం

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో/సిటీబ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తరహాలో జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి పక్కాగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ సహా వివిధ శాఖల్లో ఖాళీలను గుర్తించి వాటిని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భర్తీ చేసే యూపీఎస్సీ విధానాన్ని అధ్యయనం చేశామన్నారు. పూర్తి పారదర్శకతతో నిర్దిష్ట కాలంలో ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా జాబ్‌క్యాలెండర్‌ను అసెంబ్లీ సమావేశాల్లోనే విడుదల చేస్తామని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 'నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య'అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూ హైదరాబాద్‌లో కాలేజీ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 31 నాటికి ఖాళీ పోస్టులను గుర్తిస్తామనీ, జూన్ రెండు నాటికి నోటిఫికేషన్లను జారీ చేస్తామనీ, డిసెంబర్ తొమ్మిది నాటికి నియామకాల ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి అనుమానమూ అక్కర్లేదనీ, ఈ విద్యాసంవత్సరం నుంచి సకాలంలో వాటిని చెల్లించేందుకు ...6లో

విద్యార్థి దశ నుంచే

నైతిక విలువలు

డ్రగ్స్ నిర్మూలనకు యువత తోడ్పాటందించాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో నైతిక విలువల బోధనకు కేరళ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో...13లో

హైదరాబాద్‌లో

గ్లోబల్ ఏఐ సదస్సు

సెప్టెంబర్ 5,6 తేదీల్లో నిర్వహణ

లోగోను ఆవిష్కరించిన సీఎం



వివరాలు 13లో

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే

అరికెపూడి గాంధీ

కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి



వివరాలు 13లో

అంతటా అంబానీ ముచ్చటే

కోట్ల రూపాయల ఖర్చుతో కుమారుడి పెండ్లి వేడుకలు



దేశంలో ఆర్థిక అసమానతలపై జరుగుతున్న చర్చ

కొంత మంది చేతుల్లోనే దేశ సంపద

సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలుండాలి : మేధావులు, ఆర్థిక నిపుణుల సూచన

అంబానీ కుమారుడి పెండ్లి వేడుకలు కొన్ని నెలలుగా జరుగుతున్న కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఎన్నికలు జరిగాయి. ప్రజలు కొత్త ప్రభుత్వాలకు ఓటు వేశారు. భారత్ క్రికెట్ జట్టు టీ20 ప్రపంచ కప్‌ను గెలిచింది. విదేశీ సినిమాలతో పాటు భారతీయ సినిమాలు సైతం ఆస్కార్‌లు గెలుచుకున్నాయి. కొన్ని దేశాల మధ్య యుద్ధాలు మొదలై.. కొనసాగుతున్నాయి. ఈ యుద్ధాల్లో ప్రజలు కూడా మరణించారు. భారత్‌లో లక్షలాది మంది ప్రజలు కనీసం తిండికి సైతం నోచుకోలేకపోతున్నారు. పిల్లలకు పౌష్టికాహారం లభించటంలేదని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అయితే, దేశ సంపదంతా గుప్పెడు మంది చేతుల్లో పోగై ఉండటంతో దేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. వీటిలో దేనికి ఇవ్వని ప్రాధాన్యత నిస్తూ మీడియా ఈ వేడుకల చుట్టే తిరుగుతోంది.



న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ చిన్న కుమారుడి పెండ్లి వేడుకలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. అంబానీ పుత్రుడి వివాహానికి ప్రపంచ నలుమూలల నుంచి అతిథులు హాజరయ్యారు. వాస్తవానికి ఈ పెండ్లి వేడుకలు గత కొన్ని నెలలుగా జరుగుతున్నాయి. ప్రతి సందర్భంలోనూ ప్రముఖుల హాజరుతో బాలీవుడ్ సినిమాలను సైతం మరిపించేలా కార్యక్రమాలు జరిగాయి. వేడుకల కోసం అంబానీ అక్షరాల రూ.5 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు కొన్ని కథనాలు వెల్లడిస్తున్నాయి. పెండ్లి వేడుకలు ప్రారంభమైనప్పటి నుంచి అనేక వార్తలు, మీమ్‌లు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అంబానీ కుమారుడి పెండ్లి సమయంలోనే జియో నెట్‌వర్క్ చార్జీలను పెంచటం కూడా ఒకింత చర్చకు దారి తీసింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతీ రంగానికీ చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకలకు హాజరవ్వటం అందరి దృష్టిని అటు వైపు మళ్లించేలా చేసింది. ఇక ప్రధాన స్రవంతి మీడియా అయితే ప్రజా సమస్యలను గాలి కొదిలి ఈ వేడుకలకు కనీవినీ ఎరుగని కవరేజి కల్పిస్తోంది.అయితే, ఈ పెండ్లి వేడుకలకు చేసిన ఖర్చు పైనే అంతటా చర్చ జరుగుతున్నది. ఆర్థిక అసమానతలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ఇలాంటి ఘటనలు తెలియజేస్తున్నాయని కొందరు మేధావులు అంటున్నారు. కార్పొరేట్లు, బడా వ్యాపారవేత్తలకు ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించటం కారణంగానే ధనవంతులు ఇంకా ధనవంతులు అవుతున్నారని చెప్తున్నారు. దేశంలో లక్షలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలు తమ ఇండ్లలో కనీసం రెండు రోజులు కూడా వివాహాది కార్యక్రమాలను నిర్వహించలేకపోతున్న ప్రస్తుత తరుణంలో.. అంబానీ లాంటి 'సంపన్న వివాహ వేడుకలు' సామాన్య ప్రజలకు ఆశ్చర్యం కలిగించక మానవని అంటున్నారు.

అంబానీ ఇంట జరిగిన పెండ్లి వేడుకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో నిరంతరం చక్కర్లు కొడుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా అంబానీ కుటుంబం వారు గత ఏడు నెలల్లో సగటున ప్రతి ఐదు వారాలకు ఒక ఈవెంట్‌ను నిర్వహించటం గమనార్హం. చివరగా, పెండ్లి తంతు ఈనెల 12న ముగిసింది. 14న గ్రాండ్ రిసెప్షన్ జరగనున్నది.

> తనయుడి వివాహం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న అంబానీ ధోరణి రెండు ప్రపంచాలను ప్రతిబింబిస్తోంది. ఇలాంటి వేడుకలు చూస్తున్నపుడు ప్రజల్లో ఆర్థిక అసమానతలకు సంబంధించిన భావోద్వేగాలు ఉత్పన్నం కాక మానవు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అనేక మంది ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఇందులో మహిళలు, చిన్నారులూ ఉన్నారు. ఇలాంటి తరుణంలో లక్షలాది మంది ప్రజలు తినడానికి తిండి, ఉండటానికి ఇండ్లు, కట్టుకోవటానికి బట్టలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అంబానీ కుమారుడి పెండ్లికి, కొనసాగుతున్న మారణహోమానికి మధ్య ఉన్న వైరుధ్యం రెండు విభిన్న ప్రపంచాలే. ఒకపక్క ప్రజలు పడుతున్న ఇబ్బందులు... మరోపక్క కోట్లాది రూపాయల ఖర్చుతో ఒక వ్యక్తి, ఆయన కుటుంబానికి చెందిన సంతోషమైన వేడుక.. ప్రస్తుతం ఈ రెండు సందర్భాలూ రెండు విభిన్న పరిస్థితులను ఆవిష్కరిస్తున్నాయి.

గాజా సేఫ్ జోన్‌పై ఇజ్రాయిల్ దాడి

71మంది మృతి, 289మందికి గాయాలు

హమాస్ మిలటరీ వింగ్ అధిపతే లక్ష్యం ?

6లో..



బుస్..బుస్..

నిన్న గురుకులాల్లో ఎలుకలు..

నేడు పాఠశాలలో పాములు

ముగ్గురు విద్యార్థులకు కాటు

13లో.



అటూ..? ఇటూ..?

- మాజీ మంత్రి తలసాని పయనమెటు...?
- అఖిలేశ్‌తో చెప్పించినా ఫలితం లేకపాయే
- కాంగ్రెస్‌లోకి ఆయన రాకను వ్యతిరేకిస్తున్న కోట నీలిమ
- దీంతో తలసానికి గాలమేస్తున్న బీజేపీ
- త్వరలోనే కమలం గూటికి చేరతారంటూ ప్రచారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్.. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో హైదరాబాద్‌లో ఓ వెలుగు వెలిగిన నేత. తెలంగాణ వచ్చిన తర్వాత ఇక్కడ టీడీపీ ప్రభావం తగ్గిపోవటంతో కొంతకాలం ఆయన ప్రభ కూడా తగ్గింది. దీంతో అప్పటి అధికార పార్టీ అయిన బీఆర్ఎస్‌లో చేరిన తలసాని... ఆ తర్వాత తిరిగి నగర రాజకీయాల్లో చక్రం తిప్పారు. కేసీఆర్ క్యాబినెట్‌లో బెర్తు దక్కించుకుని ఆరేడేండ్లపాటు తన హవా కొనసాగించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో ఆయన పరిస్థితి డోలాయమానంలో పడింది. దీంతో తలసాని హస్తం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే గుసగుసలు ఆ మధ్య వినబడ్డాయి. ఇందులో భాగంగా ఆయన 'ఇండియా బ్లాక్'లో కీలక నేతగా ఉన్న ఎస్పీ అధినేత, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌తో మంతనాలు జరిపారన్నది విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ హయాం నుంచి అఖిలేశ్‌తో ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా, ఇక్కడ సీఎం రేవంత్‌పై ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని తెలిసింది. అయితే అధికార పార్టీలోకి రాగానే తనకు మంత్రి పదవినివ్వాలంటూ పార్లమెంటు ఎన్నికలకు ముందు తలసాని షరతు విధించటంతో అప్పటికి ఆయన చేరిక ఆగిపోయింది. హైదరాబాద్ జిల్లా నుంచే ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ (ఖైరతాబాద్) బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆయనకు ఇవ్వకుండా, తలసానికి మంత్రి పదవినిస్తే లేనిపోని తలనొప్పులు వస్తాయని సీఎం రేవంత్ భావించారు. అందువల్లే ఆయన్ను చేర్చుకునే విషయమై అప్పుడు స్పష్టతనివ్వలేదు.



లోక్‌సభ ఎన్నికలు ముగిసి, అధికార పార్టీలోకి ఫిరాయింపులు ఊపందుకున్న ప్రస్తుత తరుణంలో కొద్ది రోజుల కిందట తలసాని కూడా సీఎంతో మరోసారి సంప్రదింపులు జరిపినట్టు వినికిడి. గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్న వేళ... తలసాని కూడా ఆ విషయమై సీరియస్‌గానే ఆలోచించారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి తలసాని చేతిలో ఓడిపోయిన కోట నీలిమ ఆయన రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. ఢిల్లీలోనే ఎక్కువ కాలం ఉండటం, ఆ క్రమంలో కాంగ్రెస్ పెద్దలతో పరిచయాలు ఉండటం, స్వయంగా ఆమె భర్త కూడా ఏఐసీసీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో... నీలిమ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి 'సనత్‌నగర్' పరిస్థితిని ఏకరువు పెట్టినట్టు అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తలసాని కాంగ్రెస్‌లోకి వస్తే, ఆయనపైన్నే పోటీ చేసి ఓడిపోయిన తన భవిష్యత్తు అంధకారంలో పడుతుందంటూ ఆమె రాహుల్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన... సీఎం రేవంత్‌కు చెప్పి, తలసాని చేరికకు బ్రేకులు వేశారన్నది గాంధీ భవన్ వర్గాల టాక్.

ఈ విషయం తెలుసుకున్న బీజేపీ, మాజీ మంత్రికి మెల్లగా గాలమేస్తున్నట్టు తెలిసింది. సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రిగా ఉండటంతో, ఆయన తలసానిని తమ పార్టీలోకి రావాలంటూ ఆహ్వానిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో త్వరలోనే తలసాని బీఆర్ఎస్‌ను వీడి, బీజేపీలో చేరనున్నారనే చర్చ కొనసాగుతున్నది. మరికొద్ది రోజుల్లో ఈ విషయమై స్పష్టతరానుంది.

కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్సీ నవీన్‌రావు

మరోవైపు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ నవీన్‌రావు కూడా త్వరలోనే ఆ పార్టీకి గుడ్ బై చెప్పనున్నారని సమాచారం. ఆదివారం లేదా సోమవారం ఆయన సీఎం సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. నవీన్‌రావు ఆ పార్టీలో చేరితే బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్సీల సంఖ్య ఏడుకు చేరుతుంది.

22న గద్వాలకు కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు ఈనెల 22న గద్వాల పర్యటనకు వెళ్లనున్నారు. శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌తో గట్టు మండలం సర్పంచ్ సంఘాల మాజీ అధ్యక్షులు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు హనుమంతు నాయుడు భేటీ అయ్యారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు.

నవతెలంగాణ సెక్యూరిటీ సైదులుకు పితృవియోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



నవతెలంగాణ చర్లపల్లి యూనిట్ ఎల్‌డీ భవన్‌లో సెక్యూరిటీగా పనిచేస్తున్న తెలుసూరి సైదులు తండ్రి రామకృష్ణ (79) శనివారం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామం. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. రామకృష్ణ మరణం పట్ల నవతెలంగాణ సీజీఎం పి ప్రభాకర్, ప్రింటింగ్ ప్రెస్ జనరల్ మేనేజర్ రఘు, మార్కెటింగ్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ(ఎం) గట్టుప్పల్ మండల కార్యదర్శివర్గ సభ్యులు బండా శ్రీశైలం, మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, గట్టుప్పల్ మండల కమిటీ సభ్యులు రాచమల్ల వెంకటరెడ్డి, గ్రామ సభ్యులు పూసపాటి శంకరప్ప, మాతంగి సురేందర్, ఐతరాజు ఆంజనేయులు, మాధగోని జంగయ్య ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. నవతెలంగాణ ప్రింటింగ్ ప్రెస్ మెయింటెనెన్స్ ఇన్‌చార్జ్ సుధీర్, మిషన్ ఆపరేటర్లు సత్యం, నగేష్, రాజేష్, రంజిత్ ఆయన పార్థివదేహానికి నివాళు లర్పించారు.

హిరాయామా బాధితునికి సర్జరీ విజయవంతం
టీఎక్స్ హాస్పిటల్స్ వైద్యుల ఘనత

హైదరాబాద్ : హిరాయామా వ్యాధితో బాధపడుతున్న రోగికి టీఎక్స్ హాస్పిటల్స్‌లో చేసిన సర్జరీ విజయవంతమైంది. 1959లో మొదటిసారిగా ఈ అరుదైన న్యూరాలాజికల్ చికిత్స విధానాన్ని కనుగొన్నారు. ప్రస్తుతం ఈ చికిత్స విజయవంతం అవ్వడం వైద్యరంగంలో పెద్ద పురోగతిని సూచించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రోగులకు కొత్త ఆశను చిగురింపజేస్తోంది. ఈ సర్జరీలో ఆస్పత్రికి న్యూరో సర్జన్ డా॥ నరేష్ కుమార్ గజ్జాల నేతృత్వంలో అనస్తటిస్ట్ డా॥ సందీప్ కుమార్‌తో పాటు డా॥ కీర్తికర్ రెడ్డి, డా॥ దీపక్ రాజు, మిస్టర్ రవీంద్ర రెడ్డి సహకారం అందించారు. సర్వికల్ స్పైన్‌లో కాంప్రెషన్ తగ్గించడానికి ఆధునిక పద్ధతులను ఉపయోగించి ఈ సర్జరీని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డా॥ నరేష్ కుమార్ మాట్లాడుతూ, "హిరాయామా వ్యాధి వల్ల చేతులు, మణికట్టు కండరాల్లో బలహీనత కలిగిస్తుందని, ఇది సాధారణంగా వయస్సుతో వచ్చే వ్యాధి అని తెలిపారు. 20 ఏండ్ల వయసున్న పురుషులను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ కేసులు తక్కువగానే ఉన్నప్పటికీ, ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. మెడ భాగాన వెన్నుముకలో వచ్చే లోపాన్ని ఎంఆర్ఐ పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని వెల్లడించారు. ఈ వ్యాధి సోకిన రోగి సర్జరీ తరువాత ఎటువంటి లోపం లేకుండా కోలుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా॥ శ్రీకాంత్ వొడ్నాలా తదితరులు పాల్గొన్నారు.



IN THE COURT OF HON'BLE ADDL DISTRICT AND SESSIONS JUDGE, MEDAK DISTRICT AT: MEDAK

O.S.No.20 of 2022

BETWEEN:

Siraj Panjwani ...Plaintiff

AND

Chintala Malla Reddy and others ...Defendants

25.Voma Aparna W/o. V.Someshwar, Aged 43yrs, Occ: House wife, R/o.Flat No.202, Anand Nagar Colony, Basar Apartments, Khairtabad Hyd
26.Baddam Venu Kumar S/o. B.Ramulu Aged 31yrs, Occ: Pvt Employee R/o.H.No.3-16, Ghanpur Village & Toopran (M) Medak Dist,
27.Daripally Varaprasad S/o. D.Krishna Aged20yrs, Occ:Student R/o.H.No.3-46, Konthanpally (V) Shivampet (M), Medak Dist
28.Smt.Pula Padma W/o.Pula Ganesh Aged 32yrs, Occ:House wife, R/o.B-433, AG Colony, ESI Khairtabad Hyd
30.Kaveti Prakash S/o.K.Rangaiah Aged 37yrs, Occ: Business, R/o. H.No.21-627/4/1, Shivalayam Nagar, Jeedimetla, Quthbullapur, Medchal-Malkajgiri district-55
31.Sri Kaveti Prabhakar S/o. K.Rangaiah Aged 34yrs, Occ: Business, R/o.H.No.21-633/1A, Shivalayam Nagar, Jeedimetla, Quthbullapur, Medchal-Malkajgiri district-55
32.Ch.Bharath ReddyS/o.Ch.Gnga Reddy Aged 34yrs, Occ: Business, R/o.H.No.4-42-576, Papi Reddy Nagar, A.B.Colony, Balanagar, Medchal-Malkajgiri district-37
37.Jakkula Sathyanarayan S/o. Jakkula Pochaiah aged 48 yrs, Occ:Business, R/o.1-68, Ramai pally (V), Manoharabad (M), Medak Distritc-502336
38.Teegala Srikanth S/o.Teegala Kistaiah Aged 29 yrs, Occ: Pvt Employee, R/o.H.No.10-20/2, Toopran(V) & (M), Medak District
39.Smt.Ch.Saritha W/o.Ch.Vittal Reddy Aged 35yrs, Occ: House wife, R/o.H.No.4-7-149/1, Prashanth Nagar, Sangareddy town &dist,
40.Rina Pareek W/o.Ravish Kumar Pareek Aged 34yrs, Occ:House wife, R/o.H.No.55,Shankarampet (R) (V) & (M), Medak Dist
41.Nisha Pareek W/o.BineetKumar Pareek Aged 37yrs, Occ: House wife, R/o.H.No.9-1-34/17, Bapu Nagar, Langer House, Hyderabad
42.Amuda Srinivas S/o.Amuda Jagannatham Aged 47yrs, Occ: Business, R/o H.No.5-86 Donthi (V) ,Shivampet, (M)Medak District.
43.Pothukani Maruthi S/o Late. P.Shankaraiah Aged 47yrs Occ: Business ,R/o.H.No.2-3-734/B/44/B, Shankar nagar, Venkateshwara Temple, Golnaka, Amberpet Hyd
46.Shaik Mohsin S/o.Shaik Saleem Aged 34yrs,Occ:Business, R/o.H.No.9-1-88/1, Hasmathpet, Muslim Basthi, Old Bowenpallly, Secunderabad
49.Ganapuram Venkat Reddy S/o. G.Narsimha Reddy Aged 40 yrs, Occ: Business, R/o.H.No.2-48, Hanuman Temple, Nagaram, Keesara (M), Medchal-Malkajgiri.
53.Akula Srikanth S/o.Akula Sattaiah Aged34yrs,Occ:Business, R/o.H.No.33-8, RajivGandhiNagar, Besides Hetero Drugs, Suraram, Quthbullapur, Medchal District, Telnagana-55
54.Devatha Sai Teja S/o. Devatha Srinivas Aged 21yrs, Occ:Business R/o. H.No.13-67, Toopran Village & (M), Medak Dist
59.GuttakindhiSrilathaW/o.G.Balraj Aged 30yrs, Occ:House wife, R/o. H.No.6-490/1, Dwaraka Nagar, HMT Township, Cintal, Hyderabad
60.P.Swapna W/o.P.Satish, Aged 32yrs, Occ:House wife, R/o.H.No. 1-31-207, Indira Nagar, Near Hanuman Temple, Tirumalagiri Secunderabad
62.Bandari Satyanarayana S/o B.Sailu Aged 49yrs, Occ:Business, R/o H.No.3-7/6 Shiva Shakti Sai Colony Nagaram, Hyd-83.

Please take notice that, the above named plaintiff filed the above suit before the Hon'ble Principal District & Sessions Judge, Medak District at Medak against all of you and suit is posted for your appearance on 6-08-2024. You are hereby summoned to appear before the above said court in person or through a pleader duly instructed to answer all material questions relating to the above suit or who shall be accompanied by some person able to answer all such questions **on 06-08-2024 at 10:30 A.M** to answer the claim or any defense. If you fail to appear on the day mentioned above the matter will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT)
B.M.Krishna Reddy
Advocates
Plot No.31, Hi-Tech Towers
Swarnadhama Nagar Old
Bowenpally, Secunderabad- 11

జెన్‌కో ఏఈ పరీక్షా కేంద్రం మార్పు

- చివరి నిమిషంలో నిర్ణయం
- నేడే పరీక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీజెన్‌కో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్స్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కెమిస్ట్రీ) ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) కేంద్రం చివరి నిమిషంలో మారింది. ఆదివారం ఈ పరీక్ష ఉండగా, పరీక్షా కేంద్రాన్ని మారుస్తున్నట్టు టీజీ జెన్‌కో యాజమాన్యం శనివారం సాయంత్రం పేర్కొంది. ఈ మేరకు అభ్యర్థులకు సమాచారం అందించినట్టు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాలతో కర్మన్‌ఘాట్ రోడ్‌లోని కేపీఎమ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ (టీసీ కోడ్-33905) సెంటర్‌ను మార్చారు. ఈ సెంటర్‌లో తొలి షిఫ్టులో ఉదయం 9 నుంచి 10.40 నిముషాల వరకు నిర్వహించే మెకానికల్, కెమిస్ట్ సీబీటీని, మూడో షిఫ్ట్‌లో సాయంత్రం 5 నుంచి 6.40 నిముషాల వరకు నిర్వహించే ఎలక్ట్రానిక్స్ అండ్ సివిల్ సీబీటీని సైదాబాద్ సంతోష్‌నగర్ వినయ్‌నగర్‌లోని భోజరెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ (టీసీ కోడ్-1732)కి మార్చినట్టు తెలిపారు. అలాగే కేపీఎమ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ కేంద్రంలో రెండో షిఫ్టులో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.40 వరకు జరిగే ఎలక్ట్రికల్ సీబీటీని బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ విలేజ్‌లో ఉన్న ఎమ్‌వీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ (టీసీ కోడ్-2406) సెంటర్‌కు మార్చారు. తెల్లారితే పరీక్ష ఉందనగా, హఠాత్తుగా పరీక్షా కేంద్రం మార్పుపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పరీక్షార్థులకూ సమస్యలు తప్పేలా లేవు. దానికి తోడు పరీక్షా కేంద్రాలను కొత్త సెంటర్లకు మారుస్తూ సంస్థ వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు ఉన్నాయనీ, అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు వెళ్లాలని టీజీజెన్‌కో తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రం మార్పును గమనించి, సహకరించాలని ఆ సంస్థ కోరింది.

1,64,652 మంది హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

- అభ్యర్థులకు నిరంతరం అందుబాటులో డీఎస్సీ స్టేట్ సెల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ రాతపరీక్షలు షెడ్యూల్ ప్రకారమే ఈనెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. డీఎస్సీకి 2,79,957 మంది దరఖాస్తు చేశారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1,64,652 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. 14 మంది అభ్యర్థులు ఇచ్చిన ఆన్‌లైన్ డేటాలో సమాచారం సరిగా లేనందున వారికి పరీక్షా కేంద్రాలు దూరంగా కంప్యూటర్ సిస్టం ఇచ్చిందని తెలిపారు. అభ్యర్థుల సబ్జెక్టు, మీడియం వేరుగా ఉన్నందున ఈ వ్యత్యాసం వచ్చిందని పేర్కొన్నారు. ఈ లోపాన్ని వెంటనే గమనించి హాల్‌టికెట్లను సవరించి ఆ అభ్యర్థులకు డీఎస్సీ స్టేట్ సెల్ ద్వారా ఫోన్ సమాచారం ఇచ్చామని వివరించారు. ఈ విధమైన లోపాల సవరణ, సమాచారం సూచనల కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో డీఎస్సీ స్టేట్ సెల్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ వివరాలు మీడియా, పాఠశాల విద్యాశాఖ వెబ్ పోర్టల్, ట్విట్టర్ ద్వారా ప్రకటించామని పేర్కొన్నారు. డీఎస్సీ స్టేట్ సెల్ నెంబర్లు 9154114982, 6309998812 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

సచివాలయం భద్రత మార్పుపై తర్జనభర్జన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం భద్రతా బాధ్యతల్ని తెలంగాణ స్పెషల్ పోలీసుల (టీజీఎస్పీ) నుంచి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్)కు అప్పగించే విషయంపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతుంది. దీనిపై ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తుది నిర్ణయం కోసం అధికారులు ఎదురు చూస్తున్నట్టు సమాచారం. కొత్త సెక్రటేరియట్ ప్రారంభం నుంచి తెలంగాణ స్పెషల్ పోలీసులే ఈ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్ర కొత్త సెక్రటేరియట్ ప్రారంభోత్సవం వరకు అవే బాధ్యతల్ని ఎస్పీఎఫ్ నిర్వహించింది. తాజాగా మళ్లీ సెక్రటేరియట్ భద్రతా బాధ్యతల్ని ఎస్పీఎఫ్‌కే ఇస్తారనే చర్చ సచివాలయ వర్గాల్లో జరుగుతుంది.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

O.A. No.452 OF 2024

Between :

M/s. HDFC Bank Ltd, Rep, by its Authorized Officer, Office at D.No.50-96-5, Plot No.175, Opp. Old SBH, Near NRI Hospital, Seethammadhara, Visakhapatnam ... APPLICANT

And

1) **M/s Style N Style, (Retail Sale In Specialised Stores of Pharmaceutical and Medical Goods, Cosmetic And Toilet Articles; Textiles, Clothing, Footwear And Leather Goods Products) Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao,** Door No.12-13/60, Main Road, Tarnaka, Hyderabad, Telangana, AP-500 007.
2) **M/s Style N Style, Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao,** Dr.No.37-1-58, Trunk Road, Ongole-523 001.
3) **Mr. Perakam Venkata Subba Rao, S/o Mr. P. Chenchaiah,** D.No. 12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
4) **Mr. Pati Bandla Sreeramulu, S/o Mr. Pari Bandala Veera Swamy,** D.No.12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
5) **Mrs. Perakam Sree Lakshmi, W/o Mr. Perakam Venkata Subba Rao,** D.No.12-13-1157/202, Street No.11, Narayana Concept School, Tarnaka, Hyderabad, Telangana Formerly, AP-500007.
6) **Mr. Idimukkala Srikrishna Prasad, S/o Gopalakrishnaiah,** D.No. 48-1-35C, Marathipalem, Ward-14, Ongole, Andhra Pradesh-523 001.
7) **Mr. Golla Prasad Babu, S/o Kuppuswamy,** D.No.26-23-25, Gandhinagar, Vijayawada, Andhra Pradesh-520 003.

... DEFENDANTS

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANTS NO. D1 to D.6 BY WAY OF PAPER PUBLICATION

D.1 M/s Style N Style, (Retail Sale In Specialised Stores of Pharmaceutical and Medical Goods, Cosmetic And Toilet Articles; Textiles, Clothing, Footwear And Leather Goods Products) Rep by its Mang. Partner. Mr. Perkam Venkata Subba Rao, Door No.12-13/60, Main Road, Tarnaka, Hyderabad, Telangana, AP-500 007.
D.2 Mr. Idimukkala Srikrishna Prasad, S/o Gopalakrishnaiah, D.No. 48-1-35C, Marathipalem, Ward-14, Ongole, Andhra Pradesh-523 001.

... DEFENDANTS

1. WHEREAS, the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m or at such time immediately thereafter according to the convenience of Tribunal on **02/08/2024**. You are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader / Advocate duly instructed.
4. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the 2nd day of July, 2024

Signature of the Officer
Authorized to Issue Summons

ఇక అన్నీ సవాళ్లే!

- ఇప్పటికే అన్నదాతల నుంచి తీవ్ర వ్యతిరేకత
- సైనికుల నుంచీ ప్రతిఘటన
- బలం పుంజుకుంటున్న ప్రతిపక్షం
- అగ్నిపరీక్ష కాబోతున్న శాసనసభ ఎన్నికలు



కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రభుత్వం మూడోసారి కొలువుదీరింది. అయితే గత రెండు పదవీకాలాలతో పోలిస్తే ప్రస్తుత పాలన సవాళ్లతో కూడుకున్నదన్న విషయం ఆయనకు తెలియనిది కాదు. వాస్తవానికి మోడీ పొందిన రాజకీయ శిక్షణ, ఆయన గడించిన అనుభవం సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహించేందుకు సిద్ధంగా లేవు. దిగువసభలో ఆయన పార్టీకి 240 మంది సభ్యుల బలం ఉంది. ఏ ఒక్క భాగస్వామ్య పక్షం ప్రభుత్వాన్ని ఒంటరిగా పడదోయలేదు. అదే ఆయన ధీమా. కాబట్టే గత రెండు దఫాలుగా ఏ విధంగా పరిపాలించారో ఇప్పుడూ అదే పంథాలో నడుస్తున్నారు.

న్యూఢిల్లీ : సార్వత్రిక సమరంలో బీజేపీ, దాని మిత్రపక్షాలకు వచ్చింది మరీ స్వల్ప ఆధిక్యత ఏమీ కాదు. ప్రభుత్వాన్ని సజావుగా నడపడానికి ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలం సరిపోతుంది. అయితే గత రెండు దఫాలుగా సాగినట్టు ఇప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యాన్ని చెలాయిస్తానంటే కుదరదు. కుస్తీ పోటీలో మల్లయోధులు ప్రత్యర్థులపై ఏ విధంగా పంచ్‌లు విసురుతారో ఇప్పుడు మోడీపై కూడా అలాంటి పంచ్‌లనే విసిరేందుకు ప్రత్యర్థులు సిద్ధంగా ఉన్నారు. ఛాంపియన్‌ను మట్టికరిపించవచ్చునని వారు ధీమాతో ఉన్నారు. రాహుల్ గాంధీ, ఇండియా కూటమిలోని ఇతర భాగస్వాములు ఇప్పటికే పోటీకి సై అంటున్నారు. 2014, 2019 ఎన్నికల అనంతరం ఇలాంటి దృశ్యం మచ్చుకైనా కన్పించలేదు. ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బలతో నీరసపడిన ప్రతిపక్షాలు బలమైన ప్రత్యర్థిని ఎలా ఢీకొనగలవు? కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం పూర్తి భిన్నంగా కన్పిస్తోంది.

అంత తేలిక కాదు

ఈ సవాళ్లనన్నింటినీ మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుంది. పూర్తి సంఖ్యాబలం లేనప్పుడు, ప్రతిపక్షాల నుంచి ముప్పేట దాడి జరుగుతున్నప్పుడు సవాళ్లను ఎదుర్కోవడం, సమస్యలను పరిష్కరించడం అంత తేలిక కాదు. గతంలో మాదిరిగా అధికారాన్ని చెలాయించడం ఇప్పుడు సాధ్యం కాదు కదా! పైగా ఐదు సంవత్సరాల టెస్ట్ మ్యాచ్‌లో మరింత బలం పుంజుకోవడానికి ప్రతిపక్షాలకు తగిన సమయం కూడా ఉంటుంది.

రాబోయేది ఎన్నికల సీజనే

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలు బలం పుంజుకున్నాయి. రెట్టించిన సమధికోత్సాహంతో ప్రత్యర్థిని కంగు తినిపించేందుకు సర్వ శక్తులను కేంద్రీకరిస్తున్నాయి. ఈ ఏడాది చివరలో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అటు బీజేపీకి, ఇటు ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌కు ఈ ఎన్నికలు తొలి అగ్ని పరీక్షగా నిలవబోతున్నాయి. ఇక వచ్చే సంవత్సరం ప్రారంభంలో రాజధాని ఢిల్లీలో ఎన్నికలు జరుగుతాయి. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా ద్వయం నుంచి బీజేపీ గట్టి పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఊపిరి పీల్చుకోవడానికి రాజకీయ పార్టీలకు కొంత సమయం దొరుకుతుంది. వచ్చే ఏడాది సెప్టెంబరులో బీహార్‌లో శాసనసభ ఎన్నికల సమరం జరుగుతుంది. ఆయా రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో విజేతలు ఎవరైనా వారు 2029 లోక్‌సభ ఎన్నికల సమరానికి రెట్టించిన ఉత్సాహంతో అడుగులు వేస్తారు.

చట్ట సవరణలు ఈజీ కాదు

ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీకి ఆది నుంచే సవాళ్లు మొదలయ్యాయి. చట్ట సవరణల విషయంలో బీజేపీ తన వైఖరిని మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిత్రపక్షాలు, ప్రతిపక్షాలతో సర్దుకుపోవాల్సి వస్తుంది. మందబలంతో కీలక బిల్లులకు ఆమోదం పొందిన అప్పటి శకం ముగిసింది. అలా సాగక పోవచ్చు. సార్వత్రిక ఎన్నికల్లో 400కు పైగా స్థానాలు సంపాదిస్తామని మోడీ మొదలు బీజేపీ నేతలందరూ బల్లగుద్ది చెప్పడంతో ప్రజల్లో రాజ్యాంగంపై అభద్రత నెలకొంది. రాజ్యాంగ సవరణలు చేయాలని ప్రభుత్వం ఇప్పుడు భావించినా అనేక అవరోధాలు తప్పవు. ప్రతిపక్షాలను కూడా విశ్వాసంలోకి తీసుకోవాల్సి వస్తుంది. అంటే మోడీ శకంలో బీజేపీ రాజకీయాల మౌలిక నిర్మాణంలో మార్పులు తప్పవన్న మాట.

వారి నుంచి తీవ్ర వ్యతిరేకత

పార్లమెంట్ తొలి సమావేశాలను గమనిస్తే మున్ముందు యుద్ధ వాతావరణం తప్పక పోవచ్చన్న అభిప్రాయం కలుగుతోంది. అధికార, ప్రతిపక్షాలు ఇరు వైపులా మోహరించాయి. దేనిపైనా ఏకాభిప్రాయం కుదరలేదు. ఎవరూ పట్టువిడుపులు ప్రదర్శించలేదు. నూతన ప్రభుత్వం రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మోడీ కోసం 'జై జవాన్, జై కిసాన్' వల ఎదురు చూస్తోంది. గత రెండు దశాబ్దాల కాలంలో ఆయన తనకు తాను రైతులు, సైనికుల ఛాంపియన్‌గా ముద్ర వేసుకున్నారు. అయితే అన్నదాతలు, సైనికుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ పరాజయాలు మూటకట్టుకోవాల్సి వచ్చింది. ఈ రెండు తంగతుల వారు ఎక్కువగా నివసిస్తున్న ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో బీజేపీకి ఎదురు దెబ్బలు తప్పలేదు. దానికి కారణాలు అనేకం.

తొందరపాటు చర్యలతో చేటు

శివరాజ్ సింగ్ చౌహాన్‌ను వ్యవసాయ మంత్రిగా నియమించడం బీజేపీ తీసుకున్న మంచి నిర్ణయంగా చెప్పవచ్చు. సుమారు రెండు దశాబ్దాలు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఆ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఆయనకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇస్తుందా అనేది అనుమానమే. మోడీపై అన్నదాతల్లో ఎంత వ్యతిరేకత ఉన్నదో సైనికులు, వారి కుటుంబాల నుంచి కూడా అంతే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న అహంకారపూరితమైన నిర్ణయాలు, తొందరపాటు చర్యలే దీనికి కారణం. త్రివిధ దళాల్లో ఉద్యోగుల నియామకం కోసం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం తీవ్ర విమర్శను చవిచూసింది. వ్యవ సాయ చట్టాల మాదిరిగానే దీనిపై కూడా పెద్దగా ప్రభుత్వం చర్చ జరప లేదు. తాజాగా తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం మరింత గందరగోళాన్ని సృష్టిం చింది. ఉదాహరణకు ఒకే బంకర్‌లో అగ్నివీర్ కింద, అగ్నిపథ్ కింద ఎంపికైన సైనికులు ఉన్నారనుకుందాం. శత్రువుల బాంబు దాడిలో వారు చనిపోయారను కుందాం. అప్పుడు వారికి వేర్వేరుగా నష్టపరిహారం చెల్లించడం ఎలా సమర్థనీయం?

సాహసోపేత సంస్కరణలు తప్పవు

అన్నదాతల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తానని మోడీ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. వ్యవసాయ చట్టాలు రైతుల ఆగ్రహానికి గురయ్యాయి. వ్యవసాయ సంస్కరణలపై ఇప్పటికైనా ప్రధాని మనసు మార్చుకుంటారా? ప్రతిపక్షాలను సంప్రదిస్తారా? ఈ ప్రశ్నలకు కాలమే జవాబు చెప్పాలి. పునర్వైభవం పొందిన ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా స్పందిస్తాయా అనేది కూడా అనుమానమే. ఎస్‌బీఐకి చెందిన ఆర్థిక పరిశోధనా విభాగం ఈ వారంలో విడుదల చేసిన నివేదిక వ్యవసాయంపై ఓ దారి చూపింది. కనీస మద్దతు ధరల విధానం చాలా తక్కువ మంది రైతులకు మాత్రమే మేలు చేస్తోందని, వ్యవసాయోత్పత్తిలో దాని వాటా ఆరు శాతం కంటే ఎక్కువగా ఏమీ లేదని ఆ నివేదిక తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో మరిన్ని సాహసోపేత సంస్కరణలు చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది.

బీజేపీ న్యాయవ్యవస్థను అవమానపరించింది : హేమంత్‌సోరెన్



న్యూఢిల్లీ : ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు శుక్రవారం లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు బెయిల్‌ని మంజూరు చేసినప్పటికీ ఇదే కేసులో ఆయనకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు సీబీఐ కస్టడీని పొడిగించింది. దీంతో కేజ్రీవాల్ జైల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలపై జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ మండిపడ్డారు. బీజేపీ న్యాయవ్యవస్థను అవమానపరి చిందని ఆరోపించారు. ఈ కేసులో అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, శనివారం ఢిల్లీలోని జనపథ్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ నివాసంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఆమెను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'నేను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సోనియాగాంధీని కలవలేదు. అందుకే ఆమెను కలవడానికి వచ్చాను. జరగబోయే జార్ఖండ్ ఎన్నికలపై చర్చలు కొనసాగుతున్నాయి. భారతీయులు చాలా సహనశీలురు. వారు దేనికైనా సహకరిస్తారు. దేన్నైనా సహిస్తారు. అదే వారు సహించలేకపోతే ఓటు ద్వారా తమ వాణిని వినిపిస్తారు. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో బీజేపీ న్యాయవ్యవస్థను కించపరిచింది. కేజ్రీవాల్‌కు త్వరలో బెయిల్ మంజూరవుతుందని ఆశిస్తున్నాను.' అని ఆయన అన్నారు.

ఫోన్‌లో స్పైవేర్‌తో టార్గెట్

- మోడీ గవర్నమెంట్ దుశ్చర్య : కె.సి వేణుగోపాల్

న్యూఢిల్లీ : ఫోన్‌లో హానికరమైన స్పైవేర్‌తో తనని మోడీ గవర్నమెంట్ టార్గెట్ చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ఆరోపించారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు మోడీ ప్రభుత్వం పాల్పడిందని, ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యను తాము వ్యతిరేకిస్తున్నామని వేణుగోపాల్ అన్నారు.

కాగా, కె.సి వేణుగోపాల్ దీనికి సంబంధించి ఎక్స్‌లో పోస్టు కూడా చేశారు. 'మీకు ఇష్టమైన హానికరమైన స్పైవేర్‌ను నా ఫోన్‌లో కూడా పంపినందుకు ధన్యవాదాలు ప్రధాని మోడీ జీ. మీ ఈ ప్రత్యేక బహుమతి గురించి నాకు తెలియజేయ డానికి ఆపిల్ దయ చూపింది!. దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం నేరపూరితంగా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో వ్యవహరిస్తోం దని తెలుస్తుంది. రాజకీయ ప్రత్యర్థులను అనుసరించడం.. వారి గోప్యతను ఆక్రమిస్తున్నారని స్పష్టమవుతుంది.' అని ఆయన తన ఎక్స్ పోస్టులో మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాజ్యాంగంపైన దాడినైనా, బీజేపీ ఫాసిస్టు ఎజెండాపైన ఇలా ఎటువంటి దాడినైనా ప్రజలు తిరస్కరిస్తారని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలియజేశాయి అని ఆయన అన్నారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనకు పాల్పడినట్లు యాపిల్ ఐ ఫోన్‌లో వచ్చిన మెసేజ్ స్క్రీన్‌సాట్‌ని కూడా వేణుగోపాల్ ఈ సందర్భంగా సోషల్‌మీడియాలో షేర్ చేశారు.



హిమాచల్‌లో కరుగుతున్న మంచు పొర

చండీఘర్ : హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రధాన నదీ ఛానల్స్‌లో మంచు పొర కరిగిపోతోంది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు ఇదే ప్రధాన కారణమని వాతావరణ మార్పులపై ఏర్పాటు చేసిన రాష్ట్ర కేంద్రం తెలిపింది. హిమాచల్ ప్రదేశ్ శాస్త్ర సాంకేతిక-పర్యావరణ మండలి పరిధిలో ఈ కేంద్రం పనిచేస్తుంది. 2022-23 సంవత్సరంలో శీతాకాలంలో మంచుతో కప్పబడిన ప్రాంతంతో పోలిస్తే 2023-24లో చెనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల పరీవాహక ప్రాంతాల్లో మంచు పొర 12.72శాతం కరిగిపోయిందని ఆ కేంద్రం ఓ నివేదికలో తెలియజేసింది. జనవరిలో అయితే సట్లెజ్ పరీవాహక ప్రాంతంలో 67శాతం, రావి పరీవాహక ప్రాంతంలో 64శాతం, బియాస్ పరీవాహక ప్రాంతంలో 43శాతం, చెనాబ్ పరీవాహక ప్రాంతంలో 42శాతం, మంచు అత్యంత వేగంగా కరిగిపోయిందని ఆ నివేదిక చెప్పింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అన్ని పరీవాహక ప్రాంతాల్లోనూ మంచు పొర సానుకూల సంకేతాన్ని అందించింది. హిమాచల్‌లోని నదీ పరీవాహక ప్రాంతాల్లో 2023 అక్టోబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకూ శీతాకాలం కొనసాగింది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ చలి అధికంగా ఉంది. సట్లెజ్ మినహా మిగిలిన అన్ని పరీవాహక ప్రాంతాల్లోనూ మంచు పొర కొంత మేర కరిగింది. మంచుతో కప్పి ఉండే అన్ని పరీవాహక ప్రాంతాల్లో ఒక్క చెనాబ్ ప్రాంతమే 50శాతం మేర ఉంటుంది. దిగువ ప్రాంతంతో పోలిస్తే హిమాలయాల ఎగువ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఈ కారణం వల్లనే మంచు కరుగుతూ ఉంటుంది.



ఇటలీలో వెట్టి చాకిరి నుంచి

33మంది భారత వ్యవసాయ కార్మికులకు విముక్తి

ఇద్దరు గ్యాంగ్ మాస్టర్లు అరెస్టు

రోమ్ : కట్టు బానిసల తరహాలో శ్రమ దోపిడీకి గురవుతున్న 33మంది భారత వ్యవసాయ కార్మికులకు స్వేచ్ఛ కల్పించినట్టు ఇటలీ పోలీసులు శనివారం తెలిపారు. కార్మికులకు మాయమాటలు చెప్పి, మోసపుచ్చిన ఇద్దరు గ్యాంగ్ మాస్టర్ల నుంచి దాదాపు 5లక్షల యూరోలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ గ్యాంగ్ మాస్టర్లు కూడా భారతీయులే, ఉత్తర వెరోనా ప్రావిన్స్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. యంత్రం కారణంగా చేయి తెగిపోయిన భారతీయ కార్మికుడికి కనీసం వైద్యం కూడా అందించకుండా రోడ్డు పక్కనే పడవేస్తే ఆ వ్యక్తి చనిపోయిన సంఘటన జూన్‌లో చోటు చేసుకుంది. దీంతో ఇటలీలో కార్మిక శ్రమ దోపిడీ బాగా వెలుగులోకి వస్తోంది.

తాజా కేసులో వీరిని సీజనల్ వర్క్ పర్మిట్లపై ఇటలీకి తీసుకువచ్చారని, ఒక్కొక్కరు 17వేల యూరోలు చొప్పున చెల్లించాలని, అపుడు వారికి మంచి భవిష్యత్తు వుంటుందని హామీలిచ్చారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత వారికి పొలంలో పనులు అప్పచెప్పారు. రోజుకు 10 నుంచి 12 గంటలు చొప్పున వారంలో ఏడు రోజులు పనిచేయాల్సిందే. వారిచ్చేది గంటకు కేవలం నాలుగు యూరోలు. వారు తమ అప్పులన్నీ తీర్చేవరకు అక్కడ పనిచేయాల్సిందేనని పోలీసులు తెలిపారు. వారందరినీ కట్టుబానిసల్లాగా చూశారని చెప్పారు. శాశ్వతంగా వర్క్ పర్మిట్ కావాలంటే అదనంగా 13వేల యూరోలు చెల్లించాలని, అందుకోసం ఎలాంటి వేతనాలు ఆశించకుండా ఉచితంగా పనిచేయాల్సి వుంటుందని వారిలో కొంతమందికి చెప్పారని పోలీసులు తెలిపారు. వాస్తవానికి వారికి అసలు వర్క్ పర్మిట్ అనేదే లేదన్నారు. గ్యాంగ్ మాస్టర్లపై బానిసత్వానికి, కార్మిక దోపిడీకి సంబంధించి నేరాలు మోపినట్లు చెప్పారు. బాధితులందరికీ రక్షణ కల్పించి, పని అవకాశాలు కల్పించనున్నట్లు, పైగా చట్టబద్ధంగా వారికి నివాస పత్రాలు అందేలా చూడనున్నట్టు తెలిపారు.

అమరవీరుల దినోత్సవాన్ని అడ్డుకోలేరు

సీపీఐ(ఎం) స్పష్టీకరణ

- కాశ్మీర్ అమరవీరులకు ఘనంగా నివాళి
- పలువురు కాశ్మీరీ నేతల గృహ నిర్బంధం



శ్రీనగర్ : ఆధునిక కాశ్మీర్ చరిత్రలో ముఖ్యమైన రోజుల్లో 1931 జులై 13 ఒకటి. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బాధితులు, అణచివేతకు గురైన ప్రజలు 1931లో చేసిన తిరుగుబాటు చరిత్ర నుంచి చెరిపివేయలేం. ఇంతటి చారిత్రక దినాన్ని అధికారికంగా జరుపుకోవడానికి అనుమతించకపోవడం, అమరవీరులకు నివాళులు అర్పించేందుకు మజారి షహుదాను సందర్శించకుండా అడ్డుకోవడమనేది కాశ్మీర్ చరిత్రను మార్చేందుకు, ప్రజల హృదయాల్లో నెలకొన్న జ్ఞాపకాలను తుడిచిపెట్టేందుకు చేసే ప్రయత్నంగా వుందని సీపీఐ)ఎం) విమర్శించింది. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని చర్యలు తీసుకున్నా తమ ప్రజల మనస్సులు, హృదయాల నుండి ఈ చారిత్రక దినం జ్ఞాపకాన్ని తొలగించలేరని సిపిఎం నేత తరిగామి స్పష్టం చేశారు. మన ప్రజలకు మరింత మెరుగైన భవిష్యత్తు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారికి సీపీఐ(ఎం) ఘనంగా నివాళులు అర్పిస్తోందని అన్నారు. నియంతృత్వం, నిరంకుశత్వం సంకెళ్ళ నుంచి సమాజానికి విముక్తి కల్పించేందుకు సాహసోపేతులైన ఈ వీరులు చేసిన త్యాగాలను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు.

పలువురు కాశ్మీరీ నేతల అరెస్టు

1931లో జులై 13న డోగ్రా పాలకుని సైన్యం చేతిలో హతులైన 22మంది కాశ్మీరీలకు ఘనంగా నివాళులు అర్పించేందుకు గానూ అమరవీరుల సమాధి వద్దకు వెళ్లకుండా పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తి సహా పలువురు రాజకీయ నేతలను అరెస్టు చేశారు. తన నివాసం నుండి బయటకు వెళ్లడానికి లేకుండా తనను గృహ నిర్బంధంలో వుంచారని ఆమె తెలిపారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాశ్మీరీల స్ఫూర్తికి నిదర్శనంగా వున్న ఈ కార్యక్రమాన్ని ఎవరూ తొక్కివేయలేరని ఆమె వ్యాఖ్యానించారు.

పీపుల్స్ కాన్ఫరెన్స్ ఛైర్మెన్ సజాద్ లోనెను కూడా ఇల్లు కదలనీయకుండా నిర్బంధించారు. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనమేమిటో తనకు అర్థం కావడం లేదన్నారు. ఆ అమరవీరులందరూ కాశ్మీరీ హీరోలని వ్యాఖ్యానించారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, మరో నేత నసీర్ అస్లామ్ వనీ సహా పలువురు నేతలు ఇవే అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, ర్యాలీలు

పిలుపిచ్చిన ఫ్రెంచి యూనియన్లు

- ఎన్‌పీఎఫ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాల్సిందేనని డిమాండ్

పారిస్ : గత ఆదివారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గౌరవించేలా అధ్యక్షుడు మాక్రాన్‌పై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు ప్రదర్శనలు, అవసరమైతే సమ్మెలు చేపట్టాల్సిందిగా అతిపెద్ద ఫ్రెంచి యూనియన్ సిజిటి యూనియన్ ఫెడరేషన్ పిలుపిచ్చింది. పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ర్యాలీల్లో పాల్గొనాల్సిందిగా ఆమె యూనియన్ సభ్యులను కోరారు. ఎన్నికల ఫలితాన్ని మాక్రాన్ ఇలాగే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒలింపిక్స్ క్రీడల సమయంలోనైనా సమ్మెలు చేయడానికి కూడా వెనుకాడేది లేదని అన్నారు. అత్యధికంగా సీట్లు సాధించిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని యూనియన్ కోరింది. జులై 18న కొత్త పార్లమెంట్ ప్రారంభ సమావేశం జరగాల్సి వుంది. ఇప్పటివరకు వామపక్ష కూటమి నుంచి వ్యక్తిని ప్రధానిగా నియమించేందుకు మాక్రాన్ తిరస్కరి స్తున్నారు. నేషనల్ అసెంబ్లీలో అవసరమైన మెజారిటీని రూపొందించుకునేందుకు కసరత్తు చేయాల్సిందిగా రాజకీయ పార్టీలకు పిలుపిచ్చారు. అంతవరకు ప్రధానిని నియ మించేది లేదని స్పష్టం చేశారు. సీజీటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి సోఫీ బినెట్ గురువారం ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్‌కు ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, మాక్రాన్ ఎన్నికల ఫలితాలను గౌరవించకపోతే, మరోసారి దేశాన్ని గందంగోళ పరిస్థితుల్లోకి నెట్టివేస్తారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్‌పిఎఫ్‌ను అనుమతించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. సీజీటీలోని రైల్వే వర్కర్లు 18న దేశవ్యాప్తంగా ర్యాలీలకు పిలుపిచ్చారు. చర్చలు విఫలమైతే ఒలింపిక్స్ సమయంలో సమ్మెలకు వెనుకాడబోమని మధ్యే వామపక్ష సీఎఫ్‌డీటీ యూనియన్ నేత మేరీలైస్ లియోన్ హెచ్చరించారు.



రబ్బర్ స్టాంప్ సీఎం కంటే.. ప్రజలే అర్హులు

ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూ అండ్ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 నిబంధనల్ని లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను పెంచేవిధంగా కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ చట్ట సవరింపులపై కేంద్ర ప్రభుత్వ చర్యల్ని జమ్మూ అండ్ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా తప్పుపట్టారు. ఈ చట్ట సవరింపుల వల్ల అధికారం లేని ముఖ్యమంత్రే పదవిలో ఉంటారని ఆయన ధ్వజమెత్తారు. జమ్మూ అండ్ కాశ్మీర్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం చట్ట నిబంధనల్ని సవరించిందని ఆయన మండిపడ్డారు. 'జమ్మూ అండ్ కాశ్మీర్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తి పునరుద్ధరణ కోసం టైమ్ లైన్‌ను రూపొందించడానికి.. ఇప్పుడే ఇంత గట్టి నిబద్ధత ఎందుకు అవసరం? అంటే.. ఈ ఎన్నికలకు రాజ్యాధికారం తప్పనిసరి. అయితే ఈ ఎన్నికల్లో ఎన్నికైన ముఖ్యమంత్రి ఎలాంటి అధికారం లేకుండా ఉంటారు. అలాంటి రబ్బర్ స్టాంప్ సీఎం కంటే.. అధికారంలోని ప్రజలే ఆ అధికారానికి అర్హులు. ఎన్నికైన సీఎం ప్యూన్‌ని నియమించడానికైనా లెఫ్టినెంట్ గవర్నర్‌ని వేడుకోవాలి.' అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో విమర్శించారు. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 మార్పులపై జమ్మూకాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత కవీందర్ గుప్తా స్పందించారు. రాబోయే రోజుల్లో విధాన సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాన్ని పెంచేలా ఈ చట్ట నిబంధనల్లో చేయడం చాలా ముఖ్యం. కేంద్ర హోం మంత్రిత్వశాఖ చేసిన ఈ మార్పులు ముఖ్యమైనవి అని ఆయన అన్నారు. ఈయన వ్యాఖ్యలపై ఒమర్ అబ్దుల్లా కౌంటర్ ఇచ్చాడు. ఎన్నికల్లో గెలిచినా ముఖ్యమంత్రికి అధికారం ఉండదు. ఆయన పవర్‌లెస్ సీఎం అని అబ్దుల్లా కవీందర్‌సింగ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చాడు. అయితే అబ్దుల్లా వ్యాఖ్యలపై కవీందర్ స్పందిస్తూ.. 'లా అండ్ ఆర్డర్ ఇప్పటికీ హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ నియంత్రణలో ఉంది. ఈ సమస్యపై ఇప్పుడు వ్యాఖ్యానించడం సరైంది కాదు. గతం కంటే జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం లా అండ్ ఆర్డర్‌ని మెరుగుపరిచిందని అన్నారు.

దుర్భాషలాడుతూ, పిడిగుద్దులు గుద్దుతూ ...

ఒడిశా గవర్నర్ కొడుకు కండకావరం

లగ్జరీ కార్లు పంపలేదని అధికారిపై చేయి చేసుకున్న వైనం

భువనేశ్వర్ : పూరీ రైల్వే స్టేషన్ నుంచి తీసుకురావడానికి తనకు లగ్జరీ కార్లు పంపలేదనే కారణంతో ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ కుమారుడు, మరో ఐదుగురు రాజ్‌భవన్‌లో పనిచేసే అధికారిపై చేయి చేసుకున్నారు. చెంపదెబ్బలు, ముఖంపై పిడిగుద్దులు కొడుతూ తన బూట్లను నాకాలంటూ ఆదేశించాడు. పూరీలోని రాజ్‌భవన్ ఆవరణలో ఈ నెల 7వ తేదీ రాత్రి ఈ సంఘటన జరిగింది. రాజ్‌భవన్‌లో గవర్నర్ సెక్రెటేరియట్‌లో వైకుంఠ ప్రధాన్ (47) అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి ఆయన అక్కడ వున్నారు. సంఘటన 7వ తేదీన జరిగినా 10వ తేదిన ప్రధాన గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శికి రాతపూర్వకమైన ఫిర్యాదు అందచేశారు. " 7,8 తేదీల్లో రాష్ట్రపతి ముర్ము పర్యటనకు అవసరమైన ఏర్పాట్ల కోసం పూరీ రాజ్‌భవన్ ఇన్‌చార్జిగా 5వ తేదీ నుంచి అక్కడే వున్నా'నని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సాధారణంగా అయితే భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో ఆయన పోస్టింగ్. 7వ తేదీ రాత్రి 11.45గంటల సమయంలో ఆఫీస్ రూమ్‌లో తాను కూర్చుని వుండగా గవర్నర్ వ్యక్తిగత వంటవాడు వచ్చి కుమార్ తనను రమ్మంటున్నాడని చెప్పారని పేర్కొన్నారు. 'కుమార్ దగ్గరకు వెళ్ళగానే, అసభ్య పదజాలంతో అభ్యంతరకరమైన మాటలతో తీవ్రంగా దూషించారు. అందుకు తాను అభ్యంతరం చెప్పగానే కుమార్, మరో ఐదుగురు తనను కొట్టడం ఆరంభించార'ని ప్రధాన్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతోభయపడి ఆ గది నుంచి పరిగెత్తుకుని వచ్చి బయట దాక్కున్నానని, అయినా కుమార్ వ్యక్తిగత భద్రతా అధికారులు తనను చూసి లిఫ్ట్‌లో లాక్కువెళ్ళారని చెప్పారు. అక్కడ గల భద్రతా సిబ్బంది, మిగిలినవారందంటూ ఈ సంఘటన చూస్తూ నిలబడ్డారని తెలిపారు. తిరిగి మళ్ళీ వాళ్ళు కొట్టారని, ముఖంపై పిడిగుద్దులు కొట్టారని, శరీరంలోని ప్రతి అవయవంపై తన్నారని చెప్పారు. ఎడమ కాలు మడమను మెలిపెడుతూ ఇక్కడే, ఇప్పుడే నిన్ను చంపేసినా, ఎవరూ కాపాడే వారు లేరు అంటూ కుమార్ రెచ్చిపోయాడని ప్రధాన్ చెప్పారు. ఇంత దారుణానికి కారణం పూరీ రైల్వే స్టేషన్ నుంచి వారిని తీసుకురావడానికి రెండు లగ్జరీ కార్లను పంపకపోవడమేనని చెప్పారు. కాగా ఈ సంఘటనపై వ్యాఖ్యానించాల్సిందిగా కోరగా పూరీ ఎస్‌పీ పినాక్ మిశ్రా స్పందించలేదు. రాజ్‌భవన్ అధికారులు, ప్రిన్సిపల్ కార్యదర్శి సస్వత్ మిశ్రాలు కూడా స్పందించలేదు. ప్రధాన్ భార్య సయోజ్ ఫిర్యాదు ప్రతిని విలేకర్లకు చూపిస్తూ రాష్ట్రపతి విధుల కోసం తన భర్తను నియమించారు కానీ గవర్నర్ కుమారుడి కోసం కాదని అన్నారు. 10వ తేదీన తన భర్త గవర్నర్‌ను, ఇతర సీనియర్ అధికారులను కలుసుకుని దీనిపై చర్చించారని తెలిపారు. తన భర్త ఎయిర్ ఫోర్స్‌లో దాదాపు 20ఏళ్ళు పనిచేశారని, ఆ తర్వాత ఇక్కడకు వచ్చారని చెప్పారు.



అసోం వరదల్లో మరో ఏడుగురు మృతి

90కి చేరిన మరణాలు

గౌహతి : అస్సాంని వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల కారణంగా శుక్రవారం ఏడుగురు మరణించారని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డీఎంఎ) తెలిపింది. గోల్‌పరా జిల్లాలో నదిలో పడవ మునిగిపోవడంతో ఐదుగురు మరణించారు. నాగోన్, జోర్హాట్ జిల్లాల్లో ఒక్కొక్కరు వరద నీటిలో మునిగి చనిపోయారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 90కి చేరిందని ఎఎస్‌డీఎం నివేదిక తెలిపింది. 75 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 2,406 గ్రామాలు, 3,294.32 హెక్టార్లలో పంట నీటిలో మునిగిపోయింది. బ్రహ్మపుత్ర, బుర్హిడిహింగ్, దిసాంగ్, కుషియారా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత జిల్లాల్లో 2.95 లక్షల మంది 316 సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.



మొన్న వెలుగులోకి వచ్చిన ప్రణీత్ హనుమంతు బ్రాడ్‌కాస్ట్ చేసిన డార్క్ కామెడీ వీడియో పెద్ద సంచలనం కలిగించింది. 'నాకే గనక కూతురుంటే..' అనే శీర్షికలో తండ్రీ కూతురుకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వస్తే, దాన్ని అత్యంత అశ్లీలంగా అసభ్యంగా కామెంట్ చేస్తూ ఈ హనుమంతు అండ్ బ్యాచ్ షూట్ చేసి బ్రాడ్ కాస్ట్ చేశారు. తండ్రీ కూతురు బంధాన్ని మర్చేస్తూ, భార్య కాకపోతే కూతురు దగ్గరకు అనే రోస్టెడ్ కంటెంట్ తయారుచేయటం, నవ్వుతూ పోస్టు చేయడం అనే వికృతచర్యను, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ చూసి ముఖ్యమంత్రులకు, డీజీపీకి ఫిర్యాదు చేసేంతవరకూ ఎవరూ పట్టించుకోలేదు

క్రూర హాస్యం



హాస్యం నవరసాల్లో ఒకటి. హాస్య భాషణం అందరినీ ఆకట్టుకుంటుంది. హాస్యం లేని ఉపన్యాసం పండదు. హాస్యాన్ని ఇష్టపడని వారుండరు. హాస్యం ఆరోగ్యం కూడా. చార్లిచాప్లిన్ సినిమాలన్నీ హాస్యభరితంగా ఉంటాయి. మనల్ని బాగా నవ్విస్తాయి. కానీ చేదు నిజాల్ని, వాస్తవికతల్ని ప్రతిబింబిస్తాయి. గొప్ప సందేశాన్ని వినిపిస్తాయి. ప్రపంచవ్యాపితంగానే ప్రసిద్ధులయిన హాస్యనటులు చాప్లిన్. మన తెలుగులోనూ చాలామందే వున్నారు. రచయితల్లోనైతే పానుగంటి నరసింహా రావు, మొక్కపాటి నరసింహాశాస్త్రి, చిలకమర్తి, భమిడిపాటి, మునిమాణిక్యం - వీరు పండించిన హాస్యంలో సమాజ నైజాన్ని ప్రతిబింబించడం మనం చూస్తాము తప్ప అపహాస్యం కనపడదు. సినిమాల్లోకి వస్తే రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, బ్రహ్మానందం, ఆలీ ఇంకా.. ఎందరో నవ్వులు పండించి మనల్ని కడుపుబ్బించిన వాళ్లే. ఎప్పుడూ ఎక్కడా సమాజం నొచ్చుకునే హాస్యం ఎదురు పడలేదు. ఈ మధ్యకాలంలో కొంత శృతిమించి అశ్లీలత కూడా చేరు తోంది. హాస్యమంటే అశ్లీలతగా, ఎదుటివారిని హర్ట్ చేయటంగా, అసభ్యతే పరమావధిగా మారిపోతున్న తీరు సమాజంలో అరాచక మనస్తత్వాన్ని ప్రేరేపిస్తున్నది. హాస్యానికీ అపహాస్యానికి, అసభ్యతకు, ఆటవికతకూ హద్దులు చెరిపేస్తున్న నేటి దారుణాలను అరికట్టకపోతే ఆధునిక ఆటవికత మొదలౌతుంది.

పూర్వం హాస్యమైనా పుస్తకం కొని చదవాల్సిందే. టికెట్ కొని వెళ్లి సినిమా చూడవలసిందే. ఇప్పుడు అన్నీ చేతిలోకి వచ్చేశాయి. సెల్ మోగుతూనే దృశ్యం, చిత్రం మన కళ్లముందే. చేతుల్లోకి సోషల్ మీడియా వచ్చేసాక ప్రయోజనం, ఉపయోగం కలిగిన మాట వాస్తవమైనా, సామాజికంగా అనేకమైన రుగ్మతలకు అలవాలమైపోయింది. విపరీతమైన నేరాలకు ఘోరాలకు వేదికగా మారిపోయింది. మోసాలు పెరిగిపోతున్నాయి. యూట్యూబ్ ఛానెళ్లు విస్తృతంగా పెరగడంతో, బోలెడంత కంటెంట్ మన మెదళ్లపైకి వచ్చి చేరుతోంది. ఇక టీవీ ఛానెళ్ల రేటింగ్ కోసం సృష్టిస్తున్న కామెడీ ప్రోగ్రాములు శృతిమించి ఘోరాన పడుతున్నాయి. ఉదాహరణకు 'జబర్దస్త్' కార్యక్రమంలో నటిస్తున్న నటులు సృష్టిస్తున్న హాస్యం ఒక్కోసారి జుగుప్స కలిగిస్తుంది. వెగటు పుట్టిస్తుంది. ఇలా పెద్దలకు అనిపిస్తుంది కానీ పిల్లలు, మంచీ చెడ్డలు తెలియని పసి హృదయాలపై ఎలాంటి ప్రభావం కలిగిస్తాయి? సమాజమంటే ఇదేనేమో అనుకోరా? దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉంది!

ఇప్పుడు కొత్తగా 'డార్క్ కామెడీ' పేర జరుగుతున్న యూట్యూబర్స్ బ్రాడ్ కాస్ట్ చేస్తున్న దుర్మార్గమైన, క్రూరమైన హాస్యం వింటుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. రీల్స్‌లో వస్తున్న, కామెడీగా చెప్పబడుతున్నదంతా బట్టలిప్పిన ప్రదర్శన మాత్రమే. ఇప్పుడు ఆ రకమైన సంభాషణలు అమ్మాయిలే చేస్తున్నారు. అన్ని పచ్చి బూతులు పబ్లిక్‌గా మాట్లాడుతూ బ్రాడ్‌కాస్ట్ చేస్తున్నారు. రీల్స్‌లో తొంబై శాతం సెక్స్ విషయాలు, ద్వంద్వార్థాల సంభాషణలు. యూట్యూబ్ ఛానెళ్లతోనూ అవే అంశంపై ఇంటర్వ్యూలు, చర్చలు. సమాజంలో ఇంకే సమస్యలూ లేనట్టుగా, యువత ఎదుర్కొంటున్న సమస్యలే లేనట్టుగా వీటిని నింపేస్తున్నారు. మొన్న వెలుగులోకి వచ్చిన ప్రణీత్ హనుమంతు బ్రాడ్‌కాస్ట్ చేసిన డార్క్ కామెడీ వీడియో పెద్ద సంచలనం కలిగించింది. 'నాకే గనక కూతురుంటే..' అనే శీర్షికలో తండ్రీ కూతురుకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వస్తే, దాన్ని అత్యంత అశ్లీలంగా అసభ్యంగా కామెంట్ చేస్తూ ఈ హనుమంతు అండ్ బ్యాచ్ షూట్ చేసి బ్రాడ్ కాస్ట్ చేశారు. తండ్రీ కూతురు బంధాన్ని మర్చేస్తూ, భార్య కాకపోతే కూతురు దగ్గరకు అనే రోస్టెడ్ కంటెంట్ తయారుచేయటం, నవ్వుతూ పోస్టు చేయడం అనే వికృతచర్యను, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ చూసి ముఖ్యమంత్రులకు, డీజీపీకి ఫిర్యాదు చేసేంతవరకూ ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రణీత్ హనుమంతు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి కుమారుడు. పోలీసులు విచారణ ప్రారంభించారు. హనుమంతును అరెస్టుచేసి రిమాండుకు పంపారు. ఇంత దారుణమైన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వస్తున్నాయి. వీటిపైన ఎవరి పర్యవేక్షణ అదుపులేదు. కానీ సనాతన ధర్మం గురించి, నీతి గురించి ప్రవచనాలు కొనసాగు తుంటాయి. హాస్యం పేరుతో నేరం ప్రేరేపించబడుతోంది. ఇలాంటివి యువతమీద, పిల్లల మీద విపరీత ప్రభావాన్ని కలిగిస్తాయి. సోషల్ మీడియాలో అబద్ధాలు, అర్ధసత్యాలు, ప్రచారం చేయటమనేది అధికారంలో వున్న పక్షాలకు అలవాటుగా మారిపోయింది. దీన్ని ఆసరా చేసుకుని ఇలాంటి శక్తులు పేట్రేగి పోతున్నాయి. సమాజాన్ని, సంస్కృతిని విషతుల్యం చేస్తున్నాయి.

హాస్యం పేరుతో డార్క్ కామెడీని వండి వడ్డిస్తున్న యూట్యూబ్ ఛానెల్స్‌ను వెంటనే రద్దుచేసి, నిర్వాహకులను శిక్షించాలి. సాంస్కృతిక కాలుష్యాన్ని అరికట్టేందుకు సన్నద్ధమవ్వాలి. వికృత నేరపూరిత హాస్యాన్ని అరికట్టాలి.

సంపాదకీయం

ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అరెస్టు చేయడం అనుమానాలకు కారణమైంది.అంతకుముందే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అరెస్టు కూడా జరిగింది. అయితే జైలుకు వెళ్లే ముందు ఆఖరి నిమిషంలో సమయం తీసుకుని ఆయన తన స్థానంలో చంపయ్‌సొరేన్‌ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసి ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు కాలంలో బీహార్ ముఖ్యమంత్రిగా వున్న లాలూ ప్రసాద్‌యాదవ్ రబ్రీదేవిని, తమిళనాడులో జయలలిత పన్నీరు సెల్వంను అలాగే ప్రతిష్టించి విచారణను శిక్షలను ఎదుర్కొన్నారు.ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్ తనకూ ఈ కేసుకూ సంబంధం లేదని వాదించడమే గాక రాజీనామా చేయడానికి నిరాకరించారు. రాజ్యాంగంలో ఎక్కడా ఆ విధమైన నిబంధన లేదని వాదించారు.

ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్(పిఎంఎల్ఎ)సెక్షన్19(1)కింద అరెస్టు చేసేందుకు ఈడి అధికారులకు ఇచ్చిన అధికారం చాలా తీవ్రమైందని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తీర్పు రాసిన జస్టిస్ ఖన్నా ఇందుకు సంబంధించిన వివరాలు కూడా పొందుపర్చారు.2023 నాటికి ఈడి దగ్గర 5906 కేసుల నివేదికలు నమోదయ్యాయి. 4564 నోటీసులు ఇచ్చి 531 మందిని మాత్రం విచారించారు. ఇందులో 176 ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎంఎల్‌సిలకు సంబంధించినవి.1142 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు నమోదు కాగా 513 మందిని అరెస్టు చేశారు. ఈ సంఖ్యలు, వాటిలో తేడాలు చూస్తే చాలా సందేహాలు కలుగుతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫలానా వ్యక్తి నేరం చేసి వుంటారని ఈడి అధికారి తన స్వీయభావనకు వచ్చినంత మాత్రాన అరెస్టు చేయడానికి ఎలా అధికారమిస్తారని ప్రశ్నవేసింది.

త్రిశూలాల వ్యూహాలకు సుప్రీంలో సవాళ్లు



తెలకపల్లి రవి

ప్రత్యర్థి పార్టీలపైన, రాష్ట్ర ప్రభుత్వాల పైన తన త్రిశూల వ్యూహంతో దాడి చేయడం నరేంద్రమోడీ ప్రభుత్వం ఆరితేరింది. కానీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు విషయంలో ఇదే వ్యూహం అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టునే ఆశ్చర్యానికి ఆగ్రహానికి గురిచేసింది. ఆయనకు ఒకటికి రెండుసార్లు ఉపశమనం ఇచ్చిన సుప్రీంకోర్టు మరోవైపున అసలు ఈ తతంగమంతటినీ రాజ్యాంగ సమీక్ష చేయాలని నిర్ణయించింది. అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని కూడా నియమించ బోతున్నది. ఈ మధ్యంతర బెయిలు మంజూరుపై 'ఆప్' హర్షం వ్యక్తం చేస్తూ మోడీ సర్కారు నిజరూపం బహిర్గతమైందంటుంటే బీజేపీ మాత్రం తమ వాదనే నెగ్గిందని వింత ప్రచారం చేస్తున్నది. ఈడి కేసులో బెయిలు లభించినా ఆ వెంటనే బనాయించిన సిబిఐ కేసులో కేజ్రీవాల్ ఇంకా ఖైదులోనే వుంటారు గనక వెంటనే దీని ప్రభావం కనిపించకపోవచ్చు గాని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు లేవనెత్తిన ప్రశ్నలు, చేయబోతున్న విచారణ మాత్రం ప్రజాస్వామిక వాదులు లేవనెత్తుతూ వస్తున్న విమర్శలకు ప్రతిస్పందనగా కనిపిస్తాయి. ఎందుకంటే సిబిఐ(సెంట్రల్ బ్యూరో ఇన్వెస్టిగేషన్), ఈడి(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్), ఐటి (ఇన్‌కంటాక్స్) విభాగాలను ఎప్పటికప్పుడు ఏదో కేసు పేరుతో పురికొల్పి నాటకీయంగా అరెస్టులు దాడులు చేయడం, బడా మీడియాలో వ్యతిరేక కథనాలు గుప్పించడం పరిపాటి అయింది. నిజానికి ఏ రోజు ఎక్కడ ఎవరిని ఎలా అరెస్టు చేస్తారోనని ఎదురుచూస్తే అనిశ్చిత అప్రజాస్వామిక వాతావరణం ఏర్పడింది. అవినీతి ఆరోపణలు ఎప్పుడు ఎవరిమీద వచ్చినా సరైన పద్ధతిలో నిబంధనల అనుసరించి దర్యాప్తు చేయవలసిందే. కోర్టులలో విచారించి చట్టప్రకారం శిక్ష విధించవలసిందే.కానీ దానికి ఒక పద్ధతి, క్రమం వుంటుంది. అందుకు భిన్నంగా అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్న బీజేపీ-ఎన్‌డిఎ సర్కారుపై మూడు కేంద్ర సంస్థలలో ఏదో ఒకటి ప్రయోగించడం, ఒకటి విఫలమైతే లేక వ్యతిరేక తీర్పు వస్తే మరొకదాన్ని రంగంలోకి దింపడం ఇందులో సర్వసాధారణం.

ఇద్దరు సీఎంల అరెస్టు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనేది ఇప్పటికి దాదాపు రెండేళ్లుగా నానుతూనే వుంది. ఈ క్రమంలో అనేకమంది ఆప్ మంత్రులు, కేసీఆర్ కుమార్తె అయిన బీఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవితతో సహా అరెస్టయి జైలులో వున్నారు. అనేక దశలుగా ఆ కేసు కొనసాగుతున్నది. అయితే ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను సరిగ్గా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అరెస్టు చేయడం అనుమానాలకు కారణమైంది.అంతకుముందే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అరెస్టు కూడా జరిగింది. అయితే జైలుకు వెళ్లే ముందు ఆఖరి నిమిషంలో సమయం తీసుకుని ఆయన తన స్థానంలో చంపయ్‌సొరేన్‌ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసి ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు కాలంలో బీహార్ ముఖ్యమంత్రిగా వున్న లాలూ ప్రసాద్‌యాదవ్ రబ్రీదేవిని, తమిళనాడులో జయలలిత పన్నీరు సెల్వంను అలాగే ప్రతిష్టించి విచారణను శిక్షలను ఎదుర్కొన్నారు.ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్ తనకూ ఈ కేసుకూ సంబంధం లేదని వాదించడమే గాక రాజీనామా చేయడానికి నిరాకరించారు. రాజ్యాంగంలో ఎక్కడా ఆ విధమైన నిబంధన లేదని వాదించారు. ఢిల్లీ పరిమిత అధికారాలు గల రాష్ట్రం గనక లెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న బీజేపీ నేత విజయ్ కుమార్ సక్సేనా కూడా కేజ్రీ ప్రభుత్వాన్ని చిందరవందర చేయడానికి శాయశక్తులా ప్రయత్నించినా, ఎదురుతిరిగి పోరాడుతూ వస్తున్న ఆప్ ఈ విషయంలోనూ రాజీకి నిరాకరించింది. దీనిపై దాఖలైన వాజ్యాలను విచారించిన ఉన్నత న్యాయస్థానాలు సుప్రీంకోర్టు కూడా అరెస్టయితే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదు గనక తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని గతంలోనే స్పష్టం చేసింది. దిగువ న్యాయస్థానాలు, ఆ పైన ఢిల్లీ హైకోర్టు నిర్ణయాలేమైనప్పటికీ సుప్రీంకోర్టు నిర్ణయంతో కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం కోసం గతంలో మధ్యంతర బెయిలు కూడా లభించడం ఒక సంచలనమైంది. పౌర హక్కుల కోణంలోనే గాక ఒక రాజకీయ పార్టీ కీలక నాయకుడిగా, ప్రభుత్వ అధినేతగా తనకు ప్రచారంలో పాల్గొనే అవకాశం నిరాకరించడమంటే ఎన్నికల్లో సమాన అవకాశాల సూత్రం దెబ్బతింటుందని కేజ్రీవాల్ వాదించారు. ఆ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. లిక్కర్ కేసు లోతుపాతుల్లోకి వెళ్లకుండా కేవలం ప్రచారం కోసం మాత్రం నిర్ణీత వ్యవధితో విడుదల చేసింది. ఈ సమయంలో ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకూడదని, ఏ పత్రాలపై సంతకాలు చేయరాదని ఆదేశించింది. ఆ గడువు పొడగింపునకు ఆయన ప్రయత్నించినా నిరాకరించింది.

హైకోర్టుపై అసంతృప్తి

గడువు ముగిసి జూన్ 2న మళ్లీ తిహార్ జైలులో తనను తాను స్వాధీన పరుచుకున్న కేజ్రీవాల్ మళ్లీ మామూలు బెయిలు కోసం ప్రయత్నించగా రౌస్‌అవెన్యూ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీనిపై పూర్తి ఉత్తర్వు రాకముందే ఢిల్లీ హైకోర్టు మౌఖిక ఉత్తర్వుతో స్టే విధించింది. పూర్తి ఉత్తర్వు తర్వాత ఇస్తానని వాయిదా వేసింది. దీన్ని కేజ్రీవాల్ మరోసారి సుప్రీంలో సవాలు చేయగా ఈ పద్ధతిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి..అసంతృప్తి వ్యక్తం చేశారు. బెయిలు నిలిపివేయడం వంటి విషయంలో లిఖితపూర్వక కారణాలివ్వాలని స్పష్టం చేస్తూనే పూర్తి నిర్ణయం చూడకుండా హైకోర్టు స్పందించడం సరికాదన్నారు. ఆ తర్వాత దశలో హైకోర్టు బెయిలు నిరాకరించింది గానీ కిందికోర్టులోనూ హైకోర్టులోనూ అనేక ఆశ్చర్యకరమైన అంశాలు బయటకు వచ్చాయి. హైకోర్టు తీర్పు వెలువడే లోపల సిబిఐ ఆయన అరెస్టుకు నోటీసు ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వు తర్వాత విచారణ చేపట్టి తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలే చేసింది. దీనికి సమాంతరంగా పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి విచారిస్తున్న మరోకేసులో సుప్రీంకోర్టు సిబిఐ పూర్తిగా కేంద్ర అధీనంలోని సంస్థ మాత్రమేనని అదేదో స్వతంత్ర సంస్థ అన్నట్టు చెప్పడం సరికాదని తేల్చి చెప్పింది. ఈడి కేసుల్లో అరెస్టులు చేసేప్పుడు ఆ అధికారుల చిత్తవృత్తిని బట్టి తప్ప నిర్దిష్టమైన ఆధారాలతో జరగడం లేదని మరో కేసులో వ్యాఖ్యా నించింది. హైకోర్టులు బెయిలు రద్దు చేయడం ఏదో శిక్ష అన్నట్టు వ్యవహరించడం సరికాదని కూడా సుప్రీం కోర్టు మరో బెంచి ఇదే సమయంలో తీర్పునిచ్చింది. వీటన్నిటితో కేజ్రీవాల్‌పై ఏ తీర్పు వస్తుందనే ఉత్కంఠ నెలకొన్నది.

విచారణ సమయంలోనే కేజ్రీవాల్ తరపు సీనియర్



గడువు ముగిసి జూన్ 2న మళ్లీ తిహార్ జైలులో తనను తాను స్వాధీన పరుచుకున్న కేజ్రీవాల్ మళ్లీ మామూలు బెయిలు కోసం ప్రయత్నించగా రౌస్‌అవెన్యూ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీనిపై పూర్తి ఉత్తర్వు రాకముందే ఢిల్లీ హైకోర్టు మౌఖిక ఉత్తర్వుతో స్టే విధించింది. పూర్తి ఉత్తర్వు తర్వాత ఇస్తానని వాయిదా వేసింది. దీన్ని కేజ్రీవాల్ మరోసారి సుప్రీంలో సవాలు చేయగా ఈ పద్ధతిపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి..అసంతృప్తి వ్యక్తం చేశారు. బెయిలు నిలిపివేయడం వంటి విషయంలో లిఖితపూర్వక కారణాలివ్వాలని స్పష్టం చేస్తూనే పూర్తి నిర్ణయం చూడకుండా హైకోర్టు స్పందించడం సరికాదన్నారు.

అడ్వకేట్లు ఈడి వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. 2021 నుంచి విచారణ సాగుతుండగా సరిగ్గా ఎన్నికల తరుణంలోనే అరెస్టు చేయడం రాజకీయ ప్రేరతమని ఆరోపించారు. ఎక్కడా ఎలాంటి ఆధారాలు గానీ, నగదు లావాదేవీల వివరాలు గానీ లేకుండా కేవలం నిందితులలో ఒకరైన మాగుంట శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటల ఆధారంగా ముఖ్యమంత్రిని అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. (ప్రస్తుతం టీడీపీ ఎంపీ మాగుంట) తొలుత చెప్పిన దానికి తర్వాత చెప్పిన దానికి తేడా వుందని కేజ్రీవాల్ భార్య సునీత మీడియాకు వివరించారు. ఎన్‌డిఎలో కలిశాకే ఆయన కేజ్రీవాల్ ముడుపులు అందుకున్నారనే కథనం మొదలెట్టారని, వాస్తవానికి ఆయన మొదట కలిసిన విషయం వేరని ఆమె అంటున్నారు) ఇందుకు భిన్నంగా కేజ్రీవాల్‌కు ఈ కేసుతో సంబంధం వుందని ఈడి తరపున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది వాదించారు. అయితే సంబంధం వుంది గనక విచారించాలనుకున్నా అరెస్టు చేస్తే తప్ప విచారించలేరని ఎలా చెప్పగలరని కోర్టు మరీ మరీ ప్రశ్నించింది. మేము నోటీసులిచ్చినా ఆయన హాజరు కాలేదు గనక అరెస్టు చేయవలసి వచ్చిందని ప్రభుత్వం వాదించింది. అయితే 2022 ఆగష్టులో నమోదైన కేసుకు సంబంధించి 2024 మార్చిలో అరెస్టు అవసరం ఏముంటుందని కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

అరెస్టుకు ప్రాతిపదిక ఏమిటి?

దాంతో సుప్రీంకోర్టు అసలు ఏ పరిస్థితులలో అరెస్టు చేయాలనే దానిపై ఈడికి ఒక నిర్దిష్టమైన విధానం వుందా అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. సదరు వ్యక్తికి సంబంధించి అందుబాటులో వున్న సమాచారం బట్టి వాస్తవికంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందా? ఈడి అధికారుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఎలా చేస్తారని నిలదీసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ (పిఎంఎల్ఎ) సెక్షన్19(1)కింద అరెస్టు చేసేందుకు ఈడి అధికారులకు ఇచ్చిన అధికారం చాలా తీవ్రమైం దని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తీర్పు రాసిన జస్టిస్ ఖన్నా ఇందుకు సంబంధించిన వివరాలు కూడా పొందుపర్చారు.2023 నాటికి ఈడి దగ్గర 5906 కేసుల నివేదికలు నమోదయ్యాయి. 4564 నోటీసులు ఇచ్చి 531 మందిని మాత్రం విచారిం చారు. ఇందులో 176 ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలకు సంబంధించినవి.1142 ప్రాసిక్యూ షన్ ఫిర్యాదులు నమోదు కాగా 513 మందిని అరెస్టు చేశారు. ఈ సంఖ్యలు, వాటిలో తేడాలు చూస్తే చాలా సందేహాలు కలుగుతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫలానా వ్యక్తి నేరం చేసి వుంటారని ఈడి అధికారి తన స్వీయభావనకు వచ్చినంత మాత్రాన అరెస్టు చేయడానికి ఎలా అధికారమిస్తారని ప్రశ్నవేసింది. దర్యాప్తు అధికారి ఆ విధమైన అంచనాకు రావడానికి కారణాలేమిటో లిఖితపూర్వకంగా అందజేయడం అవసరమనే కేజ్రీవాల్ వాదనతో కోర్టు ఏకీభవించింది. ఇక్కడ ప్రస్తావించిన అంశాలు గత చాలా కాలంగా ప్రతిపక్షాలు న్యాయ నిపుణులు లేవనెత్తుతూ వస్తున్నవే. చట్టానికి సంబంధించిన ఈ మౌలిక ప్రశ్నలు మరింత లోతుగా చర్చించేందుకు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావాలని కోర్టు భావించింది.అరెస్టు చేయడాన్ని ప్రశ్నిచడం, అరెస్టు చేయవలసిన అవసరం వుందా అనేదాని ఆధారంగా అరెస్టు ఉత్తర్వును ప్రశ్నించవచ్చునా? మామూలు లెక్కల ప్రకారం అరెస్టు అవసరమని భావించి చేయొచ్చునా లేక ఆ వ్యక్తికి సంబంధించిన కారణాలు పరిస్థితులు సామగ్రి కూడా పరిగణనలోకి తీసుకోవాలా?ఈ రెండు ప్రశ్నలకు ఈడి అవుననే సమాధానం ఇచ్చినట్టయితే కోర్టు ఏ కొలబద్దతో విచారించాలి? వీటిని విచారించడానికి సమయం పడుతుంది గనక ఈ లోపల కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిలు మంజూరు చేస్తూ అధికారిక విధులకు మాత్రం దూరంగా వుండాలని నిర్దేశించింది. లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలనకు పంపే వాటిపై తప్ప ఇతర పత్రాలపై లేక తనకు సంబంధించిన కాగితాలపై సంతకాలు చేయరాదని, మాట్లాడ రాదని ఆంక్షలు ఎట్టింది. గనుక న్యాయస్థానం చాలా పకడ్బందీగానే ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకుందని చెప్పాల్సివుంటుంది.తుదితీర్పు వెలువడితే త్రిశూల వ్యూహాలకు కొంతైనా పగ్గాలు పడొచ్చు. ■

హీరో, విలన్ ఒక్కటయ్యారు?

ఇది సినిమా టైటిల్‌లా ఉందే. ఏ సినిమాలోనూ హీరో, విలన్ ఒక్కటి కారు కదా? అలా సినిమా తీస్తే జనం చూడరు. అందుకే కమర్షియల్ ప్రొడ్యూసర్ ఎవరు దానికి కమిట్ కారు. నేను చెప్పేదీ మాత్రం రాజకీయాల్లో జరుగుతున్న తీరు గురించి. కొంతమంది హీరోల్లా, అప్పుడప్పుడు విలన్ల మారిపోతుంటారు. కొన్నిసార్లు వారి పాత్రలు కూడా మారుతుంటాయి. అలాంటివి చూసి, చూసి ప్రజలకు కూడా అలవాటైపో యింది. రాజకీయాల్లో అటువంటి ఓ సంఘటన మీకు గుర్తు చేస్తున్న. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ముంచి రాష్ట్రంలో కమలాన్ని వికసింపజేయాలనే కుట్రతో బీజేపీ మునుగోడులో ఉప ఎన్నికకు స్కెచ్ వేసింది. అందులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాజీనామా చేయడంతోపాటు బీజేపీలో చేరడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. రాజగోపాల్‌రెడ్డి అన్నగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం బీజేపీలో తమ్ముడి విజయం కోసం పనిచేస్తున్నారంటూ కాంగ్రెస్ విలన్‌గా చూసింది. ఆ సమయంలో ఆయన లండన్ వెళ్లడం, అనుయాయులకు ఫోన్లు చేసి తమ్ముడికి ఓట్లు వేయాలని కోరడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ క్రమంలో ఇండియన్ ఫైల్స్ హీరో, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్ అప్పట్లో వెంకట్‌రెడ్డిపై హాట్ కామెంట్స్ చేశారు. 'పార్టీలో ఉంటే ఉండండి..లేకపోతే వెళ్లిపోండి' అంటూ తీవ్ర స్వరంతో గర్జించారు. దీంతో ఆయన కాంగ్రెస్‌లో హీరోలా అనిపించినా, వెంకట్‌రెడ్డి విలన్‌లా అనిపించినా పై చేయి మాత్రం ఆయనదే అయింది. అప్పటి నుంచి అద్దంకికి ఏ పదవి రాకుండా అడ్డుపుల్లా వేస్తున్నారని టాక్. పరిస్థితులు మారాయి. ప్రస్తుతం పాత్రలు మారాయి. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి అయ్యారు. అద్దంకి దయాకర్ ఇండియన్ ఫైల్స్ చిత్రం హీరో అయ్యారు. ఆ చిత్రం ఆడియో ఫంక్షన్‌కు సినిమాటోగ్రఫి మంత్రి కోమ టిరెడ్డిని అద్దంకి ఆహ్వానించారు. కడుపులో తలపెట్టి మరీ ఫొటోకు ఫోజులిచ్చారు. ఆ చిత్రం ఆడియో ఫంక్షన్‌లో కూడా ఇద్దరు ఎంతో ఆప్యాయతను పంచుకున్నారు. సినిమాపై కోమటిరెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. ఈ అపూర్వ సన్నివేశాన్ని చూసిన ప్రేక్షకులు 'హీరో, విలన్ ఒక్కటయ్యారు' అని గుసగుస లాడుకున్నారు.

- గుడిగ రఘు

ఏమిరా బాలరాజూ...?

'తెలంగాణ కోసం ఎక్కని గడప లేదు.. మొక్కని దేవుడు లేడు...' గులాబీ బాస్ కేసీఆర్ పదే పదే చెప్పే మాట ఇది. దీన్ని విలేకర్ల భాషలోకి మార్చుకుంటే వార్తలు, స్టోరీలు, సంబంధిత సమాచారం కోసం వెళ్లని ఆఫీసు లేదు.. నమస్కారం పెట్టని అధికారి లేడు... అని చెప్పుకోవాల్సి వస్తుంది. ఇందులో భాగంగా ఇటీవల ఓ రోజు మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయానికి వెళితే... ముఖ్యమంత్రి మహబూబ్‌నగర్ పర్యటనలో ఉన్నారు. మంత్రులందరూ జిల్లాల్లో బిజీబిజీ అయిపోయారు. సెక్రటేరియట్‌లో ఆ రోజు కార్యక్రమాలే లేకుండా పోయాయి. మరి సాయంత్రానికి ఏదో ఒక వార్త రాయాలే.. ఒక మాంచి స్టోరీ వండి వడ్డించాలాయే. అందుకే ఓ నలుగురైదుగురు పాత్రికేయులు కలిసి 'వైట్‌హౌస్' లాంటి ఆ సచివాలయంలో కింది నుంచి పైదాకా ఆరు అంతస్తులెక్కి, దిగారు. ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులను కలిసేందుకు ప్రయత్నిస్తే వారందరూ వారి వారి శాఖల అంతరంగిక సమావేశాల్లో మునిగిపోయారు. ఇక చేసేదేమీ లేక... ఉసూరుమంటూ మొదటి అంతస్తులోని క్యాంటీన్‌లోకెళ్లి, కాసింత తేనీరు (అదేనండీ 'టీ') తాగి, అలా కూలబడ్డారు. ఇంతలో ఓ సీనియర్... తనకు బాగా పరిచయమున్న ఓ ఆఫీసరుకు ఫోన్‌కొట్టి...'అన్నా.. మీరైనా ఉన్నారా...? కలిసేందుకు వస్తున్నాం...' అనగానే 'తప్పకుండా రండి బ్రదర్...' అంటూ ఆహ్వానించ టంతో ఎగిరిగంతేశారు ఆ జర్నలి స్టులు. ఆయన ఛాంబర్‌లోకి అడుగుపెట్టగానే... పెద్దపెద్ద కేకలు వినబడుతున్నాయి. విషయమేంటని ఆరాతీస్తే... ఆయన కింద పని చేసే మరో ఉద్యోగి వేరే డిపార్టుమెంటులో పనిచేసే తన భార్య ట్రాన్స్‌ఫర్ కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలంటూ అడిగారు. సరే సిఫారసు చేస్తా, మీ ఆవిడ వివరాలన్నీ ఈ పేపర్ మీద రాసివ్వు... అంటూ ఆ ఆఫీసరు సూచించారు. ఓ ఐదు నిమిషాల తర్వాత మనవాడు రాసిచ్చిన వివరాలు చూసి ఆయన ఖంగు తిన్నారు. తమ్ముడూ.. నువ్వు రాసిన వివరాలు సరిగాలేవు, మరోసారి వాట్సాప్‌లో టైప్ చేసి, నాకు పంపు, నేను పై వాళ్లకు పంపుతా... అని చెప్పాడు. పది నిమిషాల తర్వాత అతడు టైపు చేసింది చూసి అగ్గిమీద గుగ్గిలమయ్యారు ఆ ఆఫీసరు. 'ఒరేయ్ బాబూ.. నువ్వు గవర్నమెంటు కొలువులో, పెద్ద పొజిషన్‌లో ఉన్నావు. కనీసం పై ఆఫీసరుకు లెటర్ ఎలా రాయలో తెలియకపోతే ఎలా..?' అంటూ ఒంటికాలి మీద లేచాడు. అది చూసిన పాత్రికేయులకు 'ఏమిరా బాలరాజూ.. నీవల్ల దేశానికి ఏమి ఉపయోగం...?' అనే ధర్మవరపు సుబ్రమణ్యం డైలాగ్ గుర్తొచ్చింది.

-బి.వి.యన్.పద్మరాజు

శివరామ సంగ్రామం



జంధ్యాల రఘుబాబు
9849753298

రాముడు శివుడు మాట్లాడుకుంటున్నారు చాలా సీరియస్సుగా. భీముడు వింటున్నాడు ఒక్కడే. 'ఇదేమిటి శివా..నీవు నాకు పోటీగా తయారయ్యావా' అంటున్నాడు రాముడు. 'నీవు సాక్షాత్తూ విష్ణువువి కదా నీకెందుకు పోటీనవుతాను, అయినా బ్రహ్మవిష్ణు,మహేశ్వరులే కదా ప్రపంచానికి ఏదైనా సమస్య వస్తే పరిష్కరించేది. అలాంటిది మన మధ్య సమస్య ఎందుకొస్తుంది రామా?' అంటున్నాడు శివుడు. ఈలోపల హనుమంతుడూ వచ్చాడు, వస్తూనే రాముడికి, శివుడికి నమస్కరించి భీముడిని హత్తుకున్నాడు, ఎందుకంటే తమ్ముడు కదా! 'నీవు నాకంటే ముందుగా వచ్చి ఉంటావు కదా అని వచ్చానన్నయ్యా' అన్నాడు భీముడు. ఆర్జా జనార్దన రావులా నవ్వి తల ఊపాడు హనుమంతుడు. ఇంతలో భీముడు పక్కకుపోయి సెల్లు తీశాడు, వినాయకుడికి, కుమారస్వామికి ఫోన్ చేసి వెంటనే ఫలానా చోటికి రమ్మన్నాడు. లేదంటే శివ రామ సంగ్రామం జరిగేలా ఉందన్నాడు. వాళ్లు వెంటనే వచ్చేశారు.

రాముడడిగాడు "ఎందుకు భీమా నీవు కాస్త టెన్షన్లో ఉన్నట్టున్నావు"

"ఈ మానవుల కథ నీకు తెలియదు రామ స్వామీ, ఇద్దరు దేవుళ్లకు తగవు కల్పించి కావ్యాలు రాస్తారు, తరువాత సినిమాలూ తీస్తారు. ఈ మధ్య మన సినిమాలు ప్రపంచమంతా తిరుగుతున్నాయి. బాగా డబ్బులు సంపాదిస్తున్నాయి. ఎందుకైనా మంచిదని వాళ్లను పిలిచాను"

"మరి లక్ష్మణున్ని పిలవలేదెందుకు?" రాముడడిగాడు

"మీ తమ్ముడికి చాలా షార్ట్ టెంపర్ స్వామీ, చెప్పకపోవడమే మేలు, లేదంటే శివ లక్ష్మణ యుద్ధం జరిగినా జరగొచ్చు. రాముడికి శివుడికి ఏదో తగవొచ్చిందని ఒక్కమాట చెబితే చాలు, సుగ్రీవుణ్ణి, అతడి సైన్యాన్ని పట్టుకొని వచ్చేస్తాడు. మా తమ్ముడు అర్జునుడు శివుడితో పోరాడి ఓడినా పాశుపతాస్త్రము సంపాదించాడు, ఎందుకంటే అప్పుడు అవసరం కాబట్టి. ఇప్పుడు అన్ని యుద్ధాలూ అయిపోయి హాయిగా ఉన్నాము కదా, అలాగే ఉందామని నా ఆలోచన."

"అయినా భీమా..నీవు చొరవ తీసుకొని మీ అన్న హనుమంతునికంటే ముందే వచ్చావు? అందులో ఆంతర్యమేమిటి?" రాముడు అడిగాడు

"ఏమో రామయ్యా నాదో చిన్న ఆశ. రాముడు తరువాత శివుడు ఇలా మీ ఇద్దరినీ వెలుగులోకి తెచ్చారు వాళ్ల వాళ్ల అవసరాన్ని బట్టి. తరువాత మీ పేర్లకి దగ్గరగా ఉన్నది భీముడు అన్న నా పేరే కదా అందుకే వచ్చేశాను. అటు దుర్యోధనుడు, ఇటు మా అన్న ధర్మరాజు ఉన్నందువల్ల నా పేరు భారతంలో సరిగా వినబడలేదు. అది నేటి భారతంలోనైనా హైలైట్ అవుతుందేమోనన్న ఆశ ఒక పక్క."

".....?!" రాముడు

"మొత్తం మీద ఈ రాహుల్ గాంధీ మనిద్దరికీ పోటీ పెట్టాడుగా రామా" శివుడన్నాడు విషయానికొస్తూ

"ఏముందిలే శివయ్యా, నేనొక్కడినే అందరి నోళ్లలో నాని నాని నాకూ విసుగ్గా ఉంది, ఇకనుండి మనిద్దరమూ వస్తుంటాము వార్తల్లో, నాకూ కొద్దిగా రిలీఫ్ కదా!! అదీ కాక నా పేరు వాడుకున్న చోటల్లా ఫలితాలు తారుమారైనాయి. నాకు మంచిపేరు ఎవరు తెప్పిస్తున్నారో, చెడ్డపేరు ఎవరు తెప్పిస్తున్నారో, నన్ను ఎవరు వాడుకుంటున్నారో ఏమీ అర్థం కావడం లేదు. అసలు నాకు పేరు తెస్తున్నారో, లేక నా పేరు వాడుకుంటున్నారో కూడా తెలియడం లేదు."

"అదీ నిజమేననుకో, నాకూ ఈ రాజకీయాలకూ చాలా దూరం, అదొక్కటే ఆలోచిస్తున్నాను?"



"శివదేవా, అవే అలవాటవుతాయిలే తరువాత, కొద్దిగా ఓపిక పట్టాలి. నీవు కూడా బాలశివుడి బొమ్మలను సిద్ధంగా ఉంచుకో ఎందుకైనా మంచిది, ఈమధ్య పెద్ద విగ్రహానికి ముందు చిన్నప్పటిది పెట్టి సమయం వేస్ట్ కాకుండా కాపాడుకుంటున్నారు."

"నాకు విగ్రహాలు ఉండవు కదా రామా, శివలింగాన్నే చిన్నగా చేయిస్తే సరిపోతుందా"

"భలే చెప్పారు శివా..." అని హనుమంతుడు, భీముడు చప్పట్లు కొట్టారు

... ...

భలే చెప్పారు శివా, భలే చెప్పారు అంటూ నిద్రలోనే చప్పట్లు కొడుతున్నాడు వెంకోబరావు. భార్య వచ్చి లేపింది, ఏమిటండీ నాటకాలు మానేసినా..ఇంకా మీకు ఆ కలలు వస్తూనే ఉంటాయా ఏమిటి అంది. అది సంగతి.

మొత్తం మీద రాముడికి శివుడికి పోటీ పడింది. రాముడంటే చాలా పేరున్న గ్లామరస్ హీరో. ఎన్టీఆర్ దగ్గర నుండి జూనియర్ ఎన్టీఆర్ వరకు ఎందరో హీరోలు ఆ పాత్ర వేశారు. చివరికి బ్రహ్మానందం కూడా ఓ సినిమాలో దొంగ



రాముడి పాత్ర వేసి శబరి దగ్గరికి పోతే ఆమె కనిపించీ కనిపించకున్నా ఏమి రామా మామూలుగా లేక కాస్త పొట్టిగా ఉన్నావు అంటుంది. ఇక అన్న రామారావు రాముడి పాత్రలో ఇమిడిపోయి ఎన్నో సినిమాలు వేసినా చాలక చాలా సినిమాలకు చివర ఈ రాముడు అన్న పదం తగిలించి ఎన్నో హిట్లు సంపాదించాడు. ఆయన శివుడి పాత్ర రెండో మూడో సినిమాల్లో వేసి శివుడి గ్లామరునీ కొట్టేశాడు. ఇక కృష్ణంరాజు నుండి మెగాస్టార్ దాకా కొందరు పూర్తి నిడివి శివుడి పాత్రను వేశారు కొన్ని సినిమాల్లో. అంతకు మించి బ్రహ్మకు, శివుడికి పెద్దగా సినిమాల్లేవు. కింద భూలోకం మీదికి పైనుండి బ్రహ్మ, శివుడు ఆశీర్వదించడం, దేవతలందరితో పాటు పూలు కురిపించడం తప్ప పెద్ద పాత్రల్లేవు. కోపమొచ్చినప్పుడు శివతాండవం చేయడం, మహా అయితే ఒక పాట పెట్టడం తప్ప శివుడిని సినిమా వాళ్లు ఎక్కువగా పట్టించుకోలేదు.

అనుమంటిది ఈ మధ్య శివుడిని చట్టసభలో చూపించి కొత్తగా పరిచయం చేశాడో యువ నాయకుడు. సచిన్ టెండుల్కర్‌లా రెచ్చిపోయి మాటల సిక్సర్లు కొట్టాడు కూడా. గవాస్కర్ లాంటి సీనియర్లు అటువైపునుండి క్యాచ్ పట్టుకుందామన్నా వీల్లేకుండా బాదేశాడు. లేనోళ్ల దేవుడిగా పేరున్న శివుడిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశాడు. తనగురించి శివుడికి కూడా తెలియని విషయాలని ఎన్నో చెప్పాడు. చప్పట్లు కొట్టించుకున్నాడు. అసలు వాళ్ల నాన్న రాముడిని బయటకు తీయాలని ప్రయత్నిస్తే వేరేవాళ్లు హైజాక్ చేశారన్న కోపమో ఏమో మొత్తమ్మీద రెచ్చిపోయాడు. అతని మాటలు రికార్డుల్లోనుండి తీసేశారు కాని అప్పటికే ప్రజలందరూ విన్నారు.

*** *** ***

వెంకోబరావుకు మళ్లీ నిద్ర పట్టింది.

రాముడు, శివుడు మాట్లాడుకుంటున్నారు, ఈసారి ఏకాంతంగా. ఐనా రామా ఈ రాజకీయ నాయకులు మనల్ని బాగా వాడుకుంటున్నారు. మనలో మనకే పోటీ పెడుతున్నారు. శివకేశవులు ఒక్కటేనని తిక్కన మహాకవి మాటల్ని గుర్తు చేసుకొని మనం జాగ్రత్తగా ఉండాలి అన్నాడు శివుడు.అవును శివదేవా, ఆఖరుకి వాడుకొని పారేసే వస్తువుల్లా చేస్తారేమో మనల్ని అనిపిస్తోంది.

శివకేశవులు, హరిహరులు ఒకటేనని నిరూపిద్దాం... ఇద్దరూ ఒకేసారి అన్నారు.

శివకేశవులు ఇద్దరూ ఒకటే, ఇద్దరూ ఒకటే వెంకోబరావు కలవరిస్తున్నాడు.

ఈయనకు మళ్లీ నిద్ర పట్టినట్టుంది అనుకుంది అతని సతీమణి. ■

రన్నరప్ రాజా రిత్విక్



హైదరాబాద్ : తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ లష్లేన్ ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఫ్రాన్స్‌లోని లష్లేన్ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో రిత్విక్ తొమ్మిది రౌండ్లలో ఏడు పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు.రన్నరప్‌గా నిలిచి రజతం సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో 22 దేశాల నుంచి 184 మంది మేటి ఆటగాళ్లు పోటీ పడ్డారు. తొమ్మిది రౌండ్లలో రిత్విక్ అజేయంగా నిలిచి రన్నరప్ టైటిల్ గెలిచాడు. రిత్విక్ ఐదు రౌండ్లలో గెలుపొంది, నాలుగు రౌండ్లలో డ్రా చేసుకున్నాడు.

క్వీన్ క్రెజికోవ

మహిళల సింగిల్స్ టైటిల్ సొంతం

- ఫైనల్లో జాస్మిన్ పావొలిని పరాజయం
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ 2024



లండన్ (ఇంగ్లాండ్) : వింబుల్డన్‌కు కొత్త రాణి వచ్చింది. తొలిసారి ఫైనలిస్టుల సమరంలో చెక్ రిపబ్లిక్ భామ బార్బరా క్రెజికోవ విజయం సాధించింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. రెండు గంటల పాటు ఉత్కంఠగా సాగిన మూడు సెట్ల మెగా మ్యాచ్‌లో 6-2, 2-6, 6-4తో జాస్మిన్ పావొలిని (ఇటలీ)పై ఘన విజయం సాధించింది. 2021లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ విజయం సాధించిన బార్బరా క్రెజికోవ.. మూడేండ్ల విరామం తర్వాత కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని ముద్దాడింది. ఇటలీ భామ జాస్మిన్ పావొలినికి వరుసగా రెండోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో భంగపాటు తప్పలేదు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టైటిల్ పోరుకు చేరుకున్న పావొలిని.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో టైటిల్ దిశగా రెండోసారి ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. మూడు సెట్ల పోరాటంలో పావొలినికి పరాజయం తప్పలేదు.

వింబుల్డన్ మహిళల సింగిల్స్ అత్యంత ఉత్కంఠగా సాగింది. ఫైనల్లో క్రెజికోవ, పావొలిని ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. పవర్ గేమ్‌తో తొలి సెట్‌ను క్రెజికోవ 6-2తో సొంతం చేసుకోగా.. రెండో సెట్‌లో పావొలిని దుమ్మురేపింది. అదే స్థాయిలో ప్రతి స్పందిస్తూ 6-2తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్ నిర్ణయాత్మక మూడో సెట్‌కు దారితీసింది. డిసైడర్‌లో క్రెజికోవ పైచేయి సాధించింది. 6-4తో జాస్మిన్ పావొలినిపై పైచేయి సాధించింది. కెరీర్‌లో రెండు సార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్న క్రెజికోవ.. రెండు సార్లు టైటిల్ సొంతం చేసుకోవటం విశేషం. ఆరు ఏస్‌లు కొట్టిన క్రెజికోవ.. మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. మూడు ఏస్‌లు సంధించిన పావొలిని రెండు బ్రేక్ పాయింట్లు సాధించింది. పాయింట్ల పరంగా 85-76తో క్రెజికోవ పైచేయి సాధించింది. క్రెజికోవ 14 గేమ్ పాయింట్లు గెలుపొందగా.. పావొలిని సైతం 12 గేమ్ పాయింట్లతో సత్తా చాటింది.

కింగ్ ఎవరో?

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో మరో ఆసక్తికర ఫైనల్ సిద్ధమవుతోంది. స్పెయిన్ యువ బుల్ కార్లోస్ అల్కరాస్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్‌లు నేడు పురుషుల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇటీవల కార్లోస్ అల్కరాస్ నుంచి గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో గట్టి పోటీ చవిచూస్తున్న నొవాక్ జకోవిచ్.. నేడు ఎలాగైనా అచ్చొచ్చిన వింబుల్డన్‌లో టెన్నిస్ ఓపెన్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాలని తపిస్తున్నాడు. బ్రేకుల్లేని జోరుమీదున్న కార్లోస్ అల్కరాస్ పచ్చిక కోర్టులోనూ ప్రతాపం చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నొవాక్ జకోవిచ్ ఇప్పటివరకు 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో మార్గరెట్ కోర్టుతో సమవుజ్జీగా కొనసాగుతున్నాడు. నేడు వింబుల్డన్ ఫైనల్లో విజయం సాధిస్తే ఓపెన్ శకంలో (మహిళలు, పురుషులు) అత్యధిక గ్రాండ్‌స్లామ్ సాధించిన ఆటగాడిగా నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించనున్నాడు.

యశస్వి జైస్వాల్ (93 నాటౌట్) దంచికొట్టాడు. శుభ్‌మన్ గిల్ (58 నాటౌట్) చెలరేగాడు. ఓపెనర్లు ఇద్దరూ కుమ్మేయటంతో ఆతిథ్య జింబాబ్వే చిన్నబోయింది. యువ ఓపెనర్లు ధనాధన్ దంచుడుతో 153 పరుగుల లక్ష్యాన్ని భారత్ వికెట్ నష్టపోకుండా ఛేదించింది. 10 వికెట్ల తేడాతో నాల్గో టీ20లో ఏకపక్ష విజయం సాధించింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్ 3-1తో భారత్ కైవసం చేసుకుంది. సిరీస్‌లో నామమాత్రపు చివరి టీ20 నేడు హరారేలోనే జరుగనుంది.

ఓపెనర్లే ఉతికేశారు



జైస్వాల్, గిల్ అజేయ అర్థ సెంచరీలు

- నాల్గో టీ20లో టీమ్ ఇండియా ఘన విజయం
- 3-1తో టీ20 సిరీస్ భారత్ కైవసం

నవతెలంగాణ-హరారే

ఓపెనర్లు వీరంగం సృష్టించారు. హరారేలో అదిరే ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (93 నాటౌట్, 53 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (58 నాటౌట్, 39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీలతో విశ్వరూపం చూపించారు. 153 పరుగుల ఛేదనలో 15.2 ఓవర్లలో 156 పరుగులు చేసిన టీమ్ ఇండియా.. 10 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. అంతకు ముందు, జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ సికిందర్ రజా (48, 28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), మారుమని (32, 31 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. ఛేదనలో దంచికొట్టిన యశస్వి జైస్వాల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

ఓపెనర్లే ఊదేశారు

భారత్ ముందున్న లక్ష్యం 153 పరుగులు. బ్యాటింగ్ లైనప్‌లో అందరూ ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లే. హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ కఠిన సవాల్ విసిరినా.. యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (93 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (58 నాటౌట్) అజేయ అర్థ సెంచరీలతో చెలరేగారు. 15.2 ఓవర్లలోనే 156 పరుగులు పిండుకుని మరో 28 బంతులు మిగిలి ఉండగానే ఏకపక్ష విజయం కట్టబెట్టారు. పవర్‌ప్లే నుంచే ఓపెనర్లు ధనాధన్ దంచుడుకు పని పెట్టారు. ఆరు ఓవర్లలో భారత్ 61 పరుగులు చేసింది. ఆ తర్వాత దూకుడు మరింత పెంచారు. యశస్వి జైస్వాల్ రెండు సిక్సర్లు సహా 13 బౌండరీలు బాదాడు. శుభ్‌మన్ గిల్ రెండు సిక్సర్లు సహా ఆరు బౌండరీలతో మెరిశారు. తొమ్మిది ఫోర్లతో 29 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్.. సత్తా చాటాడు. శుభ్‌మన్ గిల్ కాస్త నెమ్మదించినా.. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 35 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. జింబాబ్వే బౌలర్లలో ఎవరూ భారత ఓపెనర్లకు సవాల్ విసరలేకపోయారు. ఆరుగురు బౌలర్లను ప్రయోగించినా.. జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా ఓ వికెట్ పడగొట్టలేకపోయాడు.

రాణించిన రజా

టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన జింబాబ్వేను భారత బౌలర్లు 152 పరుగులకే పరిమితం చేశారు. స్పిన్నర్లు రవి బిష్ణోయ్ (0/22), వాషింగ్టన్ సుందర్ (1/32), అభిషేక్ శర్మ (1/20)లను ఈసారి జింబాబ్వే బ్యాటర్లు కాస్త మెరుగ్గా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రవి బిష్ణోయ్ మాయకు వికెట్లు పడకుండా జాగ్రత్త వహించారు. పేసర్లు ఖలీల్ అహ్మద్ (2/32), తుషార్ దేశ్‌పాండే (1/30), శివం దూబె (1/11) రాణించారు. ఓపెనర్లు వెస్లీ (25), మారుమని (32) తొలి వికెట్‌కు శుభారంభం అందించారు. 8.4 ఓవర్లలో 63 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. మూడు ఫోర్లతో 31 బంతుల్లో 32 పరుగులు చేసిన మారుమని..24 బంతుల్లో 25 పరుగులు చేసిన వెస్లీ స్వల్ప విరామంలో వికెట్లు కోల్పోయారు. పవర్‌ప్లేలో భారత పేసర్ల దూకుడుకు ఎదురొడ్డి ఎదురు దాడి చేయకుండా.. బంతి పాతబడే వరకు బ్యాటర్లు ఎదురు చూశారు. ధనాధన్ హిట్టర్ బెనెట్ (9) నిరాశపరిచినా.. కెప్టెన్ సికిందర్ రజా (46) కీలక ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో 28 బంతుల్లోనే 46 పరుగులు పిండుకున్నాడు. జొనథన్ కాంప్‌బెల్ (3), మేయర్స్ (12), క్లైవ్ (7) నిరాశపరిచారు. భారత్ ఎక్స్‌ట్రాల రూపంలో 14 పరుగులు ఇవ్వటం సైతం జింబాబ్వేకు బాగా కలిసొచ్చింది.

స్కోరు వివరాలు

జింబాబ్వే ఇన్నింగ్స్ : వెస్లీ (సి) రింకూ (బి) దూబె 25, మారుమని (సి) రింకూ (బి) అభిషేక్ 32, బ్రియాన్ (సి) జైస్వాల్ (బి) వాషింగ్టన్ 9, సికిందర్ రజా (సి) గిల్ (బి) దేశ్‌పాండే 46, జొనాథన్ కాంప్‌బెల్ (రనౌట్) 3, మేయర్స్ (సి,బి) అహ్మద్ 12, క్లైవ్ మదాండె (సి) రింకూ (బి) ఖలీల్ అహ్మద్ 7, ఫరాజ్ అక్రమ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం :** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 152.

వికెట్ల పతనం : 1-63, 2-67, 3-92, 4-96, 5-141, 6-147, 7-152.

బౌలింగ్ : ఖలీల్ అహ్మద్ 4-0-32-2, తుషార్ దేశ్‌పాండే 3-0-30-1, రవి బిష్ణోయ్ 4-0-22-0, వాషింగ్టన్ సుందర్ 4-0-32-1, అభిషేక్ శర్మ 3-0-20-1, శివం దూబె 2-0-11-1.

భారత్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 93, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 58, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :** (15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 156.

బౌలింగ్ : రిచర్డ్ 3-0-27-0, బ్లెస్సింగ్ 3.2-0-25-0, చతార 2-0-23-0, ఫరాజ్ అక్రమ్ 4-0-41-0, సికిందర్ రజా 2-0-24-0, బ్రియాన్ బెనెట్ 1-0-16-0.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా!

- శాట్జ్ నూతన చైర్మెన్ శివసేనా రెడ్డి
- అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమం

నవతెలంగాణ-హైదరాబాద్

'అందరికీ క్రీడలు-అందుబాటులో క్రీడలు' లక్ష్యంగా అందరి సహకారంతో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) నూతన చైర్మెన్ కె. శివసేనా రెడ్డి అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో శివసేనా రెడ్డి శాట్జ్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. శివసేనా రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహా ఎంపీలు మల్లురవి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్,



రాజయ్య, ఫిరోజ్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు సహా శాట్జ్ కోచ్‌లు, సిబ్బంది, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెస్ ఒలింపియాడ్‌కు అర్జున్


చెన్నై: ఇండియా గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన ఎరిగైసి అర్జున్ చెస్ ఒలింపియాడ్‌లో పోటీ పడనున్నాడు. సెప్టెంబర్‌లో హంగేరిలోని బుడాపెస్ట్ వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనే ఇండియా మెన్స్, విమెన్స్ టీమ్స్‌ను ఆలిండియా చెస్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) శనివారం ప్రకటించింది. మెన్స్‌లో అర్జున్‌తో పాటు ఏపీ ఆటగాడు పెంటేల హరికృష్ణ, డి. గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ ఉన్నారు. విమెన్స్ టీమ్‌లో ఏపీ అమ్మాయి ద్రోణవల్లి హారికతో



పాటు ఆర్. వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్‌కు చోటు దక్కింది. 2022లో బ్రాంజ్ మెడల్ నెగ్గిన టాప్ ప్లేయర్ కోనేరు హంపిని విమెన్స్ టీమ్‌ను తప్పించారు.

నవచిత్రం

డ్రీమ్ రోల్ చేశా..



నభా నటేష్

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో హీరోయిన్ నభా నటేష్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'డైరెక్టర్ అశ్విన్ రామ్ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా బాగా నచ్చింది. నా క్యారెక్టర్ ఇంకా బాగా నచ్చింది. ఇది చాలా ఛాలెంజింగ్ రోల్. ఇప్పటివరకూ ఇలాంటి రోల్ చేయలేదు. స్ప్లిట్ పర్సనాలిటీ ఉన్న ఈ పాత్రని పెర్ఫార్మ్ చేయడం చాలా సవాల్‌గా అనిపించింది. మొత్తానికి నా డ్రీమ్ రోల్ చేయటం చాలా ఆనందంగా ఉంది. కామెడీ, లవ్ స్టోరీ ఎంటర్‌టైనర్‌లో ఇలాంటి క్యారెక్టర్ పెట్టడం చాలా ఆసక్తికరంగా అనిపించింది. మంచి కథ కోసం ఎదురుచూస్తున్న సమయంలో వచ్చిన అద్భుతమైన స్క్రిప్ట్ ఇది. బేసిగ్గా నేను ఎంటర్‌టైనింగ్‌గా ఉండే రోల్స్‌ని పిక్ చేయడానికి బాగా ఇష్టపడతాను. చిన్నప్పటినుంచి ఫన్ అండ్ ఎంటర్టైనింగ్ సినిమాలు చూస్తూనే పెరిగాను. ఫన్, లవ్, ఫ్యామిలీ డ్రామా, థ్రిల్లర్ ఎలిమెంట్స్ ఇలా అన్నీ ఉన్న కంప్లీట్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రియదర్శితో కలిసి వర్క్ చేయడం చాలా బావుంది. మాఇద్దరి మధ్య నడిచే కథ. నా యాక్షన్‌కి ఆయన రియాక్షన్ చాలా ఇంపార్టెంట్. మా కెమిస్ట్రీ అద్భుతంగా వర్క్ అయ్యింది. తన కామెడీ టైమింగ్ చాలా నేచురల్‌గా వచ్చేస్తుంది. డైరెక్టర్ అశ్విన్ రామ్ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. చాలా అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. తను ఈ సబ్జెక్ట్‌ని హ్యాండిల్ చేసిన విధానం అద్భుతం. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాతలు సినిమాకి కావాల్సిన ప్రతీదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు'.

సరికొత్త ప్రేమకథ



కృష్ణ వంశీ హీరోగా పరిచయం అవుతున్న సరికొత్త ప్రేమకథా చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. మోక్ష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చిన నేపథ్యంలో తాజాగా మేకర్స్ మూవీ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఆగస్ట్ 2న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా ఈ సినిమా రిలీజ్ కానుంది. టాప్ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయనుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్ సినిమాపై మంచి బజ్‌ని క్రియేట్ చేశాయి.

బ్రహ్మాజీ, సుధ, ప్రమోదిన, వెంకటేష్ కాకమును, చైతన్య గరికిపాటి ఇతర ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి రచన - దర్శకత్వం :చిలుకూరి ఆకాష్ రెడ్డి, అసోసియేట్ నిర్మాత: విక్రమ్ జమ్ముల, డీవోపీ: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి, ఎడిటర్:జే సి శ్రీకర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ :గద్దల అన్వేష్, సాహిత్యం : చంద్రబోస్, రాకేందు మౌళి, శ్రేష్ఠ, భరద్వాజ్ గాలి, డా.జి.సుమతి, సహ రచయిత : శ్రీకాంత్ మందుముల, ఆర్ట్ డైరెక్టర్ : రవిదర్.పి, స్టంట్ మాస్టర్ :వింగ్ చున్ అంజి, కొరియోగ్రఫీ :-వై. మెహర్ బాబా, అజ్జు.



ఈ సక్సెస్ రామోజీరావుకి అంకితం

సోనియా సింగ్, పవన్ సిద్ధు లీడ్ రోల్స్‌లో వినోద్ గాలి దర్శకత్వంలో రూపొందిన వెబ్ సిరీస్ 'శశి మధనం'. హరీష్ కోహిర్కర్ నిర్మించారు. ఇటీవలే ఈటీవీ విన్‌లో రిలీజైన ఈ వెబ్ సిరీస్ ట్రెమెండస్ రెస్పాన్స్‌తో సూపర్ హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో హీరోయిన్ సోనియా సింగ్ మాట్లాడుతూ,'నా టీవీ కెరీర్ ఈటీవీతో మొదలైంది. మళ్ళీ ఈటీవీ విన్‌లో చేయడం చాలా ఆనందంగా ఉంది. మా సిరీస్‌ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన అందరికీ థ్యాంక్స్. ఆడియన్స్ సబ్ స్క్రిప్షన్ తీసుకుని మరీ చూడటం సంతోషంగా ఉంది. హరీష్ లేకపోతే ఈ ప్రాజెక్ట్ ఉండేది కాదు. అలాగే నితిన్, సాయి కూడా చాలా సపోర్ట్ చేశారు. వినోద్ అద్భుతమైన స్క్రిప్ట్‌తో వచ్చారు' అని తెలిపారు.

'ఈ సక్సెస్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. డైరెక్టర్ వినోద్ అద్భుతంగా తీశారు. ఈటీవీ విన్‌కి కృతజ్ఞతలు. మా నుంచి వచ్చే ప్రతి ప్రాజెక్ట్‌కి మీ సపోర్ట్ కావాలి' అని హీరో పవన్ సిద్ధు చెప్పారు.

డైరెక్టర్ వినోద్ గాలి మాట్లాడుతూ,'మా డైరెక్షన్ డిపార్ట్మెంట్ అంతా చాలా హార్డ్ వర్క్ చేశారు. మా నిర్మాత హరీష్‌కి థ్యాంక్స్. మొదటి నుంచి బలంగా నమ్మారు. మ్యూజిక్, డీవోపీ, ప్రొడక్షన్ డిజైనర్ ఇలా అందరూ అద్భుతంగా పని చేశారు. నటీనటులంతా చాలా సపోర్ట్ చేశారు. సిద్ధు సోనియా చాలా కోపరేట్ చేశారు. ఈ సక్సెస్‌ని రామోజీ రావుకి అంకితం ఇస్తున్నాం' అని తెలిపారు.

ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ మాట్లాడుతూ,'ఈ సక్సెస్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. గత నెలలో రామోజీరావు స్వర్గస్తులైనప్పుడు, మేము అంతా దిగులుగా ఉన్న తరుణంలో మాకొచ్చిన సక్సెస్ ఇది. ఇదొక మంచి ఎంగేజింగ్ కంటెంట్ అని నమ్మాం. మా నమ్మకం నిజమైంది. సబ్ స్క్రిప్షన్స్ వస్తున్నాయి. మేము పెట్టిన ఇన్వెస్ట్మెంట్ తొలి నెలలోనే రికవరీ అయ్యింది. సీజన్ 2 వర్క్ కూడా స్టార్ట్ అయ్యింది' అని అన్నారు.

నిర్మాత హరీష్ కోహిర్కర్ మాట్లాడుతూ,'ఫ్యామిలీ అంతా కూర్చుని చూసే ఎంటర్‌టైనర్ ఇది. ఈ అవకాశం ఇచ్చిన ఈటీవీ విన్‌కి థ్యాంక్స్' అని చెప్పారు.

జస్ట్ ఏ మినిట్ రిలీజ్‌కి రెడీ



అభిషేక్ పచ్చిపాల, వినీషా జ్ఞానేశ్వర్

'ఏడు చేపల కథ' ద్వారా పరిచయమైన అభిషేక్ పచ్చిపాల హీరోగా, నజియా ఖాన్, వినీషా జ్ఞానేశ్వర్ హీరోయిన్లుగా రెడ్ స్వాన్ ఎంటర్టైన్మెంట్, సుధర్మ మూవీ మేకర్స్ పతాకాలపై తన్వీర్, ప్రకాష్ నిర్మిస్తున్న చిత్రం 'జస్ట్ ఎ మినిట్'.

యశ్వంత్ దర్శకత్వంలో కామెడీ, లవ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 19న సినిమా విడుదలకు సిద్ధమైంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు తన్వీర్, ప్రకాష్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ చాలా కష్టపడి పని చేసాం. ఈనెల 19న రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు సినిమా చూసి ఆదరించి, మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం' అని అన్నారు.

'ఈ సినిమా మొత్తం మంచి ఫన్ ఉంటుంది. డైరెక్టర్ యశ్వంత్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. మ్యూజిక్ డైరెక్టర్ బాజీ ఇచ్చిన మ్యూజిక్ సినిమాకి హైలైట్. నిర్మాతలు చాలా బాగా సపోర్ట్ చేశారు. సినిమా ఎవరిని డిసప్పాయింట్ చేయదు' అని హీరో అభిషేక్ పచ్చిపాల చెప్పారు. దర్శకుడు యశ్వంత్ మాట్లాడుతూ,'నేను ఈ సినిమాకి కో డైరెక్టర్‌గా వచ్చాను. అనుకోని కారణాలవల్ల నిర్మాత తన్వీర్ నాకు దర్శకుడిగా అవకాశం ఇచ్చారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రస్తుతం వస్తున్న సినిమాలతో పోలిస్తే ఆద్యంతం వైవిధ్యంగా ఉండే సినిమా ఇది' అని తెలిపారు.

రాజకీయ నేపథ్యంలో కార్యకర్త



మోక్షజ్ఞ సమర్పణలో నక్షత్ర మీడియా అసోసియేషన్స్‌లో జీఎంఆర్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న పొలిటికల్ మూవీ 'కార్యకర్త'.

ఈ సినిమా టైటిల్ అనౌన్సమెంట్ పోస్టర్ లాంచ్ వేడుక మాదాపూర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు 'నాతో నేను' డైరక్టర్, జబర్దస్త్ శాంతి కుమార్ విచ్చేసారు. ఈ చిత్రంలో ఆదిత్య ఓం ముఖ్య పాత్రలో నటిస్తుండగా, శ్రీనివాస రెడ్డి టైటిల్ రోల్ చేస్తున్నారు.

శిరీష, విజయ, సుమన్ శెట్టి, శాంతికుమార్, షానీ, నారి సర్కార్, మధు తదితరులు ఇతర పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ పొలిటికల్ మూవీ సిరీస్‌కు జి.శ్రీనివాస్ కథను అందించగా, రాఘవ తిరువాయిపాటి స్క్రీన్‌ప్లే సమకూర్చటంతోపాటు దర్శకత్వం వహిస్తున్నారు.

హర్రర్ కామెడీతో యజ్ఞ



సుభాష్ రావ్ దేశ్ పాండే సమర్పణలో ప్రదీప్ రెడ్డి, శివ నాయుడు, గోవా జ్యోతి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'యజ్ఞ'. ఈ చిత్రంలో సుమన్ శెట్టి, జబర్దస్త్ అప్పారావు, చిట్టిబాబు, చెన్నకేశవనాయుడు, ఆవిష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రాన్ని ఆర్.ఆర్.మూవీ క్రియేషన్స్, రేణుక ఎల్లమ్మ ఫిలింస్ బ్యానర్స్ పై చిలుకోటి రఘురాం, చీలపల్లి విఠల్ గౌడ్ నిర్మిస్తున్నారు. హర్రర్ కామెడీ కథతో దర్శకుడు చిత్తజల్లు ప్రసాద్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. త్వరలో ఈ సినిమా పిఆర్‌కె ఫిలింస్ ద్వారా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.

దర్శకుడు చిత్తజల్లు ప్రసాద్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను కంప్లీట్ చేసేందుకు పెద్ద యజ్ఞమే చేశాం. మొదట సినిమా ప్రారంభించినప్పుడు ఉన్న ప్రొడ్యూసర్ షూటింగ్ టైమ్‌కు వెళ్లిపోయాడు. ఆ తర్వాత నేను బాధపడుతుంటే నా స్నేహితుడు రఘురాం, విఠల్, సుభాష్ రావు నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. క్యూబ్‌లు, యూఎఫ్‌లు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయి. సెన్సార్ వాళ్ల వల్ల కూడా ఇబ్బందులు వస్తున్నాయి. ఇవన్నీ దాటుకుని మూవీని రిలీజ్‌కు తీసుకురాబోతున్నాం. సినిమా హిట్ అయ్యి మా ప్రొడ్యూసర్స్‌కు డబ్బులు తీసుకురావాలి. హర్రర్ కామెడీ మూవీగా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది' అని తెలిపారు.

'మా సినిమాకు ప్రతాని రామకృష్ణ గౌడ్, లయన్ సాయి వెంకట్ సపోర్ట్‌గా ఉన్నారు. మా డైరెక్టర్ పట్టుదలగా మూవీని కంప్లీట్ చేశారు. నేను, రఘురాం నిర్మాతలమే అయినా మమ్మల్ని నడిపించేది సుభాష్ రావు. ఆయనకు కృతజ్ఞతలు. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు కావాల్సిన అంశాలన్ని ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయి. మా సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం' అని నిర్మాత విఠల్ గౌడ్ అన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తామని అన్నారు. ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఈ ఏడాది చెల్లించే విధంగా ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానన్నారు. రకరకాల పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు మారి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకు పోయాయని చెప్పారు. పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తమ ప్రభుత్వం త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను చదవాలన్న ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడం కోసం రాజీవ్‌ఆరోగ్యశ్రీని స్థాపించారని వివరించారు. ఇంజినీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా మారకూడదనీ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్‌ను నిర్మించేలా ఉండాలని సూచించారు. ఇందుకు కావాల్సిన సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత కాలేజీ యాజమాన్యాలపై ఉందని అన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాకుండా, దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజినీరింగ్ సంస్థలు ఉండాలని ఆకాంక్షించారు. ఇంజినీరింగ్‌లో కేవలం కంప్యూటర్ సైన్స్ కోర్సుపైనే కాకుండా, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలన్నారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలు, మానవ నిర్మిత అద్భుతాలన్నీ ఇంజినీర్లు ఆవిష్కరించినవేనని గుర్తు చేశారు. పక్క రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను అభివృద్ధి చేస్తామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2,400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలు మారుస్తోందన్నారు. ఫార్మా, ఐటీ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని నడిపించబోతుందని అన్నారు. యువత కోసం త్వరలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పరీక్షలు రాయని వారు దీక్షలు చేస్తున్నారు

నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరుద్యోగ యువత పదేండ్లు కొట్లాడిందనీ, ఇన్నేండ్లు వారిని నిర్లక్ష్యం చేసిన వారే ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయాలంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి ఉందన్నారు. కొన్ని రాజకీయ శక్తులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల కుట్రతో పరీక్షలకు సంబంధం లేని వారు దీక్షలు చేస్తున్నారని అన్నారు. దీక్షలు చేసే ఏ పరీక్షలకు హాజరవుతున్నారో వివరాలను కోరితే వారు దరఖాస్తు చేయలేదంటూ సమాచారం వచ్చిందన్నారు. డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షలను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని తేదీలను ప్రకటించామని గుర్తు చేశారు. సిలబస్, పరీక్షా విధానం మార్చకుండానే డీఎస్సీ తేదీలను ఖరారు చేశామని చెప్పారు. రెండేండ్లుగా డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నారనీ, మళ్లీ ఎందుకు వాయిదా వేయాలంటూ అభ్యర్థులను అడిగారు. రాతపరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరిగితే కోచింగ్ సెంటర్లకు, రాజకీయ నిరుద్యోగులకు నష్టం కలుగుతుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను ఎలాంటి సమస్య లేకుండా నిర్వహించామని చెప్పారు. నోటిఫికేషన్ ప్రకారమే 1:50 నిష్పత్తి చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేశామని అన్నారు. 1:100 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేస్తే కోర్టులు తప్పు పడతాయని చెప్పారు. దీన్ని నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ఆర్థిక భారం, ఇతర సమస్యలున్నా ఒక్కో సమస్యనూ పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా, జేఎన్టీయూ హైదరాబాద్ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జేఎన్టీయూ పర్యటన నేపథ్యంలో అరెస్టులు

- సీఐటీయూ, ఆశాల ముందస్తు అరెస్ట్
- బాలానగర్ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఆశాల నిరసన



నవతెలంగాణ-సిటీబ్యూరో/బాలానగర్

సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్‌టీయూ పర్యటన నేపథ్యంలో శనివారం సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆశాలు విధులకు వెళ్తుండగా వారు సీఎంను అడ్డుకుంటారేమోనన్న ఉద్దేశంతో పోలీసులు బాలానగర్‌లో అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టులను సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించాయి.

డ్రగ్స్ నిరోధానికి హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లు

- ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్స్‌ను నిరోధించడానికి ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు, ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులతో కలిపి కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ప్రత్యేక చర్యలను తీసుకోనున్నట్టు తెలిపారు. పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాల పరిధిలో మాదక ద్రవ్యాల విక్రయాలు జరగకుండా విద్యార్థులు వాటి బారిన పడకుండా ప్రహరీ క్లబ్‌లు నిఘా పెట్టాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు /హెడ్మాస్టర్/ప్రిన్సిపాల్ అధ్యక్షతన ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కమిటీలో సీనియర్ టీచర్ లేదా విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండే టీచర్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారనీ, సభ్యులు ఆరు నుంచి పదో తరగతి వరకు తరగతికి ఇద్దరు చొప్పున, తల్లిదండ్రుల సంఘం లేదా తల్లిదండ్రుల నుంచి ఒకరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒకరు ఉంటారని తెలిపారు. విద్యాసంస్థల్లోకి మత్తు పదార్థాలు చేరనీయకుండా విద్యార్థులు మాదక ద్రవ్యాల ఊబిలో చిక్కకుండా నుంచి అవసరమైన ప్రణాళికను ప్రహరీ క్లబ్‌లు రూపొందించాలని కోరారు.

సీపీఐ(ఎం) నాయకుని దారుణ హత్య

- త్రిపురలో బీజేపీ గూండాల ఘాతుకం
- నేడు బంద్

బెలోనియా : జిల్లా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న సీపీఐ(ఎం) నాయకుడిని బీజేపీ గూండాలు దారుణంగా హత్య చేశారు. దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్ 4వ స్థానానికి నామినేషన్ వేసేందుకు సీపీఐ(ఎం) నాయకుడు బాదల్ షిల్ వెళ్తుండగా, శుక్రవారం బెలోనియాలో బీజేపీ గూండాలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆయనను ఆసుపత్రిలో చేర్పించగా, శనివారం మరణించారు. ఇప్పటికీ నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదు. ఈ దారుణ ఘటనను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. బీజేపీగూండాల ఘాతుకాన్ని, నిందితులకు వత్తాసు పలుకుతూ ఇప్పటికీ అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకాన్ని నిరసిస్తూ ఆదివారం 12 గంటల బంద్‌కు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది.

క్రమశిక్షణ, నిజాయితీకి
మారుపేరు రామలింగయ్య

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



చింతకాని మండలం కొదుమూరులో రామలింగయ్య సంస్మరణ సభ

నవతెలంగాణ-బోనకల్ (చింతకాని)

పోరాటాల యోధుడు, క్రమశిక్షణకు, నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి జీవితాంతం పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు పోరాడిన వ్యక్తి మాదినేని రామలింగయ్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కొనియాడారు. ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని కొదుమూరులో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మాదినేని రామలింగయ్య సంస్మరణ సభ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది.

రామలింగయ్య చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభలో తమ్మినేని మాట్లాడుతూ.. రామలింగయ్య జీవితాంగం బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండి ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. కొదుమూరు గ్రామంలో పార్టీ కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిబద్ధతగా నిలబడిన మహానుభావుడు అన్నారు. అనేక బెదిరింపులు వచ్చినప్పటికీ, భయపడకుండా పార్టీ అభివృద్ధి కోసం నికరంగా నిలబడి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రామలింగయ్య తన ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చారని, కొదుమూరు సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లోనూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని చెప్పారు. రామలింగయ్య లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని యువతీ, యువకులు ప్రజాపోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రామలింగయ్య కుమారుడు మాదినేని రమేష్ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులుగా, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారన్నారు. రామలింగయ్య పెట్టుబడిదారీ సమాజంలో కూడా ఆదర్శవంత జీవితాన్ని గడిపారన్నారు.

విలువలకు ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి.. : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి, పోతినేని

మాదినేని రామలింగయ్య విలువలకు అత్యధిక ప్రాధాన్యతమిచ్చిన వ్యక్తి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. పేద ప్రజలకు రామలింగయ్య ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఎర్రజెండా మార్గాన్ని ఎంచుకొని ఆ మార్గంలోనే చనిపోయే వరకు ఉన్నారన్నారు. కార్పొరేట్ రాజకీయాలకు భిన్నంగా కమ్యూనిస్టు రాజకీయాలు చేసిన యోధుడు రామలింగయ్య అన్నారు. ఆయన మార్గంలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు.

సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సాగర్, రాష్ట్ర నాయకులు చంద్రారెడ్డి, జంగారెడ్డి, సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, మన్నేపల్లి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రామలింగయ్య కుమారుడు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సీపీఐ జిల్లా నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు వత్సవాయి జానకి రాములు, రాచబంటి రాము పాల్గొన్నారు.

కేయూ హాస్టల్‌లో పెచ్చులూడిన స్లాబ్

- అర్ధరాత్రి విద్యార్థినుల ఆందోళన
- మరో హాస్టల్‌కు తరలించాం: రిజిస్ట్రార్



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేగింది. పోతన మహిళా హాస్టల్లో స్లాబ్ పెచ్చులూడి విద్యార్థినుల బెడ్స్‌పై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో అర్ధరాత్రి విద్యార్థినులు రోడ్డెక్కి హాస్టల్ ఎదుట నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాస్టల్‌కు చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే, హాస్టల్‌లో నిత్యం సమస్యలతో ఇబ్బంది పడుతున్నామంటూ విద్యార్థినులు రిజిస్ట్రార్‌ను నిర్బంధించేందుకు యత్నించారు. శనివారం తెల్లవారే వరకూ విద్యార్థినుల నిరసన కొనసాగింది.



అధికారులు చర్యలు తీసుకోవాలి : విద్యార్థిని ఎం.పరిమళ

ఇటీవల ఫ్యాన్ ఊడిపడి విద్యార్థిని తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఇవాళ స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. పోతన హాస్టల్‌లో 250 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ బిల్డింగ్ కట్టి సుమారు 35 సంవత్సరాల అవుతోంది. శిథిలావస్థలో ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు అడిగినా రిజిస్ట్రార్ మల్లారెడ్డి నుంచి స్పందన లేదు. ఇప్పటికైనా ఇన్‌చార్జి విసి వాకాటి కరుణ, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇతర అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి.



సమ్మక్క-సారక్క హాస్టల్‌కు విద్యార్థినులు : మల్లారెడ్డి, కేయూ రిజిస్ట్రార్

పోతన హాస్టల్లో రాత్రి స్లాబ్ పెచ్చులూడి కింద పడటం ఆందోళనకరం. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం విద్యార్థినులను సమ్మక్క సారక్క హాస్టల్‌కు తరలించాం. 15 రోజుల కిందట జరిగిన ఫ్యాన్ ఘటనతోనే విద్యార్థినులను నూతనంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారలక్క హాస్టల్‌కు తరలించాలని నిర్ణయించి 250 బెడ్స్ తయారు చేసేందుకు ఆర్డర్ ఇచ్చాం.

ఆ బెడ్స్ రావడానికి ఇంకా ఐదు రోజుల సమయం పడుతుంది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకుంటాం.

గాజా సేఫ్ జోన్‌పై ఇజ్రాయిల్ దాడి

- 71మంది మృతి, 289మందికి గాయాలు
- హమాస్ మిలటరీ వింగ్ అధిపతే లక్ష్యం ?

గాజా : గాజా దక్షిణ ప్రాంతంలో శనివారం ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో 71మంది చనిపోగా, వందల సంఖ్యలో గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. హమాస్ మిలటరీ విభాగ అధిపతిని లక్ష్యంగా చేసుకునే ఈ దాడులు జరిగాయంటూ ఇజ్రాయిల్ అధికారి ఒకరు తెలిపారు. అక్టోబరు 7 నాటి దాడులకు ముఖ్య సూత్రధారిగా భావిస్తున్న మహ్మద్ డెయిఫ్ కోసమే ఈ గాలింపు చర్యలని ఆ అధికారి చెప్పారు. చాలా ఏండ్ల నుంచి ఇజ్రాయిల్ మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో డెయిఫ్ వున్నాడు. గతంలో ఇజ్రాయిల్ జరిపిన అనేక హత్యా యత్నాల నుంచి కూడా తప్పించుకున్నాడు. అలాగే మరో హమాస్ అధికారి రఫా సలామా కోసం కూడా దాడి చేసినట్లు చెప్పారు. అయితే తాజాగా జరిపిన దాడుల్లో లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరూ మరణించారా లేదా అన్న వివరాలు ఆ అధికారి వెల్లడించలేదు. కాగా, ఈ దాడుల్లో 289మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. చనిపోయిన వారిని, గాయపడిన వారిని సమీపంలోని నాసర్ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ఉత్తర రఫా నుంచి ఖాన్ యూనిస్ వరకు మానవతా జోన్‌గా ఇజ్రాయిల్ ప్రకటించిన ప్రాంతం ముఏసిలోనే ఈ దాడి జరిగిందని భావిస్తున్నారు.

'ఆసరా' దుర్వినియోగం

- నిబంధనలకు విరుద్ధంగా ఒక్కరికే రెండు పింఛన్‌లు
- ప్రభుత్వ ఉద్యోగులకు కూడా...
- దాసరి మల్లమ్మకూ డబుల్ పింఛన్
- అందుకే నోటీసులు : మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్‌పై ప్రభుత్వ వివరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైతు బంధు తరహాలోనే ఆసరా పింఛన్‌ల చెల్లింపులోనూ భారీ అవకతవకలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, జాతీయ రహదారులు, రోడ్లకు కూడా రైతుబంధు చెల్లించి దాదాపు రూ.25,672 కోట్లు దుర్వినియోగం చేసినట్టు ఇప్పటికే గుర్తించినట్టు పేర్కొన్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబీకులు రిటైర్మెంట్ పింఛన్‌లతో పాటు ఆపన్నులకు, అభాగ్యులకు, వృద్ధులకు అందించే ఆసరా పింఛన్‌లను అందుకుంటున్నారని తెలిపారు. డబుల్ పింఛన్‌లతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని ఇటీవలి సెర్ప్ తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,650 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ రిటైర్‌మెంట్ పెన్షన్‌తో పాటు ఆసరా పింఛన్‌లు అందుకున్నట్లు ఈ సర్వేలో వెల్లడైందని తెలిపారు. వీరిలో 3824 మంది ఇప్పటికే చనిపోయినట్టు అధికారులు గుర్తించారు. మిగతా 1826 మంది ఇప్పటికీ రెండూ అందుకుంటున్నట్టు తేలడంతో జూన్ నెల నుంచి వీరికి ఆసరా పింఛన్‌లను ప్రభుత్వం నిలుపుదల చేసిందని వివరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 427 మందికి అక్రమంగా రూ.2.50 కోట్లు డబుల్ పెన్షన్లు అందుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ప్రజాధనం పెద్దఎత్తున దుర్వినియోగమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు, స్టోన్ కట్టర్లు, చేనేత కార్మికులు, వికలాంగులు, డయాలసిస్, ఫైలేరియా, ఎయిడ్స్ రోగులకు ఆసరా పథకం వర్తిస్తుందనీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు ఉన్నవారు ఈ పింఛన్‌లు పొందేందుకు అర్హులని వివరించారు. గత ప్రభుత్వం 'ఆసరా' పేరుతో పింఛన్‌లు ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం వీటిని 'చేయూత' పింఛన్‌లుగా పేరు మార్చింది.

కేటీఆర్ ట్వీట్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాసరి మల్లమ్మ అనే 80 ఏండ్ల మహిళకు ఆసరా పింఛన్ కింద ఇచ్చిన డబ్బుల్ని తిరిగి చెల్లించాలని పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం నోటీసు ఇచ్చిందనీ, ఇది అమానవీయ చర్య అని ట్వీట్ చేశారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. మంత్రి దనసరి అనసూయ సీతక్క కూడా దీనిపై ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. దాసరి మల్లమ్మ పేరు డబుల్ పెన్షన్ల జాబితాలో ఉందని తెలిపారు. దాసరి మల్లమ్మ కూతురు దాసరి రాజేశ్వరి దంతుకూరులో ఏఎన్ఎంగా పనిచేస్తూ, 2010లో మరణించిందనీ, ఆమెకు పెండ్లి కాకపోవటంతో డిపెండెంట్‌గా ఉన్న తల్లి దాసరి మల్లమ్మకు ప్రతినెలా రూ.24,073 ఫ్యామిలీ పెన్షన్‌ను ప్రభుత్వం చెల్లిస్తున్నదని తెలిపారు. దానితో పాటు ఆపన్నులకు అందే ఆసరా పింఛన్‌లు కూడా ప్రతినెలా ఆమె తీసుకుంటున్నట్టు సర్వేలో తేలిందన్నారు. అందుకే జూన్ నెల నుంచి ఆమెకు ఇచ్చే ఆసరా పింఛన్‌ను అక్కడి జిల్లా అధికారులు నిలిపివేశారని వివరించారు.

జీవో నెంబర్ 10ని రద్దు చేయాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలి. హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలి. 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలి' అని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి, కోశాధికారి మంగ 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. తమ సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది 24 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అంగన్వాడీ జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చలు జరిపి హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంగన్వాడీ టీచర్లకు రూ. 2లక్షలు, హెల్పర్స్కు రూ.1 లక్ష ఆసరా పెన్షన్ చెల్లిస్తామనీ, 65 సంవత్సరాలలోపు రిటైరైన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు వీఆర్ఎస్ వర్తింప జేస్తామనీ, తెలంగాణ రాష్ట్ర రెండో పీఆర్సీలో ప్రభుత్వోద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్‌ను వర్తింపజేస్తామనీ, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో ఇస్తామనీ, సమ్మెకాలపు వేతనాలు చెల్లిస్తామనీ తదితర డిమాండ్ల పరిష్కారానికి సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో నాటి సమ్మెను విరమించినట్టు గుర్తు చేశారు. మంత్రులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐసీడీఎస్ మంత్రి, రాష్ట్ర అధికారులకు పలు సార్లు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. ఇప్పటివరకు మినీ వర్కర్లను మెయిన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది కానీ..ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. పైగా వారికి నష్టమొచ్చే విధానాలను అవలంభిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నది బీజేపీయే

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నది బీజేపీ పార్టీయేనని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గత పదేండ్లలో బీజేపీ అనేక ప్రభుత్వాలను కూల్చిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉత్తరాఖండ్ (2016), మణిపూర్ (2017), గోవా (2017), మేఘాలయ (2018), జమ్మూ అండ్ కాశ్మీర్ (2018), అరుణాచల్ ప్రదేశ్ (2019), కర్ణాటక (2019), మధ్యప్రదేశ్ (2020), పుదుచ్చేరి (2021), మహారాష్ట్ర (2022) ఇలా చెబుకుంటూ పోతే ఎన్నో ఉదంతాలున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీకి నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు రోజుల క్రితం మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి వర్గంలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేను తీసుకున్నారని గుర్తు చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు మధ్య పెద్ద తేడా లేదనీ, ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని చెప్పారు. అక్కడ మోడీ, ఇక్కడ కేసీఆర్ కవల పిల్లలా బాగా కలిసిపోయారని ఎత్తిచూపారు. పార్టీ ఫిరాయిం పులపై సుప్రీంకోర్టు కూడా బీజేపీ సర్కారుకు చీవాట్లు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌ల డీఎన్ఏ ఒక్కటేనని చెప్పారు.

ఆ వార్తల్లో నిజం లేదు

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. అవి అభూత కల్పన వార్తలని పేర్కొన్నారు. టీవీ ఛానెళ్లు కొన్ని బీఆర్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీ సేందుకు, బలహీనపర్చేందుకు అదే పనిగా నిరాధారమైన, వాస్తవ విరుద్ధమైన కథనాలను ప్రచారం చేయ డం తగదని హితవు పలికారు. తాను బీఆర్ఎస్ అధి.నేత కేసీఆర్ నాయకత్వంలోనే ఉంటానని రవిచంద్ర స్పష్టం చేశారు.

మానవ అక్రమ రవాణా దందా కీలక సూత్రధారి అరెస్ట్

- ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి
- హైదరాబాద్‌కు తీసుకొచ్చిన సీఎస్‌బీ అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రం నుంచి అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాల ఎర వేసి విదేశాలకు మానవ అక్రమ రవాణా చేస్తున్న ముఠాకు చెందిన కీలక సూత్రధారిని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఢిల్లీలో అరెస్ట్ చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అదనపు డీజీ షికా గోయెల్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగాల పేరిట యువతను ఆకర్షించి, విదేశాలకు అక్రమ రవాణా చేస్తున్న ముఠాకు చెందిన కీలక సూత్రధారి షాబాద్ ఆలంను ఢిల్లీ ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర సీఎస్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుడిని అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఎర

బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా కళ్యాణినగర్‌కు చెందిన షాబాద్ ఆలం..అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలతో సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. దుబాయిలో ఉంటూ తరచుగా హైదరాబాద్‌కు వస్తూ ఇక్కడి యువతకు ఆకర్షణీయమైన ఉద్యోగాలను ఇప్పిస్తానంటూ షాబాద్ ఆలం వారిని కాంబోడియా దేశానికి తరలించేవాడు. అందుకోసం, ఒక్కొక్క నిరుద్యోగి నుంచి పాస్‌పోర్ట్, వీసాల కోసమంటూ లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేసేవాడు. ఈ విధంగా కాంబోడియాకు తరలించబడిన నిరుద్యోగులను.. అక్కడి నుంచి సైబర్ నేరాలను ఆపరేట్ చేసే చైనాకు చెందిన అంతర్జాతీయ ముఠాకు అప్పగించేవాడు.

చెర నుంచి తప్పించుకున్న సిరిసిల్లవాసి.. పోలీసులకు ఫిర్యాదు

చైనా ముఠా వీరిని ఒక రహస్య ప్రదేశంలో చీకటి గదిలో బంధించి, వారిని హింసించి తమ అదుపాజ్ఞలోకి తెచ్చుకునేది. తర్వాత వారికి ఆన్‌లైన్ నేరాలకు ఏ విధంగా పాల్పడాలో శిక్షణనిచ్చి, వారి ద్వారా మోసాలకు చైనా ముఠా తెర లేపేది. ఆ విధంగా మోసానికి గురై వారి చెర నుంచి సిరిసిల్లవాసి తప్పించుకొని భారత్‌కు వచ్చాడు. అంతకముందు, నెల క్రితం ఇక్కడి పోలీసులకు తన తల్లి ద్వారా ఫిర్యాదు చేయించాడు. తనను మోసపూరితంగా విదేశాలలో ఉద్యోగాలిప్పిస్తామంటూ సిరిసిల్లకు చెందిన సాయిప్రతాప్, పూణేకు చెందిన మహ్మద్ అన్సారీలు తనను కాంబోడియాకు అక్రమంగా తరలించారనీ, అక్కడ తనను చైనా ముఠాకు అప్పగించి సైబర్ నేరాలకు పాల్పడేలా చిత్రహింసలకు గురి చేశారని బాధితుడు పోలీసులు వివరించాడు. తనతో పాటు రాష్ట్రానికి చెందిన దాదాపు వెయ్యి మంది నిరుద్యోగ యువకులను కాంబోడియాకు తరలించారని చెప్పాడు.

రంగంలోకి దిగి నేరస్థులను పట్టుకున్న సీఎస్‌బీ అధికారులు

ఈ మేరకు ఈ కేసు దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన సైబర్ సెక్యూరిటీ అధికారులు సాయి ప్రతాప్‌తో పాటు మహ్మద్ అన్సారీలను ఆ సమయంలో అరెస్ట్ చేశారు. వారిని విచారించగా.. ఈ మోసాలకు కీలక సూత్రధారి షాబాద్ అలీ అనీ, దుబాయ్ కేంద్రంగా పని చేస్తూ ఈ మోసాలకు మార్గదర్శకత్వం నెరిపేవాడని పట్టుబడ్డ నేరస్థులు బయటపెట్టారు. షాబాద్ అలీకి కాంబోడియాతో పాటు సింగపూర్, బ్యాంకాక్‌లలో పని చేసే చైనాకు చెందిన అంతర్జాతీయ సైబర్ నేర ముఠాలతో సంబంధాలున్నాయని కూడా వారు తెలిపారు. ఈ సమాచారంతో షాబాద్ అలీ కోసం సీఎస్‌బీ అధికారులు వేటను మొదలుపెట్టారు. ఈ మేరకు అందిన సమాచారంతో ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కాపుకాసి షాబాద్ అలీని అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి నిందితుడిని హైదరాబాద్ తీసుకొచ్చి, సీఐడీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

"ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడుతున్న సంస్థలు, వ్యక్తుల బారిన పడొద్దు. విదేశాల్లో ఉద్యోగాలను కల్పిస్తామని తెలిపే సంస్థల పూర్వాపరాలను తెలుసుకోవటానికి అవసరమైతే పోలీసుల సహాయాన్ని తీసుకోవాలి."

- యువతకు సీఎస్‌బీ అదనపు డీజీ షికా గోయెల్ విజ్ఞప్తి

త్వరలోనే వృద్ధుల పింఛన్ల పై ప్రభుత్వ నిర్ణయం



● హర్ష వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ వచ్చే నెల నుంచి ఇస్తామని మంత్రి సీతక్క ప్రకటన చేయడం హర్ష దగ్గర విషయమని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు విడో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి వచ్చే నెల నుంచి పెంచడం గొప్ప గర్వకారణం అని అన్నారు. బోనాల పండుగ చెక్కులు కూడా గత ప్రభుత్వం పని అయిన తర్వాత ఇస్తుంటే సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా ఇచ్చిందని అన్నారు.

ఆరు టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు..

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్ నగర్‌లో నిల్వ ఉంచిన ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని, టాస్క్ ఫోర్స్ పోలీసులు విశ్వసనీయ సమాచారముతో నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి. ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి మధుర నగర్ పోలీస్ స్టేషన్ తరలించి పోలీసులకు అప్పచెప్పారు. మధుర నగర పోలీసులు ఆరు టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్ప చెప్పడం జరిగింది. నిందితులు సయ్యద్ షానవాజ్ (35)బియ్యం వ్యాపారి, అబ్దుల్ రషీద్ (33) మెకానిక్ ,మహమ్మద్ యాసిన్ పెయింటర్, సయ్యద్ సరఫరాజ్ ఆటో డ్రైవర్, నలుగురు నిందితులు జవహర్ నగర్ లో ఉంటూ బస్తీలలో తిరుగుతూ ఇంటింటికి తిరిగి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నట్టు పోలీసుల విచారణలో తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి



● మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సమాజంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులకు ముఖ్య కారణం మానసికంగా ఆరోగ్యంగా లేకపోవడమేనని, సమాజంలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీపీఏ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం అత్యంత కీలకమైందని, ఆ దిశగా పని చేస్తున్న సైకాలజిస్టుల సేవలు అభినందనీయమన్నారు. సైకాలజిస్టులకు భద్రత, భరోసా కల్పించుటకు 'సైకాలజిస్టుల కౌన్సిల్' ఎంతో అవసరమన్నారు. అనంతరం మాజీ జాతీయ మహిళా కమిషన్ సలహాదారులు డా.త్రిపురాణ వెంకటరత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సైకాలజిస్టుల సేవలు గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. సమాజంలోని రుగ్మతలు రూపుమాపడానికి కౌన్సిలింగ్ ఒక పదునైన ఆయుధంగా ఉపయోగపడుతుందని, మహిళల భవిష్యత్తుకు మంచి భరోసా ఇవ్వడానికి ప్రస్తుత సమాజంలో కౌన్సిలింగ్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందన్నారు.వేధింపులకు గురైన మహిళాలకు ధైర్యాన్ని ఇచ్చి వారిలో మనోధైర్యాన్ని, జీవితం పట్ల విశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత సైకాలజి స్టులపై ఉందని ఆమె పేర్కొన్నారు. సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ గత ఏడు సంవత్సరాలుగా సమాజంలోని మానసిక రుగ్మతల నిర్మూలనకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు.ఈ టీపీఏ అవార్డులు తమ సంఘానికి చెందిన 15 మంది మహిళా సైకాలజి స్టులకు "తెలంగాణ ఇన్స్పైరింగ్ ఉమెన్ సైకాలజిస్ట్ అవార్డు, 10 మంది సైకాలజిస్టులకు "తెలంగాణ ఇన్స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డులను అందజే యడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు కె.వి.ప్రదీప్, సైకియాట్రిస్ట్ డా.హరిణి, డా.శేఖర్ రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంపటి రాజు, శ్రీపుజా, సుధాకర్, శ్రీదేవి, కృష్ణ సాహితీ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఐఫోన్ యూజర్సే టార్గెట్

● ఇండియా పోస్టు పేరుతో గాలం
● పార్శల్ వచ్చిందంటూ వ్యక్తిగత వివరాల సేకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా సైబర్ నేరస్తులు వారిపని వారు కానిస్తున్నారు. ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలపై దృష్టి సారిస్తున్నారు. ఇందుకుగానూ మార్కెట్లోకి ఏ అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా దాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రజలు ఏదైనా సమాచారం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేద్దామన్నా చాలు సైబర్ నేరగాళ్లు ప్రత్యక్షమవుతున్నారు. నిజమైన ఆన్‌లైన్ సేవకులుగా, సర్వీస్ సెంటర్లు నుంచి, లేదా ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని బాధితులను సైబర్ నేరస్తులు నమ్మిస్తున్నారు. వారి నమ్మకంతోనే బాధితులకు తెలియకుండానే వారి వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నారు. తాజాగా ఇండియాపోస్టు నుంచి మాట్లాడుతున్నామని మోసాలకు పాల్పడుతున్నారు.

నకిలీ యాప్‌ల తయారీ

కష్టపడకుండానే సులువుగా డబ్బులు సంపాదించాలని ఆలోచిస్తున్న సైబర్ నేరస్తులు కూర్చున్న చోటే లక్షలు కొల్లగొడుతున్నారు. అందుకు నకిలీ వెబ్‌సైట్లు, లింక్స్, యాప్‌లను సైతం తయారు చేస్తున్నారు. ఐటీ నిపుణులు, ఉన్నతాధికారులు సైతం గుర్తుపట్టలేని విధంగా ప్రముఖ బ్యాంకులు, సంస్థలు, ఈ కామర్స్ సైట్లకు చెందిన పేర్లను ఉపయోగిస్తున్నారు. పెద్దఎత్తున సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థల, బ్యాంకుల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. రివార్డులు, ఆఫర్ల కూపన్లు, పార్శిల్ పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేసిన వ్యక్తి ఫోన్‌ను క్షణాలల్లో హ్యాక్ చేయడంతోపాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు. ఖాతాలోని డబ్బులను కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతూ లక్షలు వసూళ్లు చేస్తున్నారు. ఈ సైబర్ నేరస్తుల భారిన ఉన్నత ఉద్యోగులు, కంపెనీ సీఈఓలు, ఆర్థిక నిపుణులు, బ్యాంక్ అధికారులు, ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం చిక్కుతుండడం గమనార్హం.

మీ వివరాలు అప్‌డేట్ చేయండీ..

తాజాగా సైబర్ నేరస్తులు ఐఫోన్ యూజర్స్‌ను టార్గెట్ చేస్తున్నారు. సార్... ఇండియా పోస్టులో మీకో విలువైన పార్శిల్ వచ్చిందని ఫోన్లు చేస్తున్నారు. మీ అడ్రస్‌కు ఆ పార్శిల్‌ను పంపిచాం, మా వారు రెండుమూడు సార్లు అక్కడి వచ్చినా కానీ ఆ అడ్రస్ లభించడం లేదని నమ్మిస్తున్నారు. వెంటనే మీ అడ్రస్ (చిరునామాను)ను అప్‌డేట్ చేస్తే మీ పార్శల్‌ను తిరిగి 24గంటల్లో మీకు పంపిస్తామంటూ నమ్మిస్తూ ఓ లింక్స్‌ను పంపిస్తున్నారు. మీ అడ్రస్స్ అప్‌డేట్ చేయకుంటే వచ్చిన పార్శల్‌ను 48గంటల్లో వెనక్కు పంపిస్తామని ఆందోళనకు గురిచేస్తున్నారు. సైబర్ నేరస్తుల మాటలను నమ్మి ఎవరైనా ఆ లింక్‌లను క్లిక్ చేస్తే చాలు పంపించిన వారి వ్యక్తిగత వివరాలను తస్కరిస్తున్న సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారు.

ఏ లింక్‌లనూ క్లిక్ చేయొద్దు..

సైబర్ నేరస్తులు తాజాగా ఇండియా పోస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్ శనివారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. ముఖ్యంగా గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మేయిల్స్‌కు పంపించే సమాచారాన్నిగానీ లింక్‌లనుగానీ క్లిక్ చేయొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే వీడియోకాల్స్‌కు, లింక్స్‌కు, చాటింగ్‌లకు స్పందచకూడదన్నారు. మోసపోయిన వారు వెంటనే పోలీసులకుగానీ, 1930 ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాంబాబు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్ రాంబాబు అన్నారు. శనివారం సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు 18 సంవత్సరాలు పైబడిన వారందరూ లైసెన్సు పొందిన తర్వాత మాత్రమే వాహనాలు నడపాలని లేనిచో వాహన యజమాని కూడా శిక్ష తప్పదు అని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్, అపోజిట్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేసి వాహనాలు రోడ్డుపైకి వస్తే చలాన్‌తో పాటు శిక్షలు ఉంటాయన్నారు. జీబ్రా క్రాసింగ్ లైన్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాదాచారులు పాటించాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా నో పార్కింగ్ ఏరియాలో బండ్లు పార్కింగ్ చేస్తే చలాన్‌లు విధిస్తామన్నారు. విద్యార్థులు స్కూల్ బస్సుల్లో ప్రయాణించేటప్పు డు చేతులు, తల కిటికీ అద్దాల బయట పెట్టవద్దని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఎవరైనా ఫుట్ పాత్ ఆక్రమించి, వ్యాపారాలు నిర్వహిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు.

'మాజీ మంత్రి అండదండలు చూసుకుని అక్రమాలు'



● గచ్చిబౌలి ఎన్జీవోస్ ఇండ్ల స్థలాల సాధన సమితి అధ్యక్షులు పాండురంగరావు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భాగ్యనగర్ ఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ నాయకులు మాజీ మంత్రి అండదండలు చూసుకుని అక్రమాలకు పాల్పడ్డారని గచ్చిబౌలి ఎన్జీవోస్ ఇండ్ల స్థలాల సాధన సమితి అధ్యక్షులు పాండురంగరావు ఆరోపించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008లో గత ప్రభుత్వం ఏపీఎన్జీఓ (గచ్చిబౌలి) మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ప్రస్తుతం టీటీ ఎన్జీవో గచ్చిబౌలి మ్యూచువల్లి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీగా పేరు మార్చారని, దీనికి 189.11 ఎకరాల భూమిని శేరిలింగంపల్లిలోని గోపనపల్లి సర్వే నెంబర్ 36, 37లలో కేటాయించారని తెలిపారు. అట్టి భూమిని ప్లాట్‌ల కింద డెవలప్ చేసి సీనియార్టీ ప్రకారం కేటాయించాల్సి ఉండగా అక్రమాలకు తెరలేపి అనర్హులై న కొందరికి దొడ్డిదారిలో మెంబర్‌షిప్ ఇచ్చి లాటరీ ద్వారా జూనియర్లకు కేటాయించడం జరిగిందన్నారు. దీన్ని వ్యతిరేకించిన కొందరు సీనియర్లు సొసైటీ అక్రమాలపై ప్రశ్నిస్తే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం, మెంబర్ షిప్ నుంచి తొలగించడం చేస్తున్నారని ఆరోపించారు. సొసైటీ డబ్బులతో సత్యానారాయణ గౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాసులు అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు.వీటిపై ప్రభుత్వం విచారణ జరిపించి అర్హులైన సభ్యులకు ప్లాట్లు కేటాయించాలని దాని కోసం ఐఏఎస్ ల ఆధ్వర్యంలో ఒక కమిటీ నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.త్వరలోనే సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కలిసి భాగ్యనగర్ ఎన్జీవో గచ్చిబౌలిలో జరిగిన అక్రమాలపై వివరిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నర్సింగరావు, వైస్-ప్రెసిడెంట్ ప్రసాద్ రావు, జాయింట్ సెక్రటరీ ధన్ రాజ్, ట్రెజరర్ రాజేశ్వరి, ఎక్సక్యూటివ్ మెంబర్స్ అనిల్ కుమార్, హేమలత రెడ్డి, వెంకటేశ్వర రావు, చంద్రకళ, పద్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ లోన్, క్లౌడ్ టెక్నికో యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి..

● బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

అమాయక ప్రజలను మోసం చేస్తూ కోట్లాధి రూపాయలు దండుకున్న స్పాట్ లోన్, క్లౌడ్ టెక్నికో యాజమానులను వెంటనే అరెస్టు చేయాలని బహుజన సాహిత్య అకాడామీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాన్య బాధితుల సేవా సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్పాట్ లోన్, క్లౌడ్ టెక్నికో సంస్థలకు చెందిన ఎండి కాకమాన రవికుమార్‌తో పాటు జూమ్ మీటింగ్‌లు పెట్టి ప్రజలను మభ్యపెట్టిన ప్రశాంత్, పావని, హరికృష్ణ, ప్రసాద్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 1600 కడితే పది వేల రూపాయల నుంచి లక్షలాది రూపాయల కమీషన్లు వస్తాయని మోసపూరిత మాటలు చెప్పి ప్రజల నుంచి డబ్బులను దోచుకున్నారని విమర్శించారు. ఈస్కీమ్‌లో సుమారు 10 లక్షల మంది అమాయక ప్రజలు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సామాన్య బాధితుల సేవా సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ నరేష్ మాట్లాడుతూ బ్యాంక్ తరహాలో నిర్వహిస్తామని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డ ఈ కంపెనీ ప్రతినిధులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఆన్‌లైన్ ద్వారా సేకరించిన డబ్బును సీజ్ చేసి పేద ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగకపోతే బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిచారు. ఈ కార్యక్రమంలో సామాన్య బాధితుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూరపాటి నాగేశ్వరరావు, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సాయినోజి మనోహర, మిర్యాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దౌర్జన్యాల నుంచి రక్షణ కల్పించండి

● కృష్ణానగర్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



నవతెలంగాణ-ముషీరాబాద్

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, వారి కుటుంబ సభ్యుల అరాచకాలు దౌర్జన్యాల నుంచి తమకు రక్షణ కల్పించాలని కృష్ణా నగర్ ఫ్లాట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్, వారి కుటుంబ సభ్యులు మేడ్చల్ మల్కాజిగిరి వంపుగూడ గ్రామం కాప్రా మండలంలో సర్వే నెంబర్ ఎల్ 639/1, 643/1, 644/1, 647/1, 648 అండ్ 654 ఏసీ 61-39 జీఎస్‌టీఎస్ 19715 పంచాయతీ పరిమిషన్ ద్వారా చేసిన 706 ప్లాట్లు పట్టాదారుల వద్ద నుంచి ఎమ్మెల్యే కొనుక్కొని తమ ప్లాట్లకు నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తమ ప్రహరీలను కూడా కూల్చివేశారని తమ స్థలంలో 100 మంది గుండాలను మొహరించి ఆయా ప్రాంతాలకు రానివ్వకుండ ా బెదిరిస్తున్నారని తెలిపారు. తమ తోటి ప్లాట్ ఓనర్స్ దాదాపు 150 మందిని బెదిరించి అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారని తెలిపారు. ప్రస్తుతము 556 మంది ఓనర్స్ తనకు అమ్మడం లేదని కక్షతో 2014 నుండి అనేక వక్రమార్గాల్లో బెదిరింపులకు పాల్పడడం పోలీసుల చేత బెదిరింపజేయడం వంటి చేస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలానికి సంబంధించిన ఎలాంటి కేసులు కోర్టుల్లో లేవన్నారు. 556 మంది ఓనర్స్ వద్ద జీహెచ్ఎంసి అనుమతి తో పాటు ఎల్ఆర్ఎస్ కూడా ఉందని ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని సొసైటీ సభ్యుడు కోటిరెడ్డి విన్నవించారు. ఈ ధర్నాలో వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ జిబి రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కృష్ణమాచారి, కోశాధికారి జయప్రకాశ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



● బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-ధూల్ పేట్

మూసీ సుదరికరణతో నివాసాలు కోల్పోతున్న స్థానికులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని 6 డివిజన్ కార్యకర్తలతో కలిసి ఆయన చుడి బజార్, జుమ్మేరత్ బజార్ తదితర మూసి పరివాహిక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న మూసీ సుదరికరణతో పాటు పలు ప్రాజెక్టులను చెపట్టడం జరుగుతుందన్నారు. దీని పర్యావసనంగా దాదాపు 2వేల గహాలు అస్తిత్వం కోల్పోవడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గ్రహించి అక్కడి ప్రజలతో కలిసి ఇండ్లు కోల్పోయే వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతానన్నారు. పరివాహిక ప్రాంతాలైన చెంద్రకిరణ్ బస్తీ, అంబేద్కర్ నగర్ బస్తీ, ఉపాలమ్మ బస్తీ, జుమ్మేరాత్ బజార్ పరిసర ప్రాంతాలలో స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలను మభ్యపెట్టి ఇప్పుడు ప్రజలు ఆపదలో వున్నపుడు బీజేపీ అభ్యర్థి మాధవిలత కనిపించకుండా పోయిందన్నారు. బొమ్మతో ఉన్న పోస్టర్ కూడా కనబడుటం లేదన్నారు. పార్టీ మంగళ్ హాట్ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, లోకేష్, సతీష్, సురేష్, రాజు, నియోజకవర్గం సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్‌ల సీనియర్ నాయకులు, మహిళా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల రాష్ట్రస్థాయి అధ్యక్షుడిగా మాలోతు సందీప్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాలోతు సందీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కోఠి సుల్తాన్ బజార్ లోని శ్రీకష్ణదేవరాయ భాష నిలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యాచరణపై ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించిన గడ్డం శేషాద్రి అనారోగ్య కారణాల వల్ల పదవి నుండి తప్పుకోవడంతో ఆ పదవిని భర్తీని చేస్తూ మాలోతు సందీప్‌ను రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నట్టు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. అతి త్వరలో రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసుకొని ఆపరేటర్ల పూర్తి భవిష్యత్ కార్యాచరణ పై విధివిధానాలు రూపొందించి వాటిని సాధించే దిశగా ముందుకు సాగుదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ల రాష్ట్ర అధ్యక్షులు నరహరి, జోగులాంబ గద్వాల డీపీఎం రమేష్, జేఏసీ మెంబర్ జువ్వాడి సంధ్య, సంతోష్, ఒమ సురేష్ గుప్త, సతీష్, ప్రవీణ్ కుమార్, కొండారెడ్డి, రామ శేషు లతోపాటు తదితర జిల్లాల అధ్యక్షులు ఆపరేటర్లు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ప్రకటించాలి



● రాష్ట్ర హమాలీ ప్రధాన కార్యదర్శి వి.రాములు

నవతెలంగాణ-ధూల్ పేట్

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని హమాలీ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ ట్రాన్స్ పోర్ట్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) బేగం బజార్ డివిజన్, మహారాజ్ గంజ్, కిషన్ గంజ్, పీల్ ఖాన హమాలీ కార్మికుల విస్తత స్థాయి సమావేశం కిషన్ గంజ్ యూనియన్ కార్యాలయంలో నాయకులు పి. మోహన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ట్రాన్స్ పోర్ట్ హమాలి కార్మికులు ఈ ప్రాంతంలో వందలాది మంది రాత్రిళ్లు నిద్రాహారాలు మాని కాయకష్టం చేస్తు జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. వారికి పని చేసే ప్రాంతాలలో కనీస సరైన సౌకర్యాలు, వసతులు కల్పించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయని మండిపడ్డారు. విరికనుగుణంగా ఇక్కడి యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ట్రాన్స్‌పోర్టులు, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు కూలీ రేట్ల చెల్లింపుల్లో సహితం తేడాలున్నాయన్నారు. అన్ని ట్రాన్స్‌పోర్ట్ హమాలి కార్మికులకు ఒకే కూలీ రేట్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతు న్నారన్నారు. కార్మిక పట్ల ప్రభుత్వాల జాప్యం వీడి వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. హమాలీ కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 55 ఏండ్లు నిండిన వారికి నెలకు రూ. 5 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని, పని ప్రదేశాల్లో కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అద్వర్యంలో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆ పోరాటాల్లో కార్మికులు పాల్గొని మన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

- నూతన కమిటీ..

అనంతరం కిషన్ గంజ్, మహబూబ్ గంజ్ ట్రాన్స్ పోర్ట్ హమాలి కార్మికుల నూతన కమిటీని 19 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. అద్యక్ష , కార్యద ర్శులుగా పి. మోహన్ , జి. వెంకటేష్ , గౌరవ అధ్యక్షులుగా పి. చెన్నయ్య , కోశాధికారి నర్సింహ్మా , ఉపాధ్యక్షులు గా కె. గోవర్ధన్ రెడ్డి, బి. ఆసిరెడ్డి, డి. ఆంజనేయులు, టి.సావప్ప, సి.హన్మంతు, సహాయ కార్యదర్శులు గా భీమయ్య, యం.రమేష్, బుగ్గప్ప, అనిల్ యాదవ్, అనిల్, కమిటీ సభ్యులుగా వెంకటేష్, అషు శివప్ప, బాలయ్య, తిమ్మప్ప లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్, గోషామహల్ జోన్ కన్వీనర్. కె.జంగయ్య, ముక్తార్ గంజ్, మహరాజ్ గంజ్, దాల్ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు, పి.చెన్నయ్య, ఆర్.సాయిలు, కోశాధికారి జి.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు పి.కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ సీపీ సుధీర్ బాబును కలిసిన నాయకులు



నవతెలంగాణ-కాప్రా

రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్ బాబును సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీ మణిపాల్ రెడ్డిలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని సీపీ వారిని కోరారు.

ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-ఉప్పల్

ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి అన్నారు. శనివారం ఉప్పల్ రింగ్ రోడ్డులో మదక ద్రవ్యాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉన్న కుటుంబాలు క్షేమంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్య నాయక్, ఎస్సై మహిపాల్ రెడ్డి, ఉదయ్ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

శ్రీభావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ పద్మశాలి టౌన్‌షిప్ సభ్యులు తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుధ్యం, స్ట్రీట్ లైట్, సెంట్రల్ లైటింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీ సంక్షేమానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, టౌన్షిప్ ప్రెసిడెంట్ ఎం. నరేంద్రరెడ్డి, నవీన్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాము, జనరల్ సెక్రటరీ నామాల సుగుణేశ్వర్, ట్రెజరర్ సదానందం గౌడ్, మాదిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.లత నర్సింహ, శివారెడ్డి కుమార స్వామి, పరమేశ్, అఖిల్, శ్రావణ్, రవి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-కాప్రా

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అన్నారు. శనివారం మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్‌లోని మదర్ థెరిస్సా పాఠశాల విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ లాంటి విష జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మున్సిపల్ సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త వ్యర్థాలను చెత్తను సేకరించే ఆటోలకు అందజేయాలని, ఆటో అందుబాటులో లేకుంటే చెత్త కుండీలలో మాత్రమే వేయాలన్నారు. అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎలాంటి జబ్బులకు గురికాకుండా ఉంటారని పేర్కొన్నారు. వాడేసిన కొబ్బరి బోండాలు, వాహనాల చక్రాలు, ప్లాస్టిక్ డబ్బాల్లో దోమలకు ఆవాసం చేసుకుంటాయని తెలిపారు. నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ లాంటి అనారోగ్య సమస్యలు వస్తే దగ్గరలోని బస్తీ దవాఖాన సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



- ప్రజా ప్రభుత్వంలో విద్యార్థుల సమస్యలు పట్టించుకోరా?
- సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు న్యాయం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థులకు పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ముఖ్య నాయకుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు చిన్న అధ్యక్షతన ఘట్కేసర్ మండల కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్లపైచిలుకు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వానికి విద్యార్థుల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. స్కాలరషిప్ పేరుతో విద్యార్థుల కోర్సులు పూర్తయినా వారికి కళాశాల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతోపై చదువులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజుల విషయంపై కళాశాలల యాజమాన్యాలను సంప్రదిస్తే అనేక ఇబ్బందులతో వడ్డీలు, అప్పులు తెచ్చి సిబ్బందికి వేతనాలు ఇస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, ఘట్కేసర్ మండలాధ్యక్షుడు అజయ్, కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, సహాయ కార్యదర్శి సిద్దార్థ్, కోశాధికారి శ్రీరామ్, శ్రీకాంత్, ఆకాష్, వెంకట్ , రాము తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్ల మాఫియాను కట్టడి చేయాలి



- ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్

నవతెలంగాణ-కాప్రా

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రయివేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని, నిరుద్యోగులు స్టడీ సర్కిల్స్‌ను వినియోగించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ అన్నారు. ఏఐవైఎఫ్ ఉప్పల్ మండల సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయివేట్ కోచింగ్ సెంటర్ల ఆగడాలు అధికమయ్యాయని పేర్కొన్నారు. ఒక్కో సెంటర్‌లో ఒకే గదిలో లెక్కకు మించి నిరుద్యోగులకు కోచింగ్ ఇస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్ల చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్లు వారికి మెరుగైన సేవలు అందించడంలో విఫలం అవుతున్నారని ధ్వజమెత్తారు. నేడు కొన్ని పోటీ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు కోరుతున్నారని, మెజారిటీ అభ్యర్థుల నిర్ణయంతో ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కొన్ని కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు నిరుద్యోగులను పావులుగా వాడుకుని వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేయడానికి ప్రయత్నిన్నాయని తెలిపారు. అలాంటి వారి పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ప్రభుత్వ స్టడీ సర్కిల్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ స్టడీ సర్కిల్స్‌లో ఉచితంగా మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నారన్నాని తెలిపారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏ ఐవైఎఫ్ నేతలు గిరిబాబు, చంద్రశేఖర్, రవి కుమార్, స్వప్న, సంధ్య రాణి, కిరణ్, ప్రణవ్, సూర్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



- తేలికపాటి వర్షానికే జవహర్ నగర్ వీధులన్నీ జలమయం
- వరద నీటితో కాలనీ వాసుల ఇక్కట్లు
- పరిష్కారం చూపాలని ప్రజల విన్నపం

నవతెలంగాణ-జవహర్ నగర్

ఇటీవల కురుస్తున్న తేలికపాటి వర్షాలకు జవహర్ నగర్ వీధులన్నీ నదులను తలపిస్తున్నాయని జవహర్ నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి ఊసే ఎరగని కాలనీలు చాలా ఉన్నాయి. గత కొన్నేండ్లుగా వర్షాకాలం వస్తే చాలు రోడ్ల నిండా నీళ్ల చేరి నదులను తలపిస్తున్నాయని, బురదమయంగా మారిన రోడ్లతో రాత్రినక, పగలనక పనులకు వెళ్లొచ్చే ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇండ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి న్యూ అంబేద్కర్ నగర్, లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ, బీజేఆర్ నగర్, సంతోష్ నగర్, వైఎస్సార్ నగర్, మల్లికార్జున నగర్ కాలనీలలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లే వారు బురదతో చాలా సమస్యలు ఎదుర్కొంటు న్నారు. కనీసం వర్షాకాలంలో నైనా లోతట్టు ప్రాంతాలలో కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయాలనీ, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





పాఠశాల స్థాయిలోనే నాయకత్వ లక్షణాలను పెంచాలి



- ఏజీఎం పురుషోత్తమ రెడ్డి
- ఈసీఐఎల్ నారాయణ పాఠశాల విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ

నవతెలంగాణ-కాప్రా

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని నారాయణ పాఠశాల ఈసీఐఎల్ బ్రాంచ్ ఏజీఎం పురుషోత్తమ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఈసీఐఎల్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం మంజు భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు నాయకత్వ లక్షణలను పాఠశాల స్థాయిలో అందించడమే నారాయణ విద్యాసంస్థ కార్తవ్యంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికలలో పోటీ చేసిన విద్యార్థులు ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ ఓటేయాలని కోరారు. సీనియర్ హెడ్ బాయ్ హెత్ర, డిప్యూటీ హెన్‌హెచ్ బాయ్, హెడ్ గర్ల్స్ అభ్యర్థులుగా పోటీ చేశారు. అనంతరం హెచ్ఎం మంజు భార్గవి మాట్లాడుతూ.. విద్యార్థులలో నాయకత్య లక్షణాల గురించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను ఆదుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

విధి నిర్వహణలో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తూ ప్రమాదవశాత్తు బావిలో పడి గాయాలపాలైన ముగ్గురు పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఆదుకోవాలని, వైద్య ఖర్చులు భరించి ఆర్థిక సాయం అందజేయాలని సీఐటీ యూ మండల కార్యదర్శి ఎన్. సబిత, మండల నాయకులు పి. దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాచావోని సింగారం గ్రామంలో బావిలో పడి గాయాలపాలైన కార్మికులను పరామర్శించారు. అనంతరం సబిత మాట్లాడుతూ.. కరెంటు మోటారు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ముత్తుపల్లిగూడ బావిలో పడడంతో బలమైన గాయాలు అయ్యాయని తెలిపారు. గ్యార మల్లేష్, సుంచు శ్రీకాంత్, ఆరే సత్యనారాయణలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. 8నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కనీస వేతనం, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా, క్షతగాత్రులకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచా యతీ యూనియన్ మండల ఉపాధ్యక్షురాలు సుంచు ముత్తమ్మ, సీఐటీయూ మండల కమిటీ సభ్యుడు దాసు ఉన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- కార్పొరేటర్ బండారు శ్రీవాణి

నవతెలంగాణ-ఉప్పల్

రోడ్డు పనులలో కాంట్రాక్టర్స్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. శనివారం రామంతాపూర్ పరిధిలోని భరత్ నగర్‌లో రూ.75 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రామంతాపూర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. ఆమె వెంట ఏఈ శ్వేతాశ్రీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, శాగ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ నాలా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- మట్టితో నాలాను పూడుస్తున్న వైనం
- చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- గువ్వ రవి ముదిరాజ్





నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని సుతారి గూడెం చెరువు నాలాను కబ్జా చేస్తున వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్ అధికారులను కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుతార్ గూడెం చెరువు నిండి అలుగు ప్రవహించే నాలాను కబ్జా చేస్తున్న పటేల్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. యథేచ్ఛగా పట్టపగలే నాలా కబ్జాకు గురవుతు న్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. టిప్పర్ లారీలు, జేసీబీలను ఏర్పాటు చేసి 100 ట్రిప్పుల మట్టిని పోసి నాలాను పూడ్చుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుతారిగూడెం చెరువు శిఖంను కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో శనివారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు, గడ్డలు, కణతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుం నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలను చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 110 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి వైద్య చికిత్స అవసరం ఉన్న మరో 42 మందిని ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వినయ్, మానస, అనూహ్య, నీతిష, అజయ్, మార్కెటింగ్ ఇన్‌చార్జిలు కుమారస్వామి, శేఖర్ బాబు, సంజయ్, సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు తోడ్పడాలి

- గువ్వ రవి ముదిరాజ్



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువకులకు ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరుతూ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌కు జిల్లా ఓబీసీ సెల్ చైర్మెన్ గువ్వ రవి ముదిరాజ్ వినతి పత్రం అందజేశారు. శనివారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బీసీ నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వచ్చే నిధులలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వారికి అవకాశం ఇవ్వాలని కోరినట్టుగా తెలిపారు. కలిసిన వారిలో రాష్ట్ర కోఆర్డినేటర్ కుక్కల రాజు ముదిరాజ్, నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నాయకులు పవన్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్ ఉన్నారు.

బీఎన్‌రెడ్డి నగర్‌లో భూగర్భ జలాలు కలుషితం

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఫేజ్-1, బీఎన్‌రెడ్డి కాలనీల్లో భూగర్భ జలాలు పూర్తిగా పారిశ్రామిక రసాయనాలతో విషపూరితంగా వాడుకోలేని పరిస్థితి నెలకొందని ప్రముఖ పారిశ్రామికవేత్త జక్క రోషిరెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ కాలనీవాసులు కర్రేర్ల రాజులు అన్నారు. శనివారం చర్లపల్లి బీయన్ రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 1లో కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు బోరు వేస్తే పూర్తిగా రసాయన వ్యర్థ జలాలు వచ్చాయన్నారు. నీటిలో తెల్లటి నురగతో పాటు దుర్వసన వస్తుందని, నీటిని నిర్మాణాలకు వాడుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. బీఎన్ రెడ్డి కాలనీలో కనీస అవసరాలకు నీటిని వాడుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-1లో కొంతమంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలోనే బోర్ వేసి భూగర్భంలోకి విష జలాలను పంపిస్తున్నారని ఆరోపించారు. దీంతో స్వచ్ఛమైన భూగర్భ జలాలను పూర్తిగా విషపూరితంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

ఈ విషయమై పోల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బాలనగర్‌లోని సామ్రాట్ హెూటల్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ సంఘం అధ్యక్షుడు జిసి.రెడ్డి హాజరయ్యారు. టీజీఎస్పీడీసీఎల్‌లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపైన, వెండర్‌పైన, రాష్ట్ర వ్యాప్తంగా స్టోర్‌లలో ఉన్న మెటీరియల్‌పైన సంకుచితంగా చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టోర్లలో ఒక మెటీరియల్ ఉంటే ఇంకొక మెటీరియల్ లేకపోవడంతో అక్కడక్కడ కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ కొత్త ప్రభుత్వమైనా ప్రయివేటు సెంటర్లలో పని చేస్తున్న కాంట్రాక్టర్లపైన ప్రత్యేక దృష్టి సాధించి తమకు స్టోర్లలో సరైన సమయానికి మెటీరియల్ అందే విధంగా చూడాలని చాలా సందర్భంలో అధికారులను వేడుకున్నట్టు తెలిపారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించలేకపోయారని చెప్పారు. టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ఈ మధ్యకాలంలో ప్రయివేటు సెంటర్‌లో పని చేస్తున్న కాంట్రాక్టర్లు వెండర్ కోడ్ తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారనీ, ఈ కోడ్ తీసుకోవడం వల్ల తమ ప్రయివేటు సెక్టార్ లో పనిచేసే కాంట్రాక్టర్లకు ఉపయోగం లేదని ముక్తకంఠంతో ఖండించారు. సీఎండీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత వెండర్ కోడ్ తీసుకుంటామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని శ్రీనివాస్‌గౌడ్, ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆలూరు మహేందర్, ఉపాధ్యక్షులు ఆర్.ప్రదీప్‌రెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రెటరీ అశోక్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుజాతమ్మ మృతి



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన భారత కమ్యూనిస్టు నాయకురాలు సుజాతమ్మ (33) హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని (సీపీఐ కాలనీ) గిరి ప్రసాద్ నగర్‌లోని ఆమె స్వగృహంలో సుజాతమ్మ మృతదేహానికి సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి మోతే రాజేశ్వరి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు లక్ష్మణ్, పార్టీ నాయకులు కె.ఐలయ్య యాదవ్, డి.జంగయ్య యాదవ్, కె.కుమార్, సూర శ్రీనివాస్, ఆటో సురేష్, నాని, నర్సింహా, లావణ్య, మేస్త్రి వెంకటయ్య, అనసూయ, పి.పద్మ, నవనీత, లక్ష్మి, లింగయ్య, ఎం.రాజేష్, ఎస్.వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

కరెంటు సమస్యలు లేకుండా చూస్తా : కౌన్సిలర్ పంగా హరిబాబు

నవతెలంగాణ-కీసర

కరెంటు సమస్యలు లేకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తానని నాగారం మున్సిపల్ 18 వ వార్డు కౌన్సిలర్ పంగా హరిబాబు అన్నారు. శనివారం 18వ వార్డులోని సాయి సంజీవి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్‌ను కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్తు అధికారులు శ్రీకాంత్, నవీన్ బాబు, సాయి సంజీవ కాలనీ ప్రెసిడెంట్ విజయ్, ధనుంజయ్, లక్ష్మీ ప్రసాద్, రమేష్, కిషోర్ , చందన్ , రమేష్ బాబు, కిరణ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
ఆదివారం | జూలై 14, 2024 | www.navatelangana.com

స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్‌కు జిట్టా సునీల్ శుభాకాంక్షలు



నవతెలంగాణ- కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా గచ్చిబౌలి స్టేడియంలో, పదవి బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కె.శివసేనా రెడ్డిని, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు, కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జిట్టా సునీల్ కుమార్ యాదవ్ కలిసి, ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి రాహుల్ సింగ్ చౌహాన్, భాస్కర్, గిరి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

టీ స్టాల్‌ను ప్రారంభించిన కోలన్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చాయ్ దునియా టీ స్టాల్‌ను కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ వాసులు చరణ్, సుధాకర్, ప్రశాంత్‌ల చాయ్ దునియా టీ స్టాల్‌ను ఓపెనింగ్‌కు ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిలు హాజరై టీ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, వరగాని వాసు, మామిళ్ళపల్లి శ్రీనివాస్, రామచంద్రనాయక్, దాసరి చందు, వర్మ రాజు, ప్రశాంత్, రామానాయుడు, సుబ్బారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా..



- నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం
- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన లక్ష్యం అని ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి, కాంగ్రెస్‌లో చేరడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో.. ప్రభుత్వ సలహాదారుడు నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సమక్షంలో.. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, రాగం నాగేందర్ యాదవ్, మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు మొవ్వా సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రావు, మోహన్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయం అని అన్నారు. కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, శ్రేయభిలాషుల అభీష్టం మేరకు.. వారి సూచనల మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం జరిగిందని తెలియచేసారు. ఏడు నెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటపడిందని, కాంగ్రెస్‌లో చేరితే అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్ద పీట వేయాలని అన్నారు. సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణం పనులకు, చెరువుల సుందరికరణకు, పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తియ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు ట్రాఫిక్ నివారించడానికి గాను, ఒకే పిల్లర్ మీద మెట్రో, ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు త్వరిత గతిన చేపట్టేలా చూడలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా.. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ముఖ్యమంత్రి తెలియచేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయభిలాషులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఆశాల నిరసన

- నల్ల బ్యాడ్జీలతో విధులు
- ఎర్ర జెండా అంటే భయమెందుకు : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్





నవతెలంగాణ-సిటీబ్యూరో/బాలానగర్

సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్‌టీయూ పర్యటన నేపథ్యంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

ఎర్ర జెండా అంటే భయమెందుకు : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్

ఎర్ర జెండా అంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం అని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్ ప్రశ్నించారు. సీఐటీయూ నాయకులు, ఆశాల అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం పర్యటన సందర్భంగా సీఐటీయూ నాయకులు రాజశేఖర్, ఇతర నాయకులు, ఆశాలను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన కాంగ్రెస్ కూడా బీజేపీ అడుగు జాడల్లోనే నడుస్తుందన్నారు. ఈ ప్రజాస్వామ్యంలో ప్రజలు, కార్మికులు తమ సమస్యలు, అభిప్రాయాలను ప్రభుత్వానికి చెప్పుకునే హక్కు లేదా..? అని ప్రశ్నించారు. నిరంకుశంగా ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. కార్మికుల హక్కులు, ప్రజా సమస్యలను పట్టించుకోని గత ప్రభుత్వాలు గతంలో కాలగర్భంలో కలిసి పోయాయని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ మాదిరిగానే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికార మందంతో విర్రవీగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : ఉన్నికృష్ణన్, రేవతి కల్యాణి

సీఐటీయూ నాయకులు, ఆశాలను అక్రమంగా అరెస్టును సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి ఖండించారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తమకు ఫిక్స్‌డ్ వేతనం కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నప్పటికీ పట్టించుకోని ఈ మొండి ప్రభుత్వాలు నేడు తామేదో చేస్తామని భయపడి ముందస్తుగా అరెస్టు చేయడం చాలా ఘోరం అన్నారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్టు చెప్పారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాడుతాం

- ఐఎన్‌టీయూసీ నేత ముద్దాపురం మదన్ గౌడ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల హక్కుల సాధన కోసం పరిశ్రమల యజమాన్యాలతో ఎంత వరకైనా పోరాడుతానని ఐఎన్‌టీయూసీ నేత ముద్దపురం మదన్ గౌడ్ అన్నారు. బాలనగర్‌లోని బయో కెమికల్స్ అండ్ సింథటిక్ ప్రొడక్ట్స్ పరిశ్రమ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నేపథ్యంలో షాపూర్ నగర్‌లోని తన కార్యాలయంలో మదన్ గౌడ్ పరిశ్రమ నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమ య్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా సుభాష్, సుమిత్ సింగ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రవీందర్ రెడ్డి, షేక్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, నవీన్ కుమార్ , అజార్ పాషా, వైస్ ప్రెసిడెంట్లుగా బాలరాజు, చంద్రశేఖర్, నరేందర్, ప్రశాంత్ రెడ్డి, శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ రావు, సంయుక్త కార్యదర్శి మధు, శ్రీనివాస్, రామ్మోహన్, రమేష్ తదితరులు నియమితుల య్యారు. ఈ సందర్భంగా మదన్ గౌడ్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు పరిశ్రమల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 125 - గాజులరామారం డివిజన్ శిరిడి హిల్స్ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఎమ్మెల్యేని కలిసి సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రయినేజీ మరమ్మతులు వంటి మౌలిక వసతుల కల్పనపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో 90 శాతం పనులు పూర్తి చేశామని, ఇంకా ఏమైనా పనులు మిగిలిపోయి ఉంటే అతి త్వరలోనే నూతన పనులను చేపట్టి ఆదర్శవంతమైన నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడి హిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు డి.బ్రహ్మ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యబాబు, సంయుక్త కార్యదర్శి వేణుగోపాల చారి, కోశాధికారి జి.బాలకిషన్, సభ్యులు శివ, అంకిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ హ్యాండ్లూమ్స్ టెక్స్ టైల్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ..

జీడిమెట్ల 132 డివిజన్ రాఘవేంద్ర కాలనీలో నిర్వాహకులు వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనివర్సల్ హ్యాండ్లూమ్స్ టెక్స్ టైల్స్‌ను శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి రోజుల్లో వస్త్ర వ్యాపారం ఎంతో ఆదరణ పొందుతుందని నూతన వస్త్రాలు ఆకట్టుకునే డిజైన్లతో వినియోగదారులకు అందుబాటులో ఉంచితే.. వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు కుంట సిద్దిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్‌లో 'పేరెంట్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎస్ఆర్ నాయక్ నగర్ లోని 'సత్యవాణి విద్యానికేతన్ హై స్కూల్ 'లో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి ఆధ్వర్యంలో 'పేరెంట్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం' శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి హేమవతి, క్రీడో పబ్లిషర్స్ ట్రైనింగ్ మేనేజర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నేటి పోటీ ప్రపంచంలో రాణించడానికి సత్యవాణి విద్యానికేతన్ విద్యాసంస్థ పాటించే నూతన 2024-2025 విద్యా విధానాన్ని వర్ణిస్తూ రాబోయే తరం విద్యార్థులు ఎలా ఎదగాలి విద్యా విధానంలో సమస్యల్ని ఎలా అధిగమించాలో వివరించారు. అనంతరం టీవీఆర్ అధినేత కోటిరెడ్డి మాట్లాడుతూ... మారుతున్న విద్యా విధానానికి అనుకూలంగా ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో భాగంగా ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం (PBL) పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్తు తరానికి పునాది వేయడమే తమ విద్యాసంస్థల కర్తవ్యం అని తెలిపారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతలు నిర్వహించాలని కోరుతూ తగు సూచనలు తెలియజేశారు. విద్యార్థిని విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక కళలను వెలికి తీసి, వారిని ప్రయోజకులుగా ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో సహకరించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సాయి నగర్ వాసులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ సాయి నగర్ వాసులు శనివారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో.. దేవా, సాయి, రాఘవేందర్, సురేష్, నవీన్, లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ (లడ్డు), సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్,126 డివిజన్ అధ్యక్షులు గణేష్, 129 డివిజన్ అధ్యక్షులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 14వ గ్రాడ్యుయేషన్ డే



- శాంత ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను ప్రారంభించిన కళాశాల చైర్మెన్ టి.బాలా రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల చైర్మెన్ టి.బాలా రెడ్డి శాంత ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను ప్రారంభించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన 14వగ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమరత్ ఆర్య, అడోబి యూనివర్సిటీ టాలెంట్ పార్ట్నర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఈ ఓపెన్ థియేటలా అంతా ఆహ్లాదకరంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో మంచి నైపుణ్యాలతో పనిచేస్తే లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. గౌరవ అతిథి రాజశేఖర్ రెడ్డి అదూరి అసిస్టెంట్ మేనేజర్ పీపుల్ కల్చర్ వెల్సీస్ మాట్లాడుతూ మీరు థియరీటికల్ నైపుణ్యాలను సాధించి.. ఇప్పుడు ఇండస్ట్రియల్‌కు ఉపయోగపడే నైపుణ్యాలను సాధించాలని తెలిపారు. పుస్తకాలను మీరు ఎంత బాగా ఉపయోగిస్తే మీరు అంత నైపుణ్యాలను సంపాదించుకోగలరని ప్రతి విద్యార్థి లైబ్రరీ చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా. కె శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగాన్ని బాధ్యతతో నిర్వహించుకోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలను ఎలా ఇంప్రూవ్ చేసుకోవాలో సూచించా రు. కళాశాల సెక్రటరీ టివి.రెడ్డి మాట్లాడు తూ విద్యార్థి యొక్క అసలైన జీవితం ఇక్కడినుంచి ప్రారంభమవు తుందని విద్యార్థులుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు క్షమించవచ్చు కానీ, ఇండస్ట్రీలో మిమ్మల్ని క్షమించరు జాగ్రత్తగా మెలగాలని సూచిం చారు. మీరు ఏ బ్రాంచ్‌లో ఉద్యోగం సాధించిన ప్రతిరోజు మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మీరు మీ జీవితాంతము తల్లిదండ్రులను, టీచర్స్‌ను గౌరవించాలని సూచించారు కళాశాలకు మీరు వచ్చి విద్యార్థులకు మీ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా సూచించారు. అకడమిక్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ మీ శ్రమకు తగిన రోజు ఈ గ్రాడ్యుయేషన్ డే 2024 మీ విజయానికి చిహ్నం అని కొనియాడారు. ఈ గమ్యంలో విశ్రాంతి తీసుకోకుండా ఇంకా మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ గ్రాడ్యుయేషన్ డే మీ విజయానికి ఒక తొలిమెట్టు మాత్రమే అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ బాలా రెడ్డి, సెక్రెటరీ టి వి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పిఆర్ఓ రవి సుధాకర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

లాల్ దర్వాజా బోనాలకు.. ప్రత్యేకాధికారి నియామకం



నవతెలంగాణ - ధూల్ పేట్

పాతబస్తీ చారిత్రాత్మక లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో ఈ యేడు ఆషాఢ మాస బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారిగా అంజన రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా లాల్ దర్వాజా ఆలయంలో నిధుల వినియోగంలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులు రావడంతో దేవాయ శాఖ చొరవ తీసుకొని ప్రత్యేక అధికారిని నియమించింది. 2024 ఆషాడ బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి తమ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించడం పట్ల సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధులు సి శివకుమార్ యాదవ్, పోసాని సదానంద్ ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, బద్రినాథ్ గౌడ్, కాశీనాథ్ గౌడ్, రంగ శ్రీకాంత్ గౌడ్, పులి కంటి నరేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం జరిగే దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే సిద్ధం చేసినట్టు సురేందర్ ముదిరాజ్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆషాడ బోనాల ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించడానికి దేవాదాయ శాఖ అధికారుల బందం అవసరమైనన్ని ఏర్పాటు చేసిందన్నారు. లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నలుమూలన నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారని తెలిపారు. జులై 28న అమ్మవారికి బోనాల సమర్పణ, అదే రోజు సాయంత్రం లోకకల్యాణార్థం శాంతి కళ్యాణం మరుసటి రోజు జూలై 29న కన్నుల పండుగ నిమజ్జన ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

'వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వర్షాకాలంలో కలుషిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత పాటించకుంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బొగ్గులకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుష అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సాధారణంగా వర్షా కాలంలో నీరు ఎక్కువగా కలుషితమయ్యే అవకాశం ఉందని, పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్ డయేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా, స్వైన్ ఫ్లూ, మెదడు వాపు, కలరా వంటి వ్యాధులు ఒకరి నుండి మరొకరికి ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో వచ్చే జబ్బుల్లో మొదట మలేరియా వ్యాధికి కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఎక్కువగా ఆడ ఎనాఫిలిస్ దోమ ద్వారా వ్యాపిస్తుందని, తీవ్ర జ్వరాలు, గొంతు నొప్పి, కీళ్ళ నొప్పులతో బాధపడే వద్దులు వైద్యుని సంప్రదించాలని సూచించారు. సాయంకాలం దోమలు రాకుండా ఇంటి కిటికీ డోర్లు వేసుకోవాలని సూచించారు. బయటి తినుబండారాలు తీసుకోవద్దని అన్నారు. ఎక్కువగా పండ్ల రసాలు ఆకుకూరలు తీసుకోవాలని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ 5వ వార్డులోని రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను వైస్ చైర్మెన్ పద్మా రావుతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. అనంతరం వారు వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని నాణ్యతలో ఎక్కడ రాజీ పడొద్దు అని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణ యాదవ్, ఆనంద్ కుమార్, గోపాల్ రెడ్డి, శంకర్ నాయక్, మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, యువ నాయకులు విష్ణు యాదవ్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ నురగలతో మంచు చరియాలు

- చెరువులో రసాయన వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి
- కార్పొరేటర్ మహేందర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో.. కెమికల్ నురగలతో మంచు చరియాలుగా కనిపిస్తున్న మైసమ్మ చెరువు అందాలు అంటూ జీహెచ్ఎంసీ అధికారులను ట్యాగ్ చేస్తూ మూసాపెట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఓ వీడియో పోస్ట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మూసాపేట్‌లోని మైసమ్మ చెరువులో కలుస్తున్న కెమికల్ వాటర్, మురుగు నీటి కారణంగా.. చెరువు నుంచి ప్రవహించే నీరు, తెల్లటి మంచు లాగ హిమ పాతాన్ని తలపిస్తుంది. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అంతుపట్టని రోగాలతో సతమతమౌతున్నారని ఆయన అన్నారు. ఇదే సమస్య పై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ మొద్దు నిద్ర వీడటం లేదని తెలిపారు. ఇకనైనా చెరువులో రసాయన వ్యర్థాలు కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులని కోరారు.

15న సీపీఐ(ఎం) బస్తీబాట

- పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్‌లో జోన్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 15న బస్తీ బాట నిర్వహించనున్నట్టు పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు సాయి శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా పార్టీ నగర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కార్మిక నగర్ బస్ స్టాప్ నుంచి ఎస్పీఆర్ హిల్స్ లోని ఇందిరా గాంధీ బొమ్మ వరకు బస్తీబాట నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారుల దష్టికి తీసుకొని వెళ్లేందుకు సీపీఐ(ఎం) తమ వంతు కషి చేస్తుందని, కావున పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజలు ఆక్సిలరీ సభ్యులు అందరూ పాల్గొని బస్తీలలో ఉన్న సమస్యలు తెలియ పరచాలని పిలుపునిచ్చారు. బస్తీ బాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని ఆందోళన

- అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-ఓయూ

గ్రూప్ 2, 3లలో పోస్టులు పెంచాలని, డీఎస్సీని వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఓయూలో శనివారం ఆర్ట్స్ కళాశాల వద్ద పలువురు ఆశావహులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమ డిమాండ్‌లను తీర్చాలన్నారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి ఓయూ పీఎస్ కు తరలించారు.

ఓయూలో రణరంగం

- మాజీ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు..
- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, ఎన్ఎస్‌యూఐ నాయకుల అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో శనివారం మళ్లీ రణరంగం వాతావరణం నెలకొంది. పదేండ్లుగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా మోసాం చేసిన కేటీఆర్ నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్ ముఠా నిరుద్యోగ మూసుకువేసుకొని నిరుద్యోగులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరుగుతున్నదన్నారు. గ్రూప్1, గ్రూప్2, డీఎస్సీ, భారీ మొత్తంలో భర్తీ జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ పదేండ్లు పాలించి ప్రభుత్వ బడులు మూసి వేస్తే కాంగ్రెస్ వచ్చి వాటిని మళ్లీ పునర్ నిర్మాణం చేసిందన్నారు. అసలైన నిరుద్యోగులు లైబ్రరీలలో మౌనంగా ప్రపరేషన్ అవుతున్నారని అలాంటి వాళ్లకోసం ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయాలని చిత్తశుద్ధి తో ప్రభుత్వం భర్తీ చేస్తోందని తెలిపారు. త్వరలో ఓయూ లో జాబ్ క్యాలండర్ విడుదలతో నిరుద్యోగులతో ముఖ్యమంత్రికి సన్మానం చేస్తాం అన్నారు. కేటీఆర్ కొంత మంది ముఠాతో యూట్యూబ్ వాళ్లకు పైసలు ఇచ్చి ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేసేందుకు సన్నాహాలు చేస్తోన్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతో పాటు ఓయు ఎన్ఎస్‌యూఐ నేతలు మెడ శ్రీను, వినయ్ లను అరెస్ట్ చేశారు.

ఓయూ లేడీస్ హాస్టల్‌లో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు

- ఆర్థిక ,ఆరోగ్యంతో పాటుగా పర్యావరణ పరిరక్షణ
- ఆహార పదార్థాల వ్యర్థాలతో బయోగ్యాస్
- ముమ్మరంగా పనులు
- పర్యావరణం, ఆరోగ్య సంరక్షణ... తీరనున్న కట్టెల పొయ్యి కష్టాలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రధాన లేడీస్ హాస్టల్ లో మెస్ - 1 ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలే భూమిపూజ కూడా జరిగింది. ఈ మేరకు సహాస్ అనే ఎన్‌జీఓ, సీఎస్ఆర్ సహకారంతో ఈ బయో గ్యాస్ నిర్మాణం చేస్తుండగా, ఆహుజ సంస్థ టెక్నికల్ ఇన్ స్టాలేషన్ వర్క్ చేస్తున్నారు. ఈ మేరకు వీరితో మే 31న, మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ), చేసుకున్న విషయం తెలిసిందే. ఇక ఈ నెల 2న బయోగ్యాస్ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు.



తడి ఆహార పదార్థాల వ్యర్థాలతో బయోగ్యాస్

ఓయూలో వివిధ మెస్‌ల నుండి వచ్చే కూరగాయలు, ఆహార పదార్థాల నుండి వచ్చే వ్యర్థాల నుండి ఈ బయో గ్యాస్ నిర్వహించనున్నారు. ఇక వసతి గృహాల నుండి వ్యర్థాలను ప్లాంట్ వరకు చేర్చేందుకు ఓయూ స్వయంగా ఎలక్ట్రికల్ వాహనం కొనుగోలు చేయనుంది. 6 నెలల పాటు ఆహుజ వారే బయోగ్యాస్ ప్లాంట్‌ను నిర్వహిం చనున్నారు.ఈ సమయంలో ఓయూలో ఒక ఉద్యోగికి దీని నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్క రోజుకు ఈ ప్లాంట్ 2 టన్నుల వ్యర్థాలను తడి వ్యర్థాలను బయోగ్యాస్‌గా మారుస్తోంది. దాంతో 300 సామర్థ్యం గల ఒక మెస్ కు ఆహార పదార్థాలు తయ్యారు చేయవచ్చు.

పర్యావరణం, ఆరోగ్య సంరక్షణ... తీరనున్న కట్టెల పొయ్యి కష్టాలు

ఈ గ్యాస్‌తో పర్యావరణ సంరక్షణతో పాటుగా ఇక్కడ కొన్ని సంవత్సరాలుగా కట్టెల పొయ్యి నుంచి వచ్చే వేడి , దుమ్ము, దూళి, పొగతో అక్కడ పని చేసే ఉద్యోగాలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక ఉద్యోగాలు ఎంతో ఉపశమనం పొందనున్నారు.

లేడీస్ హాస్టల్‌లో కట్టెల పొయ్యికి కాలం చెల్లింది

ఇక ఓయూ ప్రధాన లేడీస్ హాస్టల్‌లో ప్రస్తుతం వంటకు వినియోగిస్తున్న వంట చెరుకు , కట్టెలను ఉపయోగించరాదని, దానిని స్థానంలో తప్పనిసరిగా పూర్తిస్థాయిలో గ్యాస్ సిలిండర్స్ వినియోగించాలని ఓయూ ఇన్‌చార్జి వీసీ ఆదేశాలు జారీ చేశారు



బయోగ్యాస్‌తో పలు ప్రయోజనాలు

ఈ బయోగ్యాస్ ఏర్పాటుతో విద్యార్థులకు మెస్ బిల్స్ తగ్గుతాయి అని పర్యావరణ పరిరక్షణ కోసం కషి చేస్తుందన్నారు. సరైన మార్గంలో ఈ వ్యర్థాలను వినియోగిస్తు అన్ని మెస్‌లలో ఏర్పాటు చేస్తే పలు ప్రయోజనాలు ఉన్నాయి అన్నారు. నా హయాంలో ఏర్పాటు చేయడం సంతప్తిగా ఉందన్నారు.

\- లేడీస్ హాస్టల్ డైరెక్టర్ దా.వై.కళ్యాణ లక్ష్మీ

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాలలో పర్యటన

నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 21వ తేదీన జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాలలో పర్యటించి బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల సందర్భంగా మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం కోసం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిమంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి అసౌకర్యానికి, ఇబ్బందులకు గురికాకుండా శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 22న రంగం (భవిష్యవాణి), అంబారీపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.క్యూ లైన్‌లలో ఎలాంటి తోపులాటకు ఆవకాశం లేకుండా పటిష్టమైన భారికేడ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి హెూదాలో కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందని చెప్పారు. బోనాల ఉత్సవాలలో భక్తులకు సేవలు అందించే వాలంటీర్ లకు ఫోటోతో కూడిన ప్రత్యేక పాస్‌లను జారీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బంది నియామకంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో అందరి భాగస్వామ్యంతో బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీసీ సమ్మయ్య, లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ అశోక్, ఏసీపీ సర్దార్ సింగ్, సీఐ పరశురాం, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, క్రిస్టోఫర్, అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, చైర్మెన్ కామేశ్వర్ రావు, దక్కన్ సేవా సమితి అధ్యక్షుడు ధర్మవీర్, కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, కిరణ్మయి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేశన్ రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయంలో స్వచ్ఛ భారత్





నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయంలో శనివారం చెట్లను శుభ్రంగా కటింగ్ చేస్తూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు సి. హెచ్. రమణ కుమార్, డైరెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు ప్రెస్ పరిసరాల్లో ఉన్న చెత్తను, వ్యర్థ పదార్థాలను, బిల్డింగ్ పై భాగంలో ఉన్న మొక్కలను పెద్ద ఎత్తున శుభ్రం చేశారు. అదేవిధంగా ప్రెస్ ఆవరణలో మొక్కలను నాటుతు మన పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచుకోవాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.సంతోష్ కుమార్ ఎడి.టి, కే. విజయ్ కుమార్, పి. శివనంద్, బి. ప్రవీణ్ కుమార్, ఏ.ప్రవీన్ కుమార్, జేఏసీ నాయకులు డి .బాల్ కుమార్, ఆర్. ఈశ్వరయ్య, ఎస్.విశ్వసినా, జి మల్లికార్జున్, ఎమ్ .నరహరి, ఎం.నరేష్, జి .భగవాన్ దాస్,కే. శ్రీకాంత్ ,ఎమ్ .శ్రీ రామ్, ఆర్.ఎస్.వాసు, ఎస్. సందీప్, పి .శంకర్ ,కే. సత్యనారా యణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

అడ్డగుట్టలో తీవ్రమైన మంచి నీటి సమస్య



- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్
- 8వ రోజు సీపీఐ(ఎం) బస్తీబాట

నవతెలంగాణ-ఓయూ

నగర వాసులు,బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్, సెంట్రల్ జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం 8వరోజు, అడ్డగుట్ట ఏ సెక్షన్ బస్తీలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అడ్డగుట్టలో మంచి నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. మంచినీటిలో డ్రయినేజీ నీరు కలిసి వస్తున్నాయన్నారు. పలు సమయాల్లో అడ్డగుట్టకు సరిపడా నీళ్ల రావడం లేదని, పలుమార్లు మురికి నీళ్ల కలిసి రావడంతో ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి తోడు డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, వాటర్ వర్క్స్ సమర్థవంతమైన అధికారులు లేకపోవడంతో, ఏండ్లు గడిచినా సమస్యలు అట్లే ఉంటున్నాయి అన్నారు. అడ్డగుట్టలో మంచినీటి సమస్య, డ్రయినేజీ వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సీపీఐ(ఎం) గా విజ్ఞప్తి చేస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం. అజయ్ బాబు,జోన్ కమిటీ నాయకులు ఆర్. మల్లేష్, ఎ. బాలయ్య, ఎం. గోపాల్, బి. మధు,ఎల్లయ్య, షేక్ ఫాతిమా, శానమ్మకైరునిస, పాల్గొన్నారు.

28న సాంప్రదాయ వైద్యంపై 4వ ప్రపంచ కాంగ్రెస్

- 2035 వరకు రోగరహిత ప్రపంచంగా మారుద్దాం
- ప్రొఫెసర్ డాక్టర్ దీపక్రాత్, డాక్టర్ వంశీకృష్ణ



నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 28న తెలంగాణలో సాంప్రదాయ వైద్యంపై 4వ ప్రపంచ కాంగ్రెస్ పేరిట భారతీయ విద్యభవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రొఫెసర్ డాక్టర్ దీపక్రాత్, డాక్టర్ వంశీకష్ణలు తెలియజేశారు. శనివారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని ఆర్యవైశ్య అభ్యదయ సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ది హెూలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ హైదరాబాద్ ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ సంప్రదాయ వ్యవస్థ పరిశోధన, అభివృద్ధి కోసం అనేక దేశాలతో అనుసంధానం చేస్తున్న సంస్థ మందులని తెలిపారు. సాంప్రదాయ ఔషధం అభివృద్ధి వ్యూహంపై సంస్థ దష్టి సారించిందని తెలిపారు. క్రియాశీల విధానాలను అభివద్ధి చేయడం, బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడంలో సభ్య దేశాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. భద్రత, సమర్థత నాణ్యతతో జనాభాను ఆరోగ్యంగా ఉంచడంలో సాంప్రదాయ ఔషధం పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ఈవెంట్‌ను గ్లోబల్ బుక్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇంగ్లాండ్ దేశస్తులు అధికారికంగా ప్రకటించిందన్నారు. 10 రోజులలో (21-30) వివిధ రకాల కార్యకలాపాలతో సాంప్రదాయ వైద్యంపై ప్రపంచంలోని ప్రముఖ అంతర్జాతీయ సమావేశం వివిధ కార్యకలాపాల కింద నిర్వహిస్తున్నట్టు వారు తెలియజేశారు. ఉచిత ఆరోగ్య శిబిరం, వేప చల్ల, పెంపకం, నైపుణ్యాభివద్ధి వర్క్ షాప్. క్లినికల్ రీసెర్చ్ ట్రెనింగ్. హై ప్యానెల్ డిస్కషన్, ట్రెడిషనల్ ఇరిడాలజీ వర్క్షాప్. అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. హెూలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ 4వ ప్రపంచానికి ఉచిత ప్రవేశంతో వైద్య విద్యార్థులందరినీ, ఆరోగ్యం కోరుకునే వారందరిని ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైద్యులు గీతనాగశ్రీ, ఘన్సీరాణి, శ్రీనివాస్, బొల్లమల్ల నిద్సింగ్రావు, రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ ఖైర్తి ఖానా వాటర్ బోర్డు కార్యాలయంలో బోనాల ఉత్సవాల సందర్భంగా నగర వాటర్ బోర్డు అధ్యక్షులు సతీష్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జానకి రెడ్డి, ఇతర సభ్యులు సీజీఎం ప్రభు, జీఎంలు హరీష్ శంకర్, జగన్, డీజీఎం శ్రీనివాస్,మేనేజర్లు రాంబాబు,శివకుమార్,పవన్,మౌనిక,హరి ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, హఫీజ్లు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ సత్కారం కార్యాలయంలో ఒక కుటుంబం వలే పనిచేసి అందరూ తమకెందుకు అనుకోకుండా ప్రజల దాహార్తిని తీర్చడంలో మురుగునీటి మంచినీటి సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ పార్లమెంటరీ సమీక్షా సమావేశంలో కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కీలకమైన పార్లమెంటరీ సమీక్షా సమావేశంలో సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజకీయ దకృథాల నిర్మాణాత్మక మార్పిడి, వ్యూహాత్మక చర్చలు జరిగాయి. అసోం లోకసభ ఎం.పి. రకీబుల్ హుస్సైన్‌తో పాలనలో పారదర్శకతల గురించి చర్చించడంతోపాటూ సమగ్ర నివేదికలను హుస్సేన్‌కు సమర్పించారు. డాక్టర్ కోట నీలిమ సమావేశం ఫలితాల గురించి తన ఆశావాదాన్ని వ్యక్తం చేశారు, దేశం సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో, ప్రజల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో సహకార ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో అజారుద్దిన్,.ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

నాణ్యత పై ప్రశ్నిస్తే దాడులా..?

- మహిళపై ఎమరాల్డ్ స్వీట్ షాప్ యజమాన్యం దాడి .. పోలీసులకు ఫిర్యాదు
- ఇటీవల రైతా అడిగితే హత్య చేసిన మెరీడియన్ సిబ్బంది



నవతెలంగాణ-బంజారా హిల్స్

వినియోగాదారులను గౌరవించాల్సిన వ్యాపారులు వారిపైనే దాడులకు తెగబడుతున్నారు. సేవ చేసే అవకాశం కల్పించి తద్వారా ఆర్థిక బలోపేతానికి తోడ్పడుతున్న వినియోగదారులే దేవుళ్ల అన్న నానుడి నుంచి తాము ఏది పెడితే అది తినాలి ఏది మాట్లాడితే అది వినాలి అనే స్థాయికి ఎదిగారు నగరంలోని కొందరు హెూటళ్ల నిర్వాహకులు. నాణ్యత ప్రమాణాలు మచ్చుకకు కూడా పాటించకుండా అందిన కాడికి దోచుకుంటూ ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం వెనుకాడటం లేదు. అదనంగా రైత అడిగినందుకు పంజాగుట్ట మెరీడియన్ రెస్టారెంట్ యాజమాన్యం సిబ్బందిచే వినియోగదారులపై దాడులు చేయించి హతమార్చిన సంగతి తెలిసిందే. ఇలా నగరంలో నిత్యం ఎక్కడో ఒకచోట వినియోగదారులపై దాడులు సర్వసాధారణంగా మారాయి. నాణ్యత ప్రమాణాలు, ధరలపై ప్రశ్నిస్తే ఆగ్రహంతో ఊగిపో తున్నారు ఆయా హెూటల్లో నిర్వాహకులు. ఇదే తరహాలో శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఎమరాల్డ్ స్వీట్ షాప్ కు వెళ్లిన మహిళకు చేదు అనుభవం ఎదురైంది. నాణ్యత పై ఆరా తీస్తుండగా కోపోద్రికులైన ఎమరాల్డ్ యాజమాన్యం మహిళా అని కూడా చూడకుండా ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ హఠాత్ పరిణామానికి కంగుతిన్న సదరు మహిళ తేరుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చిరు వ్యాపారంగా జీవిత ప్రస్థానం ప్రారంభించి లక్షలు కోట్లు గడించిన యజమానులు తమ పలుకుబడితో ఘటనలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు. కేవలం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన సంఘటనలే కనిపిస్తుండగా కనిపించని సంఘటనలు కోకొల్లలు. ఇప్పటికైనా అధికారులు వినియోగదారులపై దాడులు చేస్తున్న సంఘటనపై ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు వినియోగదారులు కోరారు. ప్రతి హెూటల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు ఫిర్యాదులు చేసేందుకు ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | జులై 14, 2024 | www.navatelangana.com

అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల భారీ ధర్నా





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ అశోక్‌నగర్‌లో విద్యార్థులు, నిరుద్యోగులు భారీ ధర్నాకు దిగారు. నిరుద్యోగులను అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని శనివారం రాత్రి అశోక్‌నగర్‌లో ఒక్కసారిగా నిరుద్యోగులు రోడ్డెక్కి ర్యాలీ చేశారు. రోడ్డును దిగ్బంధం చేశారు. దాంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నిరుద్యోగుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచడంతో పాటు డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ -1 మెయిన్స్‌కు 1:100 పిలవాలన్నారు. తమ వెనుకాల ఏ రాజకీయ పార్టీ లేదని , కావాలని కొందరు సీఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. ఈ ధర్నాకు భారీస్థాయిలో నిరుద్యోగులు హాజరై తమ నిరసనను తెలిపారు.

స్పృహ కోల్పోయిన యువతి

అశోక్‌నగర్‌లో ధర్నా చేస్తూనే ఓ నిరుద్యోగ యువతి స్పృహ కోల్పోయారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించొద్దని కోరారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..



- ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు

నవతెలంగాణ - ధూల్ పేట్

రహదారులపై విధిగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు అన్నారు. బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్, వారి సిబ్బంది అధ్వర్యంలో సి.టి.సి. గోషామహల్ పోలీస్ ట్రెనీ విద్యార్థులకు, వారి సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరీ బాధ్యత అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. సిగ్నల్ జంపింగ్ అతి ప్రమాదకరమని, ముఖ్యంగా రెడ్ సిగ్నల్ పడినప్పుడు తప్పనిసరిగా వాహనం ఆపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపడం ప్రమాదమని, అలాగే అది నేరమన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5వేల వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్షను విధిస్తారన్నారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అదే విధంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదమని, ఎక్కువగా వాటి ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి అని చెప్పారు. వాహనాలు నిర్లక్ష్యంగ నడపటం ఎప్పుడూ ప్రమాదకరమే అన్నారు. వారికి కలిగిన సందేహాలను నివృత్తి చేస్తూ, సలహా, సూచనలు చేశారు. సుమారు 150 మంది పోలీస్ ట్రెనీ విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఎం.ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ విక్ర మదేవ్, నరసింహ మూర్తి, ఆర్.ఐ, ఆర్.ఎస్.ఐ. కుమార్, అశోక్ కుమార్ లు సీటీసీ గోషామహల్ సిబ్బంది పాల్గొన్నారు.



రుగ్మతలు పోవాలంటే యువత పోరాటం చేయాలి..

- డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్..

నవతెలంగాణ - ధూల్ పేట్

సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, రుగ్మతలు పోవాలంటే యువత సమాజం మార్పునకు ముందుకు వచ్చి పోరాటంలోకి రావాలని డీవైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమైక్య) సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యువత సర్వేలో భాగంగా స్థానిక జంగంమేట్ డివిజన్ కొన్ని బస్తీల్లో యువత దగ్గర వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కులం మతం, ప్రాంతం, జాతి, మత్తు, మాదకద్రవ్యాలు, మూఢనమ్మకాలు ఇలాంటి అనేక రుగ్మతలు పట్టిపీడిస్తున్నాయన్నారు. ఈ రుగ్మతల్లో అనేక మంది యువత కొట్టుకుపోతున్నారని, వాటికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి యువతను రాజకీయ నాయకులే వారిస్వలాభం కోసం ఉపయోగించుకుంటున్నారన్నారు. దీంతో యువతను పెడమార్గం పట్టించే నడిపిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంచి, చెడులను విశ్లేషించుకోవాలని, మంచి పార్టీల వైపు యువత రావాలని ఆయన కోరారు. అప్పుడే సమాజంలో మేలు జరుగుతుందన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించే వైపు డీవైఎఫ్ఐ పనిచేస్తుందన్నారు. అందుకే నేటి యువత డీవైఎఫ్ఐ వైపు రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ యువత కోసం ఉపాధి శిక్షణకు ప్రత్యేక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు రాజేష్, శ్రీను, భారత్, శ్రీనాయక్, శ్రప్రవీణ్, డాక్టర్ నాయక్, కార్తిక్, నవీన్, విష్ణోవ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి



- తెలంగాణ ఆల్ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్
- టీఏయూటీఏ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఓయూ

విశ్వవిద్యాలయాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (టీఏయూటీఏ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, శనివారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వం ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలలో ప్రధాన సమస్యలు వాటి సాధ్యమైన పరిష్కారాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు.

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ఉద్యోగ పదవి విరమణ వయోపరిమితి వయస్సును 65 సంవత్సరాలకు పెంచడం (యూజీసీ మార్గదర్శకాల ప్రకారం), అన్ని విశ్వవిద్యాలయాలకు ఆర్ ఎస్‌పీ - 2016 (యూజీసీ) పెండింగ్ బకాయిల చెల్లిం పులు, ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్,యూనివర్సిటీ ఉద్యోగులం దరికీ హెల్త్ కార్డు ప్రయోజనాలను అందజేయాలని, వివిధ విశ్వవిద్యాలయాల సమస్యలు సీఏఎస్, తెలంగాణ విశ్వవిద్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న సీఏఎస్ ప్రమోషన్‌లు, ఓయూ సీపీఎస్ ,ఓపీఎస్ ఏఐసీటీఈ/ యూజీసీ మార్గదర్శకాల క్రమబద్ధీకరణ లాంటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో టౌటా అధ్యక్షులు ప్రొఫెసర్ జి. మల్లేశం, ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు (వర్కింగ్), ప్రొఫెసర్ సరస్వతమ్మ (టీఎంవీ), ప్రొ. బి. మంగు (ఓయూ), డాక్టర్ వనజ ఉదయ్ (పీఎస్‌టీయూ), ప్రొఫెసర్ సైదా నాయక్, ప్రొఫెసర్ మాధవి కుమారి (జేఎన్‌టీయూహెచ్), డాక్టర్ ప్రశాంతి , డాక్టర్ ఎం. మధు (ఎంజీయూ), పాల్గొన్నారు.

'పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్య సభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షులు గవ్వల భరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, లేని యెడల ఆగస్టు 6వ తేదీన 'ఛలో పార్లమెంట్' ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులను కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్, డీఎంకె, అన్నాడీఎంకే, జనతా దళ్ తదితర పార్టీలను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. తెలిపారు.బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతంకు పెంచాలని కోరారు.పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కలలో బీసీ కులాల వారి లెక్కలు సేకరించాలని కోరారు.తమ 14 డిమాండ్లపై జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంచీపురం మంగళ గౌరీ నూతన షోరూం ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

అత్తాపూర్ లోని మెట్రో పిల్లర్ నంబర్ 142 కి ఎదురుగా తమ సరికొత్త కాంచీపురం షాపింగ్ మాల్‌కు మంగళ గౌరీ శనివారం శుభారంభం చేసింది.జంట నగరాలలోని సర్వోత్తమ షో రూముల్లో ఒకటైన మంగళ గౌరీ షాపింగ్ మాల్ కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులకు అనువైన అద్భుతమైన షాపింగ్ అనుభూతిని ఒకే చోట సమగ్రంగా అందజేసే విధంగా రూపొం దింది. ఇందులో అత్యంత విస్తారమైన మెన్స్ వేర్ , వుమెన్స్ వేర్, కిడ్స్ వేర్ అందుబాటు లో ఉన్నాయి. ప్రముఖ టాలీవుడ్ తార కుమారి ఫరియా అబ్దుల్లా, ప్రముఖ యాంకర్ సుమ కనకాల సంయుక్తంగా ఈ షోరూంను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ అద్భుతమైన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇంత అందమైన , అన్ని బ్రాండులూ అందుబాటులో ఉండే అత్యంత సౌకర్యవంతమైన షోరూంను అత్తాపూర్ లో నెలకొల్పిన డైరెక్టర్ల ను అభినందించారు. ఇదే సందర్భంలోఫరియా మంగళ గౌరీ షాపింగ్ మాల్ వారి ఆషాడం కేజీ సేల్ 50 శాతం వరకు తగ్గింపు ఆఫర్ ను కూడా ప్రారంభించారు. ఈ ఆఫర్ అన్ని వస్త్రాల పై అందుబాటు లో ఉండటం విశేషం. యాంకర్ సుమ కనకాల మంగళ గౌరీ షాపింగ్ మాల్ లోని అన్ని విభాగాలలోని లేటెస్ట్ కలెక్షన్స్‌ను సందర్శించి, అన్ని వెరైటీలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. అత్తాపూర్ ఆ పరిసరాల వారు తమ అభిరుచులకు, అవసరాలకు సరిపడే వైవిధ్య భరిత వస్త్ర, వస్తు శ్రేణి కోసం మంగళ గౌరీ షాపింగ్ మాల్ ను సందర్శించి అపురూపమైన షాపింగ్ అనుభూతిని పొందగలరని, ముఖ్యంగా వివాహాది శుభ కార్యాలకు, ప్రత్యేకమైన వేడుకలకు మంగళ గౌరీ షాపింగ్ మాల్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని సుమ అన్నారు.

తమ బ్రాండ్ కు సంబంధించిన భవిష్యత్ ప్రణాళికల గురించి మంగళ గౌరీ షాపింగ్ మాల్ సంస్థ డైరెక్టర్ శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు తమ బ్రాండ్‌ను త్వరలో విస్తరించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.. ముఖంగా వెడ్డింగ్ కలెక్షన్స్ లో పోటీ ధరలకు నాణ్యమైన వస్త్ర శ్రేణిని అందజేయడం తమ లక్ష్యమని చెప్పారు. తమ షో రూములో అన్ని తరాల కుటుంబ సభ్యుల అభిరుచులకు సరిపడే 4 లక్షల వెరైటీ లు లభిస్తున్నాయని ఆషాఢం కేజీ సేల్ ను ప్రారంభోత్సవ ఆఫర్‌గా అందజేస్తున్నామని తెలిపారు. తమ శారీ కలెక్షన్ లో అనేకా రకాల పట్టు చీరెలు ప్రత్యేకంగా ఉన్నాయని వీటిలో కంచిపట్టు, ధర్మవరం , అరణి,ఉప్పాడ, వెంకటగిరి , గద్వాల్, పోచం పల్లి, మహేశ్వరి, కోయంబత్తూరు, కోల్‌కతా, బెనారస్, ఇంకా హై ఫ్యాన్సీ శారీ వేరైటీ లు ,ప్యూర్ ఆర్గంజ్ , ప్యూర్ ఖాదీ జార్జెట్ , ఫ్లోరల్ ప్రింట్స్ బిన్నీ క్రేప్ సిల్క్ వంటి అనేక రకాలు లభిస్తున్నాయని, వివరించారు. అదేవిధంగా విస్తృతమైన రకాలకు చెందిన మెన్స్ వేర్ కిడ్స్ వేర్ , ఎత్నిక్ వేర్ తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలియ జేశారు. రానున్న పండగలు వివాహాది శుభ కార్యాల సీజన్ లకు అత్తాపూర్ వాసులు తమ మంగళ గౌరీ షాపింగ్ మాల్‌రే విచ్చేసి అద్భుతమైన ఆఫర్ల తో పాటు సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేయగలరని ఆకాంక్షించారు.

మానవ పరిణామ క్రమంలో సైన్స్ కీలక పాత్ర

- ప్రముఖ సాహితీవేత్త, సాంస్కృతిక, సామాజిక కార్యకర్త శాంతారావు
- గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సైన్స్-సమాజం' అనే అంశంపై శిక్షణా తరగతులు







నవతెలంగాణ-సిటీబ్యూరో

మానవ పరిణామక్రమం, సమాజాభివృద్ధిలోనూ సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ సాహితీవేత్త, సాంస్కృతిక, సామాజిక కార్యకర్త శాంతారావు అన్నారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'సైన్స్-సమాజం' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ సాంకేతికత అభివృద్ధి చెందే కొద్దీ మానవ సంబంధాలు నిర్వీర్యం అవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు మానవతను పెంపొందిస్తూనే సైన్స్ వ్యాప్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లల్లో భౌతిక, మానసిక, సాంఘికపరమైన ఆరోగ్యాన్ని పెంపొందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన విషయాన్ని శాంతారావు గుర్తు చేశారు. జీవితం నిరంతరం నేర్చుకునే ప్రక్రియ అని, కొత్త విషయం నేర్చుకోని రోజున మనం చచ్చిపోయినట్లే లెక్క అని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ కమిటీ గౌరవాధ్యక్షులు చంద్రశేఖరరావు మాట్లాడుతూ సైన్స్ ఫలితాలు పేదవారికి అందాలన్న లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక పనిచేస్తోందన్నారు. అశాస్త్రీయమైన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఆర్థిక అసమానతలు తలెత్తుతున్నాయని చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఆశయాలు, లక్ష్యాలు, సంఘ నిర్మాణం, పని పద్ధతుల గురించి గచ్చిబౌలి కమిటీ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ వివరించారు. పరిశీలన, ప్రతిపాదన, ప్రయోగం అన్న అంశాల ఆధారంగా జన విజ్ఞాన వేదిక సభ్యులు పనిచేయాలన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందింపజేయాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ఎలా ప్రచారం చేసుకోవాలో ముషీరాబాద్ కమిటీ అధ్యక్షులు అల్తాఫ్ వివరిం చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం.భరత్, ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు, గచ్చిబౌలి కమిటీ ప్రధాన కార్యదర్శి రాహుల్, ముషీరాబాద్ కమిటీ ప్రధాన కార్యదర్శి భీమేష్, కూకట్‌పల్లి జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అధ్యక్షులు శాంతి ఇశాన్, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్
తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్స్) చైర్మెన్‌గా బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె.శివసేన రెడ్డిని శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.వంశీచంద్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్
ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి దంపతులు, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహారెడ్డిలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్దాం

- ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ కార్యదర్శి మీసాల స్టాలిన్



నవతెలంగాణ-చైతన్యపురి
ఈ నెల 22వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఛలో కలెక్టరేటను విజయవంతం చేద్దామని ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ కార్యదర్శి మీసాల స్టాలిన్ అన్నారు. చైతన్య పురిలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల విద్యార్థులను కలిసి తెలంగాణ రాష్ట్రంలో 8,214 కోట్ల రూపాయల స్కాల ర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్లో ఉందని కర పత్రాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. విద్యారంగాన్ని కాపాడుతానని ప్రలోభాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పందించకపోవడం బాధా కరం అన్నారు. ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల సమస్యలు తీసుకుపోవడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సంధ్య, అరుణ్, మండల నాయకులు సాయి, వంశీ, నవీన్, ఉదయ్, రమేష్, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు.

టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే





నవతెలంగాణ - మీర్‌పేట్
మీర్‌పేట్ తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఐపీఎస్ అధికారి, మాజీ జెడి లక్ష్మీనారాయణ, టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మెన్ తీగల కృష్ణారెడ్డి, మాజీ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మెన్ తీగల అనితా హరినాథ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో కొన్ని విషయాలలో చాలా జాగ్రత్తగా ముందడుగు వేసినప్పుడే సక్సెస్ అవుతారని చెప్పారు. ముఖ్యంగా ఫిజికల్ హెల్త్, మెంటల్ హెల్త్ మీద కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మేము చదువుకున్నప్పుడు ఇప్పుడున్నటువంటి అవకాశాలు అప్పుడు లేవన్నారు. కానీ ఈరోజుల్లో స్మార్ట్ ఫోన్లలో ఇంటర్నెట్లను అనేక కొత్త విషయాలు రోజు రోజు అప్డేట్ అవుతూ ఉంటాయన్నారు. వాటన్నింటిని శోధించి ప్రతి విషయంలో పట్టు సాధించాలని సూచించారు. ఉదాహరణగా.. స్విగ్గి, జోమాటో, ఉబర్, ఓలా ఇవన్నీ కూడా ఎవరో ఒకరు కనిపెడితేనే వచ్చినవి అని పేర్కొన్నారు. ఉన్న సమయాన్ని వృధా చేయకుండా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి.. మీ తల్లీదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలంటూ పాదయాత్ర



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలంటూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గౌరెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గ్యార భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహాస్వామి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను అబ్దుల్లాపూర్ మెట్ తాజా, మాజీ ఎంపీపీ బుర్రరేఖ మహేందర్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భగవాన్ దాస్ మాట్లాడుతూ..ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి రావాలని 18 మందితో కూడిన గ్రామ కాంగ్రెస్ పార్టీ బృందం యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. పేదల అభివృద్ధి ప్రదాత ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి దిక్సూచి మల్ రెడ్డి రంగారెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డిలు ఇబ్రహీంపట్నం ప్రజాభిప్రాయం దృష్ట్యా మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గ్యార భగవాన్ దాస్, ఉపాధ్యక్షులు చెంచల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంచల అశోక్, హరి మోహన్ రెడ్డి, నెల్లూరు రాజు, చెంచల శ్రీనివాస్, గ్యార వీరస్వామి, చెంచల సురేష్, కుంట దర్శన్, చెంచల జంగయ్య, తోట్ల సురేష్, కిరణ్, కుమార్, బాల నరసింహ, బలవంత రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

నాసా సైన్స్ సెటిల్మెంట్‌లో
కర్మన్‌ఘాట్ శ్రీ చైతన్య విద్యార్థుల విజయం





నవతెలంగాణ-సంతోష్‌నగర్
కర్మన్‌ఘాట్ ప్రతిష్టాత్మకమైన స్పేస్ సెటిల్మెంట్ (నాసా) పోటీలలో కర్మన్ ఘాట్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల బృందం అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులకు స్థానిక పాఠశాల యందు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫతోష్, ఆర్ఐ రవీందర్ రెడ్డి, కో ఆర్డినేటర్ రఘునాథ్, ప్రిన్సిపాల్ ఫణి మాధవి, వైస్ ప్రిన్సిపాల్, డీన్ వెంకట రమణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లల్లో చోరీ..

- అసాంఘిక కార్యకలాపాలకు బీ బ్లాక్ అడ్డా
- ప్రమాదకరంగా మారిన డబుల్ ఇండ్లు
- ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు : కాలనీవాసులు





నవతెలంగాణ-హయత్‌నగర్
ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్‌లో ఉన్న ఎరుకల నాంచారమ్మ బస్తీ సర్వే నెంబర్ 5లో ఉన్న గల ఒక ఎకరం జాగలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో రెండు బ్లాక్‌లలో 288 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించారు. అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి 2020లో మొదటి బ్లాకులో మొదటి విడతలో భాగంగా అర్హులైన 154 మంది పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. మరి కొంత మందికి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విడతల వారీగా సుమారు 200మందికి పట్టాలు ఇచ్చారు. దాదాపు మొదటి బ్లాక్ అంతా నిండిపోయిందని చెప్పవచ్చు. ఇక బీ బ్లాక్ లో ఉన్న 77ఇండ్లు నిర్మించి దాదాపు 8 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ అమర్చిన విద్యుత్ వైర్లు, జనరేటర్, ఖాళీ గదులకు వేసిన తాళాలను సైతం పగుల గొట్టారు. కిటికీ అద్దాలు, డోర్ల్, స్విచ్ బోర్డులు, ముందస్తు అగ్ని ప్రమాదం సంభవించకుండా ఉంచిన పైపులు, లిఫ్ట్ సామానులు, గదుల్లో ఏర్పాటు చేసిన నల్లాలు మొదలగు గృహోపకరణాలకు ముందస్తుగా లబ్ధిదారులకు అందుబాటులో ఉంచిన తదితర వస్తువులు అపహరణకు గురైనాయి.

ఈ విషయంపై గతంలో హౌసింగ్, ఎల్బీనగర్ పోలీస్ అధికారులకు స్థానిక అధ్యక్షుడు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఖాళీగా ఉండే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న పరికరాలు అపహరణకు గురువుతున్నాయని చెప్పిన కూడా ఎవరు స్పందించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మరి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నాయకులు ఈ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లపై శ్రద్ధ చూపుతారో.. లేదో.. చూడాలి.

అసాంఘిక కార్యకలాపాలకు బీ బ్లాక్ అడ్డా

మన్సూరాబాద్‌లోని ఎరుకల నాంచారమ్మ బస్తీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో బీ బ్లాక్ నిర్మించి సుమారు ఎనిమిదేండ్లు గడిచినా ఇప్పటికి లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా బీ బ్లాక్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోయారు. రోజుకు ఒక్కసారి అయిన పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరినా.. వారు పెడచెవిన పెట్టడంతో చాలా మంది అకతాయిలతో పాటు ముఖ్యంగా మైనర్లు సైతం అపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని వారితో సహవాసం ఏర్పాటు చేసుకుని సిగరేట్ మాటున గంజాయి సేవిస్తున్నట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.



బాధ్యత లేని అధికారులపై చర్యలేవి..?

ఇది ప్రభుత్వ ఆస్తి అని.. దీనిని కాపాడలేక పోతున్నామని గతంలో స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, పోలీసులు, హౌసింగ్, రెవెన్యూ అధికారులకు కాలనీవాసులు చాలా సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదు. దీంతో సుమారు కోటీ మేర ఆస్తి అపహరణకు గురైందని కాలనీవాసులు చెబుతున్నారు. నాకెందుకులే అని నిమ్మకు నీరెత్తిన్నట్టు వ్యవహరించిన అధికారులపై ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో చూడాలి మరి.

బీ బ్లాక్‌ను స్థానికులకే కేటాయించాలని నిరసనలు

ఇక్కడ ఖాళీగా ఉన్న బీ బ్లాక్‌లో ఉన్న 77 ఇండ్లలో కనీసం 50శాతం ఇండ్లు స్థానికంగా దరఖాస్తు చేసుకుని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అర్హులైన పేదలకు పం చి ఇవ్వాలని గతంలో దరఖాస్తు చేసుకున్న బాధితులు అక్కడే టెంట్ వేసుకుని సుమారు10రోజుల పాటు నిరాహారదీక్ష లు,నిరసనలు తెలియజేశారు.కొందరు బయటి నుంచి అట్టి ఇండ్లను చూసు కోవడానికి వస్తే వారితో స్థానికులకు వాగ్వివాదం కూడా జరిగింది.

స్థానిక పేదలకే 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూం ఇండ్లను స్థానికంగా ఉన్న అర్హులైన పేదలకు మాత్రమే కేటాయించాలి. గత కొంతకాలంగా చాలా మంది అర్హులైన వారిని కాదని వేరే వారిని ఇక్కడికి తెచ్చి పెడితే ఊరుకునేది లేదు.

- కాలనీవాసి భీమనపల్లి స్వామి

పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలి

కొందరు తాగుబోతులు, గంజాయికి అలవాటు పడ్డవారు ఉండడం వలన వారిని అదుపు చేసేందుకు కష్టతరం అవుతుంది. ప్రతి రోజు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలి.

- కాలనీ అధ్యక్షుడు

ఆధారాలు లేవని పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు

స్థానిక అధ్యక్షుడు ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లలో పరికరాలు అపహరణకు గురైన విషయం నా దృష్టికి తీసుకొచ్చాడు. కానీ ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. అక్కడే ఉన్న వారు విద్యుత్ వైర్లు, ఫైరింగ్ వైర్లు, జనరేటర్‌లను పూర్తిగా నాశనం చేశారని తెలిసింది.

- హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్

నేడు కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ

- హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ శశాంక్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, లష్కర్‌గూడలో గ్రామంలో ఆదివారం గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు శనివారం అందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి హాజరై గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారని తెలిపారు. వారి వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



- డాక్టర్ సంతోష్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి
విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ సంతోష్ రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం చింతలకుంటలోని పల్లవి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సంతోష్ రెడ్డి హాజరై ప్రసంగించారు. మంచి ఆహారం, సరైన నిద్ర, వ్యాయామం చేయాలని విద్యార్థులకు సూచించారు. కాలినడకను ప్రతిరోజు మన పనులలో భాగం చేసుకోవాలి అన్నారు. అనంతరం జోన్ 3 జెడ్ఈఓ అంకమ్మరావు మాట్లాడుతూ భాష్యం విద్యా సంస విద్యార్థులకు చదువుతోపాటు అన్ని కలలను ప్రోత్సహిస్తుందన్నారు. తర్వాత విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పల్లవి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీ రమణ కాలనీ రోడ్ నంబర్ 8లో వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ రోడ్ల పై చెత్త, చెదారం, ఇతర వ్యర్థాలను పడేస్తున్నారని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకొని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వ్యర్థాల పట్ల కాలనీ వాసులకు అధికారులు అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం



జలుబు, దగ్గు ఇబ్బంది పెడుతున్నాయా?

ఈ సీజన్ లో దగ్గు జలుబు నుంచి ఉపశమనం కోసం ఈ హెర్బల్ టీలను ట్రై చేసి చూడండి..

తులసి టీలో ఔషధ గుణాలున్నాయి. ఈ టీ ఇన్ఫెక్షన్‌తో పోరాడుతుంది. కడుపులో మంటను తగ్గిస్తుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను కూడా కలిగి ఉంటుంది. ఇది మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

వర్షాకాలంలో రోజుకు ఒక్కసారైనా అల్లం టీ తాగండి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది జీర్ణక్రియ ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

వేడి పాలలో చిటికెడు పసుపు కలిపి తాగడం వలన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ డ్రింక్‌లోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి మిమ్మల్ని రక్షిస్తాయి.

లెమన్ టీ కూడా ఈ సీజన్ లో ఆరోగ్యానికి ఔషదం వంటిది. నిమ్మ, తేనె టీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ టీలో విటమిన్ సి, యాంటీ-మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి వర్షాకాలంలో ఇన్ఫెక్షన్లను దూరంగా ఉంచుతాయి.

పుదీనా టీ అజీర్ణాన్ని తగ్గిస్తుంది. ఈ సీజన్‌లో జలుబుకి మంచి మెడిసిన్.. అంతేకాదు వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి కూడా రక్షిస్తుంది. ఈ టీలో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

అమ్మ ఫిట్‌గా ఉంటేనే...

దీప్తి పీసపాటి... సివిల్ ఇంజనీరింగ్ చేసి కనస్ట్రక్షన్ రంగంలో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. పెండ్లయి ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత పిల్లలే ఆమె ప్రపంచమయ్యారు. పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత తన గురించి తాను ఆలోచించడం మొదలుపెట్టారు. ప్రసవం తర్వాత పెరిగిన బరువును తగ్గించుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. ఆ ప్రయత్నంలో ఉండగా మరెందరో తల్లులు గుర్తొచ్చారు. ఫిట్‌నెస్ పట్ల అవగాహన లేక ఎంతో మంది మహిళలు అధిక బరువుతో బాధపడడం గమనించారు. దానికి పరిష్కారంగానే నేవా ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

నేను పెట్టింది, పెరిగింది మొత్తం హైదరాబాద్. అమ్మ జ్యోతి వలబోజు, రచయిత, పబ్లిషర్. నాన్న గోవర్ధన్ సివిల్ ఇంజనీర్‌గా చేసి రిటైర్ అయ్యారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్లో ఏడో తరగతి వరకు చదువుకున్నాను. 8వ తరగతి నుండి పది వరకు నిజాంపేట్ విజ్ఞాన్ విద్యాలయ్‌లో పూర్తి చేశాను, నారాయణగూడ శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ చదివాను. తర్వాత సివిల్ ఇంజనీరింగ్ చేసి, కనస్ట్రక్షన్స్‌లో మాస్టర్స్ చేశాను. చదువు పూర్తి చేసిన తర్వాత ఫలక్‌నూమా ప్యాలెస్‌కు ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా చేశారు. తర్వాత తాజ్ కృష్ణలో కూడా చేశాను. అలాగే బేగంపేట్ తాజ్‌కు ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా చేశాను. పెండ్లి తర్వాత బెంగుళూరు వెళ్ళాను. అక్కడ కూడా కొంత కాలం పని చేసి పాప పుట్టడంతో తనని చూసుకోవడం కోసం కనస్ట్రషన్స్ వర్క్ వదిలేశారు. తర్వాత బాబు పుట్టాడు. ప్రస్తుతం మేము ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో ఉంటున్నాం.

టార్గెట్ పెట్టుకోలేదు...

మొదటి నుండి నాకు ఫిట్‌నెస్ అంటే చాలా ఇష్టం. అయితే పిల్లలు పుట్టిన తర్వాత బరువు పెరిగాను. ఇది ప్రతి మహిళ జీవితంలో సహజంగా జరిగేదే. పాప పుట్టినప్పుడు 30 కేజీలు పెరిగాను. బాబు పుట్టినప్పుడు 25 కేజీల వరకు పెరిగాను. పోస్ట్ ప్రెగ్నెన్సీ తర్వాత బరువు తగ్గాలనే ఆలోచన వచ్చింది. అయితే ఆరు నెలల్లో తగ్గాలి, ఏడాదిలో తగ్గాలని టార్గెట్ ఏమీ పెట్టుకోలేదు. బరువు తగ్గడం కోసం నేను చేసే ఎక్స్‌సైజ్ నా రొటీన్ జీవితంలో ఓ భాగం కావాలని అనుకున్నాను. ఎందుకంటే కొన్ని రోజులు చేసి వదిలేస్తే మళ్ళీ బరువు పెరుగుతాము. ఇది మరింత ప్రమాదం. అందుకే కాస్త ఆలస్యంగా తగ్గినా హెల్తీగా, ఫిట్‌గా ఉండాలనుకున్నాను. అందుకు అనుగుణంగా ప్లాన్ చేసుకున్నాను.



వీడియోలు చేసి ఫేస్‌బుక్, ఇనిస్టాగ్రామ్, యూట్యూబ్‌లో పెట్టేదాన్ని. వాటిని చూసిన తర్వాత చాలా మందిలో ఆసక్తి పెరిగింది. అలా నా దగ్గరకు ట్రైనింగ్‌కి వచ్చే వారి సంఖ్య కూడా మెల్లగా పెరిగింది. ఇప్పటి వరకు 500 మంది మహిళలకు ట్రైనింగ్ ఇచ్చాను.

అవగాహన అవసరం...

ఫిట్‌నెస్ కోసం కడుపు మాడ్చుకోవల్సిన అవసరం లేదు. హెల్తీ డైట్ తీసుకుంటూ బరువు తగ్గడం, ఫిట్‌గా ఉండడం గురించి ఆలోచించాను. బాబుకు ఏడాది నిండిన తర్వాత నా ప్రయత్నాని మొదలుపెట్టాను. ఇలా నేను ట్రై చేస్తున్నప్పుడు నాలాగే ఎంతో మంది మహిళలు తల్లులైన తర్వాత బరువు తగ్గేందుకు ప్రయత్నించడం, రిజల్ట్ రాక ఇబ్బంది పడడం గమనించాను. అందుకే మన జీవితంలో వ్యాయామం ఎంత అవసరమో మహిళలకు అవగాహన కల్పించాలనే నిర్ణయానికి వచ్చాను. దీని కోసం ఫిట్‌నెస్ ట్రైనింగ్ సెంటర్ పెట్టాలనుకున్నాను. వెంటనే దీనికి సంబంధించిన కోర్సుల్లో చేశారు. ఏడాదిన్నర పాటు ఫిట్‌నెస్ ట్రైనింగ్‌తో పాటు న్యూట్రిషియన్ కోర్సు కూడా చేశాను. ఎందుకంటే ఒక్క వ్యాయామాల గురించి చెబితే సరిపోదూ, దానికి తగ్గట్టు హెల్తీ డైట్ పాటిస్తే ఆరోగ్యంగా బరువు తగ్గగలుగుతాం.



నేవా ఫిట్‌నెస్ సెంటర్...

2018లో నేవా ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభించాను. మొదట్లో పెద్దగా ఎవరూ ఆసక్తి చూపలేదు. ఇప్పటికీ చాలా మంది మహిళలు వ్యాయామం అంటే బద్దకిస్తారు. అందుకే నేను మొదట సోషల్ మీడియాను ఉపయోగించుకున్నాను. వీడియోలు చేసి ఫేస్‌బుక్, ఇనిస్టాగ్రామ్, యూట్యూబ్‌లో పెట్టేదాన్ని. వాటిని చూసిన తర్వాత చాలా మందిలో ఆసక్తి పెరిగింది. అలా నా దగ్గరకు ట్రైనింగ్‌కి వచ్చే వారి సంఖ్య కూడా మెల్లగా పెరిగింది. ఇప్పటి వరకు 500 మంది మహిళలకు ట్రైనింగ్ ఇచ్చాను. వీరిలో ఎక్కువగా ఇక్కడికి వచ్చి సెటిల్ అయిన తెలుగువారే ఉన్నారు. హెూటల్స్, రకరకాల ఫుడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత తినడం బాగా పెరిగిపోయింది. దాంతో చాలా మంది బరువు పెరిగిపోతున్నారు. అందుకే ఈ మధ్య కాలంలో ఫిట్‌నెస్ పట్ల ప్రజల్లో ఆసక్తి పెరిగిపోయింది. ముఖ్యంగా కరోనా తర్వాత మరింత జాగ్రత్తగా ఉంటున్నారు.

ఫిట్‌నెస్ అంటే సన్నబడటం కాదు...

చాలా మంది పొట్ట తగ్గించుకొని సన్నగా కనిపించాలని కోరుకుంటారు. ఫిట్‌నెస్ అంటే ఇది కాదు. సన్నబడటం ముఖ్యం కాదు. ఆరోగ్యంగా, యాక్టివ్‌గా ఉండడం అవసరం. నా దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరికి నేను ఇదే చెబుతుంటాను. వ్యాయామం చేస్తే బోన్ హెల్త్ పెరుగుతుంది. వయసు పెరిగే కొద్ది మన మజిల్స్ కరిగిపోతుంటాయి. ఫలితంగా జాయింట్, మెడ, వెన్ను నొప్పితో పాటు బాడీ లూజ్‌గా అయిపోతుంటుంది. నడవలేకపోవడం, నీరసం, చిన్న విషయాలకే చిరాకు వస్తుంటుంది. దీని కోసం వాకింగ్‌తో పాటు చిన్న చిన్న వ్యాయామాలు చేయాలి. వ్యాయామంతో వీటన్నింటి నుండి బయటపడొచ్చు. వ్యాయామం, హెల్తీడైట్ మన రొటీన్ జీవితంలో భాగమైపోతే ఫిట్‌నెస్ దానంతట అదే వచ్చేస్తుంది.

మనం ఫిట్‌గా ఉంటేనే...

సాధారణంగా మహిళలు ఇంట్లో పనులు, పిల్లలు, భర్తను చూసుకోవడంతో అలసిపోతుంటారు. వారి ఆరోగ్యం గురించి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. ఇది అస్సలు మంచిది కాదు. మన గురించి మనం పట్టించుకుంటేనే ఏదైనా చేయగలం. అమ్మ ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు ఆరోగ్యంగా ఉంటుంది. అంటే ముందు మనం ఫిట్‌గా ఉండాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆరోగ్యంపై శ్రద్ధ తప్పక పెట్టాలి. వ్యాయామం వల్ల ఒక్క శరీరమే కాదు మానసిక ఆరోగ్యం కూడా మెరుగవుతుంది. పండ్లు బాగా తినాలి. అలాగే రోజుకు నాలుగు బాదాంలు తింటే మెదడుకు మంచిది. ప్రొటీన్ కచ్చితంగా తీసుకోవాలి. నూనె బాగా తగ్గించాలి. లేదంటే డీహైడ్రెట్, ఆయాసం వస్తుంది. అన్నీ తినాలి కానీ మితంగా తినాలి. బయట ఫుడ్, జంక్, డ్రింగ్స్, ఫ్రై చేసినవి పూర్తిగా మానుకోవాలి. మంచి నీళ్ల బాగా తాగాలి.

సాహస యాత్ర

మంచు వర్షం కురుస్తూనే ఉంది. దారిలో నాలుగు సార్లు స్లిప్ అయ్యాను. దెబ్బలు కూడా తగిలాయి. మూడో రోజు 24 కిలో మీటర్లు నడవాల్సి వచ్చింది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోతాయి. ఆ రోజు 12,13 గంటలు నడుస్తూనే ఉన్నాం.

ఈ మధ్యనే 12 మంది ఫ్రెండ్స్ కలిసి మౌంట్ కైలాష్ వెళ్ళి వచ్చాం. ఇది 15 రోజుల ప్లాన్. మెల్బోర్న్ నుండి ముందు చైనా వెళ్ళాం. అక్కడ నుండి టిబెట్. అక్కడ బుద్దిజంకు సంబంధించిన ఆరామాలు చూశాము. అలాగే బ్రహ్మపుత్ర రివర్ చూశాము. తర్వాత సాగా, అక్కడి నుండి మౌంట్ కైలాష్‌కు బయలుదేరాం. అక్కడ విపరీతమైన చలి. మొదటి రోజు 13 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళాం. దారి మొత్తం రాళ్ళు, మలుపులు తిరుగుతూ ఉంటుంది. నడవడం కాస్త ఇబ్బందిగా ఉన్నా సాయంత్రం లోపు చేరాము. టెంపరేచర్ మైనస్ 10 డిగ్రీలు ఉంది. మంచు వర్షం కురుస్తుంది. ఐస్‌పై నడవాల్సి వచ్చింది. రెండో రోజు 14 కిలో మీటర్లు నడిచాం. అది చాలా ఎత్తుగా ఉండటంతో అక్సిజన్ కూడా తగ్గిపోయింది. మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాం. మొత్తానికి చేరుకున్నాము. అక్కడ వ్యూ చాలా బాగుంది. ఇక తిరిగి వచ్చే టప్పుడు చాలా ఇబ్బంది అయ్యింది. మంచు వర్షం కురుస్తూనే ఉంది. దారిలో నాలుగు సార్లు స్లిప్ అయ్యాను. దెబ్బలు కూడా తగిలాయి. మూడో రోజు 24 కిలో మీటర్లు నడవాల్సి వచ్చింది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోతాయి. ఆ రోజు 12,13 గంటలు నడుస్తూనే ఉన్నాం. 4వ రోజు 7 కిలో మీటర్లు నడిచాం. తిరిగి ఎక్కడ స్టార్ట్ అయ్యామో అక్కడికి చేరుకున్నాం. తర్వాత నేపాల్ వెళ్ళాం. మూడు రోజులు అక్కడ ఉండి తిరిగి బెల్బోర్న్ వెళ్ళిపోయాము. సాహసంతో కూడిన ప్రయాణమైనా గొప్ప అనుభూతినిచ్చింది. మనం ఫిట్‌గా ఉంటే ఇలాంటి సాహస యాత్రలు ఎన్నో చేయవచ్చు.

- సలీమ



ఎల్జీకి మరిన్ని అధికారాలు

న్యూఢిల్లీ: జమ్ముూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోడీ సర్కారు మరొక వివాదానికి తెరలేపింది. కేంద్రపాలిత ప్రాంతం(యూటీ)లో లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) పరిపాలనా అధికారాల పరిధిని రెండవసారి ఎగ్జిక్యూటివ్ నోటిఫికేషన్ ద్వారా కొత్త నిబంధనలను ఏర్పాటు చేసి విస్తరించింది. దీంతో కేంద్ర పాలిత ప్రాంతంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం నిర్ణయంపై కొందరు నిపుణులు విమర్శలు చేస్తున్నారు. ఈనెల 12న కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఆలిండియా సర్వీస్ క్యాడర్, జమ్మూకాశ్మీర్ పోలీస్, కేంద్ర పాలిత ప్రాంతంలోని సీనియర్ బ్యూరోక్రసీ పనితీరుపై ఎల్జీ తుది నిర్ణయం తీసుకుంటారు. అలాగే, అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్స్, జైళ్లు, జమ్మూకాశ్మీర్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీని కూడా ఎల్జీ నియంత్రణలో ఉంటుంది. ఇంతకు ముందు, ఈ విధుల్లో కొన్నింటికి జమ్మూకాశ్మీర్ ఆర్థిక విభాగం సమ్మతి అవసరం.బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఎగ్జిక్యూటివ్ నోటిఫికేషన్ ద్వారా నిబంధనలను సవరించటం ఇది రెండోసారి. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019లోని సెక్షన్ 55 "మంత్రి మండలి సహాయం, సలహా"తో కొత్త నియమాలను రూపొందించటానికి ఎల్జీకి అధికారాన్నిస్తుంది. "అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలు, ఆలిండియా సర్వీసెస్ ఆఫీసర్ల క్యాడర్ పోస్టుల పోస్టింగ్, బదిలీకి సంబంధించిన విషయాలకు సంబంధించి, లెఫ్టినెంట్ గవర్నర్‌కు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ చీఫ్ సెక్రెటరీ ద్వారా ప్రతిపాదనను సమర్పించాలి" అని నోటిఫికేషన్ పేర్కొన్నది. అయితే, జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హెూదా కల్పించటం, అసెంబ్లీ ఎన్నికలు జరుతాయన్న అంచనాల నేపథ్యంలో ఎల్జీకి మరిన్ని అధికారాలను కట్టబెడుతూ కేంద్రం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేయటం ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని రాజ్యాంగ నిపుణులు కొందరు వాదిస్తున్నారు. జమ్మూ, కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వ విన్యాసాలు దేశ సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీస్తాయని కొందరు న్యాయ నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తీరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కేంద్రానికి ఉన్న రాజ్యాంగపరమైన సంబంధాలపై కూడా క్లిష్టమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అంటున్నారు. తాజా పరిణామం జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన వేదనను వ్యక్తం చేశారు. "జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయని మరొక సూచన. అందుకే జమ్మూకాశ్మీర్ కోసం పూర్తి, పలచబడని రాష్ట్ర హెూదా పునరుద్ధరణ కాలక్రమాన్ని నిర్దేశించే దృఢ నిబద్ధత ఈ ఎన్నికలకు అవసరం. తన ప్యూన్‌ను నియమించాలంటూ ఎల్జీని అడుక్కోవాల్సిన శక్తిలేని, రబ్బర్ స్టాంప్ సీఎం కంటే ప్రజలకు మంచి అర్హత ఉంది" అని ఆయన ట్వీట్ చేశారు.

హైదరాబాద్‌లో "గ్లోబల్ ఏఐ సదస్సు"

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సదస్సును ఈ ఏడాది సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సదస్సు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ

సాంకేతిక ఆవిష్కరణల రంగంలో మన రాష్ట్రాన్ని మరింత ముందంజలో ఉంచేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కృత్రిమ మేథా రంగ నిపుణులు, ఐటీ ఆవిష్కర్తలందరినీ ఈ సందర్భంగా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 'మేకింగ్ ఏఐ వర్క్ ఎవ్రీ వన్' అనే ఇతి వృత్తంతో ఈ ఏడాది సదస్సును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమాజానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో, ఎలా సాధికారత కల్పిస్తుందో అన్వేషించటమే లక్ష్యంగా ఈ సదస్సులో మేథోమథనం జరుగుతుందని చెప్పారు. దాదాపు రెండు వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, ప్రపంచంలో ఉన్న సవాళ్లను పరిష్కరించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా ఉపయోగ పడుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ రంగంలో తెలంగాణలో కొత్త ప్రాజెక్టులకు ఈ సదస్సు నాంది పలుకనుందని పేర్కొన్నారు. సదస్సుకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటాన్ అకౌంట్‌కు ఎంతోకొంత పెంచేద్దాం

పూర్తి స్థాయి బడ్జెట్‌పై ప్రభుత్వ వైఖరిదే

గత నెల 18 నుంచి వివిధ శాఖలతో సమావేశాలంటూ ప్రకటన

ఇప్పటి వరకూ రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖలతోనే సమీక్షలు

పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బిజీబిజీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మా ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను జులైలో ప్రవేశపెట్టబోతున్నాం. ఈనెల 18 నుంచి శాఖల వారీగా ప్రతిపాదనలు తీసుకుంటాం. ఇందుకోసం మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో క్రమం తప్పక సమావేశాలు నిర్వహిస్తాం...' దాదాపు నెల రోజుల కిందట ఆర్థికశాఖ నుంచి వెలువడిన ప్రకటన ఇది. అందులో చెప్పినట్టుగానే కొద్ది రోజులు పలువురు మంత్రులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. వ్యవసాయం, రెవెన్యూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్కతో సమాలోచనలు జరిపారు. వారి శాఖలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించారు..? వాటిలో ఎంత మొత్తం ఖర్చయింది..? ఇప్పుడు ఎంత మొత్తంలో నిధులు కావాలి...? అనే అంశాలపై కూలంకుశంగా చర్చించారు. ఆ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు మీడియాకు వివరాలను కూడా వెల్లడించారు.



కానీ ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు మినహా మిగతా ఏ ఒక్క శాఖ నుంచి కూడా ఆర్థిక శాఖ ప్రతిపాదనలను స్వీకరించలేదు. ఆయా మంత్రులతో సమావేశాలు నిర్వహించలేదు. దీంతో మిగతా డిపార్టుమెంట్ల ప్రతిపాదనలేంటి..? వాటికి ఎన్నేసి నిధులను కేటాయించబోతున్నారు..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈనెల 23న కేంద్రం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించనుంది. ఈ క్రమంలో ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకోకుండా, మీటింగులు నిర్వహించకుండా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు మూడు రోజులకే ఇక్కడెలా పద్దును ప్రవేశపెడతారనే సందేహాలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అక్కడి నుంచి వచ్చే ఆర్థిక సాయాలు, గ్రాంట్లు, ఇతర ప్యాకేజీలపై లెక్కలేసుకుని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఈ కసరత్తులు చేయటానికి కనీసం వారం నుంచి పది రోజులు పడుతుంది. ఇది ఎన్నో ఏండ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ. కానీ అందుకు భిన్నంగా ఇప్పుడు రెండు మూడు రోజుల వ్యవధితోనే పద్దును ప్రవేశపెట్టటం ఎలా సాధ్యం...? అంటూ ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వ వర్గాలను ఆరా తీయగా... 'మొన్న ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్‌కు ఓ ఐదు శాతమో, పది శాతమో పెంచి, ప్రతి శాఖకూ అదనంగా నిధులు కేటాయిస్తారు..ఆ కోవలోనే పద్దును రూపొందిచబోతున్నారు...' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... ఇటు పార్టీ, అటు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీబిజీగా ఉండటం, సమయం తక్కువగా ఉండటంతోనే మిగతా శాఖలు, మంత్రులతో సమావేశాలు నిర్వహించలేకపోయారని తెలిసింది.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు



(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ డ్రగ్స్, తదితర మహమ్మారిల నుంచి విద్యార్థులను దూరంగా ఉంచేందుకు మోరల్ పోలీసింగ్ ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వెంటనే విధి విధానాలను ఖరారు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. విద్యార్థి దశ నుంచే సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరముందన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రోత్సహించాలని విద్యాసంస్థలకు సూచించారు. పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చొచ్చని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండని విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చని పేర్కొన్నారు. సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారిందని చెప్పారు. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడమే కాకుండా చిన్నారుల మానసిక బలహీనతలను మొబైల్ ఫోన్లు కారణంగా భావిస్తున్నారని తెలిపారు. ఈ రుగ్మతలనుంచి వారిని దూరంగా ఉంచాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. భవిష్యత్‌లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. "విద్యార్థులు, యువత సమస్యలకు భయపడి పారిపోవద్దు. నిలబడి పోరాడాలి. జీవితంలో ఫోకస్‌గా పనిచేయండి. లక్ష్యాలను సాధిస్తారు. మోడీకైనా, బిల్ గేట్స్ కైనా, రేవంత్ రెడ్డికైనా రోజుకు 24 గంటలే. 16గంటలు మీరు ఎంత ఫోకస్‌గా పని చేస్తారో అది మీ లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుంది. మన జీవితం మన చేతుల్లోనే ఉంది. గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదు. ఎవరూ ఎవరికంటే తక్కువ కాదు" అని వారికి దిశా నిర్దేశం చేశారు.

బుస్..బుస్..

నవతెలంగాణ- జోగులాంబ గద్వాల



గురుకులాల్లో ఎలుకలు కోరికిన ఘటన మరువక ముందు..ఇపుడు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరిన మరుసటి రోజే ముగ్గురు విద్యార్థులు పాము కాటుకు గురయ్యారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు మధ్యాహ్నం మూత్ర విసర్జనకు బయటకు వెళ్లారు. వారిలో ముగ్గురిని పాము కాటేసింది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్న గోనపాడు గ్రామానికి చెందిన బాలుడు అనిల్ కుమార్, కేటి దొడ్డి మండలం తూర్పు తండాకు చెందిన సంతోష్ నాయక్, ఐజ మండలం తనగల గ్రామానికి చెందిన అర్జున్ కుమార్, గద్వాలకు చెందిన వీరేంద్రచార్యులను శుక్రవారం చైల్డ్ ప్రొటెక్షన్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టుకొని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో వదిలారు. ఈ నలుగురు విద్యార్థులు శనివారం మూత్ర విసర్జనకు వెళ్లారు. అక్కడ పాముకాటు గురి కావడంతో వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులు క్షేమంగానే ఉన్నట్టు వైద్యాధికారులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైండ్‌బ్లాక్..

(మొదటిపేజీ తరువాయి)

ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్ విజయం సాధించారు. తమిళనాడులోని విక్రావండిలో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ అలియాస్ శివషణ్ముగం ఘన విజయం సాధించారు. బీహార్‌లోని రూపౌలిలో స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ తన సమీప జేడీయూ అభ్యర్థి కళాధర్ ప్రసాద్ మండల్‌పై విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌లో 4, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఉత్తరాఖండ్‌లో 2, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లో ఒక్కో స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి.

వామపక్ష అభ్యర్థుల ఓట్ల వివరాలు

పశ్చిమ బెంగాల్‌లోని బాగ్దాలో ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి గౌర్ బిశ్వాస్‌కు 8,189 ఓట్లు లభించాయి. మానిక్‌తలాలో సీపీఐ (ఎం) అభ్యర్థి రాజీబ్ మజుందార్‌కు 9,502 ఓట్లు వచ్చాయి. రాణాఘట్ దక్షిణ్‌లో సీపీఐ (ఎం) అభ్యర్థి అరిందమ్ బిశ్వాస్‌కు 13,082 ఓట్లు లభించాయి. ఈ మూడు స్థానాల్లోనూ వామపక్ష అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. బైపోల్స్ ఫలితాలు చూసి బీజేపీ అవాక్కయింది. కమలం పార్టీ చేస్తున్న మత రాజకీయాలతో ఓటరు విసిగిపోయాడని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తననివాసంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరికెపూడితోపాటు పలువురు కార్పొరేటర్లు కూడా కండువా కప్పుకున్నారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్...సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో హస్తం పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య తొమ్మిదికి చేరింది.

యువ ఇంజినీర్ల ఉజ్వల భవిష్యత్‌కు
ఏస్ ఇంజినీరింగ్ బంగారు బాటలు



- విద్యార్థుల నైపుణ్యాల పెంపొందించటానికి ప్రత్యేక కార్యక్రమాలు
- కాలేజీలో చక్కటి మౌలిక సదుపాయాలు
- ఆకర్షణీయమైన ప్యాకేజీలతో పలు ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

యువ ఇంజినీర్లు తమ కలలను సాకారం చేసుకోవటానికి ఏస్ ఇంజినీరింగ్ కళాశాల తన వంత పాత్రను పోషిస్తున్నది. 2007లో ప్రారంభమైనప్పటి నుంచి.. ఏస్ కళాశాల అందరి సాధికారత కోసం విద్య మీదనే తన దృష్టిని పెట్టుబడిగా పెడుతున్నది. నాగరికతల రూపశిల్పులైన ఇంజినీర్లు సొసైటీలను తయారు చేస్తారు. ఇంజినీరింగ్ విద్యలో చేరిన ప్రతి విద్యార్థి కేవలం వృత్తిని ఆకాంక్షించే వ్యక్తి మాత్రమే కాదనీ.. వృత్తి పట్ల బాధ్యతను కలిగి ఉంటాడని ఏస్ విశ్వసి స్తున్నది. ఈ విషయంలో చక్కటి అవగాహనను కలిగి ఉన్న ఏస్.. విద్యార్థుల నైపు ణ్యాలను పెంపొందించి, కెరీర్‌లో విజయం సాధించే విధంగా స్కిల్-రీస్కిల్-అప్ స్కిల్లింగ్' మోడల్ బోధనను అనుసరించి అమలు చేసింది.

స్కిల్లింగ్ అకడమిక్స్

విద్యార్థులకు నైపుణ్యం కల్పించే ప్రక్రియ నిరంతరం జరిగే దృశ్యం. ఇది యూనివర్సిటీలో సూచించిన సిలబస్ ద్వారా ఇంజినీరింగ్ సబ్జెక్టులలో బలమైన ప్రాథమిక భావనలను రూపొందించటంపై దృష్టి సారించటం ద్వారా జరుగు తుంది. సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని(థియరెటికల్ నాలెడ్జ్) ఉపయోగించటం ద్వారా విద్యార్థులు తమ ప్రాక్టికల్ సెషన్‌లలో కాన్సెప్ట్‌ల పనితీరు, ఉద్దేశాన్ని గ్రహిస్తారు.

రీస్కిల్లింగ్ ఫర్ ఎంప్లాయబిలిటీ

విశ్వవిద్యాలయ పాఠ్య ప్రణాళికకు తగిన విధంగా విద్యార్థుల ప్రాధాన్యతా నైపుణ్యాలను పున:కల్పన(రీస్కిల్లింగ్) చేసే కఠినమైన శిక్షణ కార్యక్రమాలు కలిగి ఉంటాయి. వారికి ఉద్యోగ సన్నద్ధతను కల్పిస్తాయి. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలు అందించేలా సీతాకోకచిలుక అనే ఒక నవల శిక్షణా కార్యక్రమం రూపొందించారు.అదనంగా, ఐటీ రంగం వైపు కెరీర్‌ను ప్లాన్ చేస్తున్న విద్యార్థుల కోసం ప్రతి విద్యార్థికీ కాంపిటీటీవ్ కోడింగ్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారు. LEETCODE, HACKERRANK, HACKEREARTH, CODECHE వంటి మొదలైన ప్రజాదరణ పొందిన ప్లాట్‌ఫామ్‌లపై కాంపిటీటీవ్ కోడింగ్‌ను ప్రాక్టీస్ చేయటం కోసం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ మార్గనిర్దేశం చేస్తుంది. దీంతో వారు ఆన్‌లైన్ కోడింగ్ పోటీలో తట్టుకొని నిలబడగలరు.

చక్కటి మౌలిక సదుపాయాలు

కాలేజీలో చక్కటి మౌలిక సదుపాయాలున్నాయి. "ఏదైనా కళాశాల అభివృద్ధి చెందాలంటే చాలా చక్కటి మౌలిక సదుపాయాలు, బాగా శిక్షణ పొందిన, సమర్థులైన మానవ వనరులైన అధ్యాపకులు, శిక్షకుల బృందం కావాలి. మా కళాశాల ద్వారా వారి కెరీర్‌ను, అలాగే వారి అభిరుచులు కొనసాగించాలనుకునే విద్యార్థుల ఆకాంక్షలను, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే తల్లిదండ్రుల ఆశలనూ మేము అర్థం చేసుకున్నాం. వీరిని దృష్టిలో ఉంచుకొని అన్ని చర్యలూ తీసుకున్నాం. భారీ మౌలిక వసతుల కల్పనలో పెట్టుబడి పెట్టాం. ట్రేడింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో నైపుణ్యాలను అందించటానికి నవీనమైన సుశిక్షితులైన అధ్యాపకుల అవసరం కూడా మాకు తెలుసు" అని ఏస్ ఇంజినీరింగ్ కళాశాల జనరల్ సెక్రెటరీ వై.వి గోపాల కృష్ణమూర్తి అన్నారు.

మౌలిక సదుపాయాలు

- 300 నెట్‌వర్క్ కంప్యూటింగ్ సౌకర్యంతో ప్రత్యేకమైన శిక్షణ మరియు ప్లేస్‌మెంట్ సెల్
- క్యాంపస్, పూల్ డ్రైవ్‌లతో సహా కార్యక్రమాలు, మధ్యస్థ స్థాయి సమావేశాలను నిర్వహించటం కోసం 600 సామర్థ్యం కలిగిన సెమినార్ హాల్
- అత్యాధునిక సౌకర్యాలతో 1000 కెపాసిటీ గల ఆడిటోరియం
- హైలీ ఆటోమేటెడ్ ఫుడ్ ప్రిపరేషన్ సదుపాయాలతో కూడిన క్యాంటీన్
- అంతర్జాతీయ పరిశోధనా పత్రికల సబ్‌స్క్రిప్షన్‌తో ఏర్పాటు చేసిన లైబ్రరీ
- స్మార్ట్ క్లాస్‌రూములు

అవగాహన ఒప్పందాలు

- ఏటి అండ్ ఎంఎల్‌లో టెక్నాలజీ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం
- అధ్యాపకులు, విద్యార్థుల శిక్షణ కోసం ఎంఎస్ అప్లైడ్ ఏఐ ప్రయివేటు లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం
- ఏఐ అండ్ ఎంఎల్‌కు ఎంఎస్ బ్రెయిన్ ఓ విజన్‌తో అవగాహన ఒప్పందం ప్లేస్‌మెంట్‌లో విజయం

నియామకాలు:

- 100 ప్లస్ కంపెనీలతో 2023-2024 సీజన్‌లో 1100 ప్లస్ ప్లేస్‌మెంట్లు.
- రూ.4.5 నుంచి రూ.6 లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో 170 ప్లస్ మంది విద్యార్థులు యశ్వంతరక్షు ఎంపికయ్యారు.
- స్టైపెండ్/ఆర్థిక మద్దతుతో ప్రసిద్ధ కంపెనీలలో ఇంటర్న్‌షిప్‌లు. అవి పూర్తయిన తర్వాత, విద్యార్థులకు కంపెనీలలో ఉద్యోగాలు ఇస్తారు.
- అత్యధిక ప్యాకేజీ రూ. 17.8 ఎల్‌పీఏ, సగటు ప్యాకేజీ రూ. 4.5 ఎల్‌పీఏ
- CISCO, Accenture,TCS, Wipro, Cognizant, Infosys,Tech Mahindra, Mphasis, Techigai, Capgemini, Hexaware, Deloitte, Salesforce, MAINTEC, 24/7.AI వంటి ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు...

ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ.. "కళాశాల విద్యార్థుల పరిశ్రమ సంసిద్ధత కోసం ఐటీస్కై పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం కోసం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి, రెండో, మూడో ఏడాది విద్యార్థుల కోసం VIHAAN&ARJUNA ప్రోగ్రామ్ కింద తాజా సాంకేతికతలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేయటానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కళాశాల అభివృద్ధి చేసింది. కళాశాల AI/ML,IoT మొదలైన రంగాలలో వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. విద్యార్థుల ప్రయోగాలు, ప్రాజెక్టులను చేయడానికి ఫినిషింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసింది. కళాశాల ఈకోసిస్టమ్‌తో కలిసి కలిసి రాష్ట్ర స్థాయి హ్యాకథాన్ పోటీని కూడా నిర్వహించింది. కళాశాలకు స్వయంప్రతిపత్తి మంజూరు చేయబడటంతో మరింత సౌలభ్యం, ప్రభావంతో నిర్వహించడం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. నైతిక, సామాజిక నైపుణ్యాలను అందించటం ఏస్‌లోని విద్యార్థుల్లో అంతర్భాగంగా ఉంటాయి" అని అన్నారు. కళాశాలకు అటానమస్ హోదాను మంజూరు చేసినందుకు ప్రొఫెసర్ మూర్తి యూజీసీ మరియు జేఎన్‌టీయూలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, ఏస్‌లో నాణ్యమైన విద్య కోసం తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు.

ఇంజినీరింగ్ విద్యలో
అగ్రగామి సెయింట్ మార్టిన్స్



- 15 ఎకరాల సువిశాలమైన క్యాంపస్.
- 100 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్..
- ప్రముఖ సంస్థలతో ఎంఓయు.
- ఈఏపీసెట్ కోడ్ MRTN

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటితరం విద్యార్థులకు ఉత్తమమైన ఇంజినీరింగ్ విద్యను అందించే విద్యా సంస్థ సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల పేరుగాంచింది. ఈ కళాశాలను 2002లో దూలపల్లిలో స్థాపించారు. సెయింట్ మార్టిన్స్ చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ సొసైటీగా ఏర్పడ్డ ఈ సంస్థలో 42 మంది విద్యార్థులతో ప్రారంభమై అంచలం చలుగా ఎదుగుతూ రాష్ట్రం నలువైపుల పలు శాఖలతో విస్తరించి 10,000 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించే సంస్థగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం 6 యూజీ ప్రోగ్రాంలతో పాటు ఒక పీజీ ప్రోగ్రామ్తో విద్యార్థులకు విశిష్ట సేవలందిస్తుంది. ఇంజినీరింగ్ కాలేజీలలో (న్యాక్-ఎం) తెలంగాణలో మొదట అందుకున్న ఘనత సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలకే దక్కుతుంది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) కూడా ఆమోదించింది. ఈ సంస్థ జేఎన్‌టీయూ హైదరాబాద్ అనుబంధంగా ఉంది. ఐఎస్ఓ 9001:2008 సర్టిఫికెట్ పొందిన సంస్థ. 15 ఎకరాల సువిశాలమైన క్యాంపస్‌లను పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించారు. సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల అనేక ప్రత్యేకతలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తుంది. 2024 విద్యా సంవత్సరంలో ప్లేస్మెంట్లలో అత్యధిక ప్యాకేజ్ సాధించి... నూరు శాతం ప్లేస్మెంట్స్ కల్పించిన సంస్థగా పేరుగాంచింది. మొత్తం 1168 మంది విద్యార్థులకు ప్లేస్మెంట్లు దక్కాయి.

విద్యార్థుల తల్లిదండ్రుల ఇష్టాన్ని గౌరవిస్తూ, పిల్లల అభిరుచులకు అనుగుణంగా అద్భుతమైన తరాన్ని నిర్మించడానికి ఒక ప్రత్యేక దృష్టి సారించింది. విలువలు లేని నేటి యుగంలో మంచి నాణ్యమైన విద్యను అందిస్తూ నాలుగు శాఖలుగా రూపాంతరం చెందింది.

ఉపాధి అవకాశాల కేంద్రంగా సెయింట్ మార్టిన్స్ కళాశాల

నాణ్యమైన విద్యతో ఉద్యోగ అవకాశాలు

నైపుణ్యాలు కలిగి కాంపిటేషన్‌ను తట్టుకుని నిలబడే శక్తి సామర్థ్యాలను ఇక్కడి విద్యార్థులకు అందిస్తున్నారు. సమర్థులైన ఇంజినీర్లను తీర్చిదిద్ది సమాజంలో వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు బాటలు వేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్లేస్మెంట్లలో అత్యధికంగా 1168 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఏకైక విద్యాసంస్థ సెయింట్ మార్టిన్ అని చెప్పాలి. బెస్ట్ ప్లేస్ మెంట్ అవార్డును సైతం సొంతం చేసుకుంది, కళాశాలకు యూజీసీనీ అటానమస్ స్టేటస్ గుర్తింపు లభించింది. ఏటా వెలువడే ఇంజినీరింగ్, ఫలితాల్లో సెయింట్ మార్టిన్స్ విద్యాసంస్థ తమ సత్తా చాటుతున్నాయి

ఉన్నత చదువులతో చక్కటి విలువలు కలిగిన ప్యాకేజీతో విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలు కలిగిన చదువులను అందించడం ద్వారా, ఇక్కడి విద్యార్థులకు చక్కటి ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. విద్యార్థుల అభిరు చులకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంతోపాటు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో సెయింట్ మార్టిన్స్ కళాశాల ముందంజలో నిలుస్తుంది.



కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు

బీటెక్:-

- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్.
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఏఐ&ఎం ఎల్)
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(డి ఎస్)
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్.
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్. కోర్సులు కళాశాలలో అందుబాటులో కలవు.

అధునాతన ప్రయోగశాలలు



సువిశాలమైన కళాశాలలో అధునాతన సౌకర్యాలు కలిగిన ప్రయోగ శాలలు విద్యార్థుల ఇంజినీరింగ్‌లో ప్రత్యేక సత్తా చాటేందుకు ఎంతో దోహద పడుతున్నాయి. విశాలమైన క్రీడా స్థలాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలతోపాటు సెమినార్ హాళ్లు కళాశాలలో కలవు.

విద్య ప్రమాణాలు కలిగిన చదువులను అందించడం ద్వారా, ఇక్కడి విద్యార్థులకు చక్కటి ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. విద్యార్థుల అభిరు చులకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంతోపాటు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో సెయింట్ మార్టిన్స్ ముందంజలో ఉంది. ఈ కళాశాల ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రుల మనసు దురగొంది. ఇక్కడ చదివిన విద్యార్థులు పలు రంగాలలో, వివిధ దేశాల్లో స్థిరపడ్డారు..

కళాశాల ప్రత్యేకతలు

- అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ.
- సువిశాలమైనటువంటి క్యాంపస్.
- క్యాంపస్ ప్లేస్మెంట్ లలో అగ్రగామి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గీతకార్మికులకు కాటమయ్య 'రక్ష' కిట్లు

- నేడు అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం రేవంత్ శ్రీకారం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఈదులు, తాళ్లు ఎక్కి కల్లు గీసే గీత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. 'కాటమయ్య రక్ష' పేర దీన్ని అమలుచేయనుంది. ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో సేఫ్టీ కిట్లను గీతకార్మికులకు అందించనుంది. ఈ కిట్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు చేపట్టనున్నారు. గీతకార్మికులతో సమావేశం అనంతరం అక్కడే వారితో కలిసి సీఎం సహపంక్తి భోజనం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గీతకార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న విషయం విదితమే. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను హైదరాబాద్ ఐఐటీతో కలిసి ఓ ప్రయివేటు సంస్థ రూపొందించింది. గీత కార్మికులు సులువుగా తాటి చెట్లను ఎక్కేలా ఈ కిట్లను తయారుచేశారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు. ఒక్కో కిట్‌లో మొత్తం ఆరు పరికరాలు ఉంటాయి. తాడు, క్లిప్పులు, హ్యాండిళ్లు, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే, యూజర్ ఫ్రెండ్లీగా ఈ పరికరాలు ఉంటాయని శనివారం సీపీఆర్వో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

పెద్ద చెరువులో 16అడుగులకు చేరుకున్న నీటిమట్టం

నవతెలంగాణ-బయ్యారం

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బయ్యారం పెద్ద చెరువులోకి మసివాగు, పంది పంపుల వాగుల నుంచి భారీగా వరద నీరు చేరడంతో శనివారం బయ్యారం పెద్ద చెరువు నీటిమట్టం 16అడుగులకు చేరుకున్నది. ఇంకో అర అడుగు నీటి మట్టం పెరిగితే చెరువు మత్తడి పోయనుంది. పెద్ద చెరువుకు భారీగా వరద నీరు వస్తుండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం కల్లా బయ్యారం పెద్ద చెరువు మత్తడి పోసే అవకాశం ఉన్నది.

కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

- నెల రోజులపాటు ఓవరాలింగ్ పనులు

నవతెలంగాణ-గణపురం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(కేటీపీపీ) మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. జెన్కో అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ప్రాజెక్టులో ఓవరాలింగ్ పనులు చేస్తారు. అధికారుల ఆదేశాలు రావడంతో 500మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి ఓవరాలింగ్ పనులు ప్రారంభించారు. దాదాపు నెల రోజులపాటు ఉత్పత్తి ఆగనుంది. ప్రాజెక్టులోని బాయిలర్. టర్బైన్, గ్రిడ్ విడిభాగాల యాడ్ ఫాంట్, వాటర్ ప్లాంట్ తదితర పనులను ఓవరాలింగ్ చేయనున్నారు.

హెచ్‌సీఎల్‌లో తగ్గిన 8వేల మంది ఉద్యోగులు



బెంగళూరు : ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీలో భారీగా ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఏకంగా 8,080 మంది ఉద్యోగులు తగ్గారు. దీంతో జూన్ ముగింపు నాటికి ఆ సంస్థలో మొత్తం సిబ్బంది నికర సంఖ్య 2,19,401గా నమోదయ్యింది. సంస్థ ఎదుర్కొన్న కొన్ని అనిశ్చిత్తుల వల్ల కొంత మంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందని హెచ్‌సీఎల్ టెక్నాలజీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామచంద్రన్ సుందరరాజన్ పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో పెట్టుబడులు, నియామకాలపై దృష్టి సారిస్తామన్నారు. గడిచిన త్రైమాసికంలో కొత్తగా 1078 మంది ఫ్రెషర్స్‌ను తీసుకున్నామన్నారు. ప్రత్యర్థి టెక్ దిగ్గజం టీసీఎస్ గడిచిన క్యూ1లో కొత్తగా 5452 మంది ఉద్యోగులను తీసుకోవడంతో సిబ్బంది సంఖ్య 6,06,998కి చేరింది.

డిమార్ట్ లాభాల్లో 17.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ రిటైల్ చెయిన్ డిమార్ట్‌కు చెందిన మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ నికర లాభాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 17.45 శాతం వృద్ధితో రూ.773.68 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.658.71 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.11,865 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ1లో 18.57 శాతం పెరిగి 14,069 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం వ్యయం 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరింది. గడిచిన త్రైమాసికంలో కొత్తగా ఆరు శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం అవుట్‌లెట్‌ల సంఖ్య 371కి చేరినట్లు వెల్లడించింది.

ఏజెన్సీలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రి ప్రారంభం

- ఐదు గ్రామాలకు అందుబాటులో ఈ ఆస్పత్రి : పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





నవతెలంగాణ-తాడ్వాయి

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రి (ఆరోగ్య ఉప కేంద్రం)ని ఏర్పాటు చేశామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆస్పత్రిని శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ మారుమూల ప్రాంతంలోని గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని, ఆరోగ్య సమస్యలు వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు పడకల కోసం సుమారు రూ.7 లక్షలతో దీన్ని రూపొందించామని, హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి పోచాపూర్ గ్రామంలో పెట్టామని చెప్పారు. ఈ కంటైనర్ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స నిమిత్తం నాలుగు బెడ్స్, మందులు ఏర్పాటు చేశామని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త విధులు నిర్వర్తిస్తారని అన్నారు. అనంతరం పోచాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐదు గ్రామాల పరిధిలో కొంత మంది పోడు భూములకు పట్టాలు రాలేదని, పట్టాలు ఇవ్వాలని స్థానిక నాయకుడు మంకిడి ప్రశాంత్ మంత్రికి వివరించారు. కొడిశల పీహెచ్‌సీలో వైద్యులు ప్రతి రోజూ విధులకు హాజరయ్యేలా చూడాలని, గత ప్రభుత్వంలో రోడ్లు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని, వాటిని వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించి.. సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్‌తో కలిసి పోచాపూర్‌లోని మినీ గురుకులాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ప్రత్యేక అధికారి అల్లెం అప్పయ్య, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో సుమన వాణి, ములుగు ఎన్పీడీసీఎల్ డీఈ పులుసం నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట

త్వరలో అమరవీరుల కుటుంబాలకు 25 వేల పెన్షన్

- 250 గజాల స్థలం కోసం ఎంపిక కార్యక్రమం : బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రతి నియోజకవర్గంలో 80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని, త్వరలో అమర వీరుల కుటుంబాలకు రూ.25వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో నల్లగొండ-హైదరాబాద్‌కు ఏసీ బస్సు, నాలుగు డీలక్స్ బస్సులు, పల్లెవెలుగు బస్సులను ప్రారంభించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ భవన్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహాలను రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. మహిళలను తక్కువగా చూడటం.. మూఢనమ్మకాలు ఉన్న సమయంలోనే సావిత్రిబాయి పూలే మహిళల చదువు కోసం ఎంతో కృషి చేశారని, పాఠశాలలను స్థాపించారని చెప్పారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. బీసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసిందన్నారు. రాబోయే కాలంలో బలహీనవర్గాలకు మంచి జరగాలన్న ఆలోచనతో కుల గణన చేపట్టేందుకు నిర్ణయించా మని, అలాగే రూ.150 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, గత ప్రభుత్వ హయాంలో ఉన్న బకాయిలను దశలవారీగా తీరుస్తున్నామని చెప్పారు. ఇటీవల గురుకులాల్లో 6000 మందితో శాశ్వత నియామకాలు చేపట్టామన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లో బీసీల నుంచి 4,500 మంది ఎంపికయ్యారని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు 25వేల రూపాయల పెన్షన్ త్వరలోనే ప్రభుత్వం ఇవ్వనుందని, అదేవిధంగా 250 గజాల స్థలానికి సంబంధించి ఎంపిక కార్యక్రమం త్వరలోనే చేపట్టనున్నట్టు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి సహకారం అందించే విషయంపై మంత్రివర్గంలో చర్చించనున్నట్టు చెప్పారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ రూ.80 కోట్లతో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మిస్తామని చెప్పారు. నల్లగొండ ఎస్ఎల్బీసీ కాలనీ వద్ద ఈ హాస్టల్ నిర్మిస్తామని,చదువుతోనే అభివృద్ధి సాధ్యమవు తుందని అన్నారు.మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు, ఆదర్శాలకనుగుణంగా అందరూ పని చేయాలన్నారు. జిల్లాలో బీసీ గురుకులాలు,సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి, ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.కోటి 20 లక్షలు మంజూరు చేస్తామన్నారు.జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షు చక్రధర్ రామరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బాగోని రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు అన్న క్యాంటీన్లు

- సీఎం చంద్రబాబు నాయుడు

గుంటూరు : హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని గోకుల క్షేత్రం శ్రీవెంకటేశ్వర ఆలయంలో అనంత శేష స్థాపన కార్యక్రమంలో శనివారం సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లకు భోజన సరఫరా కూడా గతంలో అక్షయపాత్రకే అప్పగించామని తెలిపారు. భోజన నాణ్యతలో ఒక్క ఫిర్యాదూ లేకుండా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేశారన్నారు. సమాజంలో మంచి చేసే వారికి స్పీడ్ బ్రేకర్లు ఉండవని, వారికి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, మంత్రులు ఎస్ సవిత, పి నారాయణ, నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ చేతికి ఎంటిఎన్ఎల్ కార్యకలాపాలు..!

- ఇరు సంస్థల విలీనంపై వెనుకడుగు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెల్కోలు బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌ల విలీన ప్రతిపాదనపై కేంద్రం వెనక్కి తగ్గిందని సమాచారం. ఎంటిఎన్ఎల్‌కు ఉన్న భారీ అప్పులే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా.. ప్రస్తుతానికి విలీన అంశాన్ని పక్కనపెట్టి ఎంటిఎన్ఎల్ కార్యకలాపాలను బిఎస్ఎన్ఎల్‌కు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం కీలకంగా పరిశీలిస్తోందని వెల్లడించాయి. ఈ ప్రతిపాదనను తొలుత సెక్రటరీల కమిటీ ముందు ఉంచి ఆ తర్వాత కేబినెట్ ఆమోదానికి పంపించనున్నారు. అయితే దీనికి ఒక నెల రోజుల సమయం పట్టొచ్చని సమాచారం. అప్పుల్లో ఉన్న ఎంటిఎన్ఎల్‌ను బిఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సరైందని కాదని కేంద్రం భావిస్తోంది.

ఎంటిఎన్ఎల్ ప్రస్తుతం ఢిల్లీ, ముంబయి నగరాల్లో మాత్రమే కార్యకలాపాలు కలిగి ఉంది. ఈ రెండు నగరాలు మినహా దేశమంతటా బిఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తుంది. ఈ ఏడాది జులై 20కి బాండ్ హోల్డర్లకు చెల్లించాల్సిన వడ్డీ చెల్లింపులకూ నిధుల కొరతను ఎదుర్కొంటుంది. 2023 ముగింపు నాటికి 46 లక్షల మంది వినియోగదారులుండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 41 లక్షలకు తగ్గింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎంటిఎన్ఎల్ రూ.3,303 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది రూ.2,911 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.862 కోట్లుగా ఉండగా.. 2023-24లో నష్టాలు 15 శాతం తగ్గి రూ.728 కోట్లుగా నమోదయ్యాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఎంటిఎన్ఎల్ రూ.25,795 కోట్లుగా ఉన్నాయి.

రాబర్ట్ రవికి బిఎస్ఎన్ఎల్ బాధ్యతలు..!

బిఎస్ఎన్ఎల్ ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పికె పుర్వర్ పదవీ కాలం పెంపునకు డిపార్టుమెంట్ ఆఫ్ టెలికం (డిఒటి) శాఖ నిరాకరించింది. డిఒటి సీనియర్ టెలికం ఆఫీసర్ డిడిజి రాబర్ట్ జె రవికి అదనపు బాధ్యతలు అప్పగించనున్నారని సమాచారం. పుర్వర్ 2019లో సిఎండి బాధ్యతలను స్వీకరించారు. పదవీకాలం కోసం ఆయన పెట్టుకున్న దరఖాస్తును డిఒటి పక్కన పెట్టిందని తెలుస్తోంది. టెలికం సర్వీసు ఆఫీసర్‌గా రవికి 34 ఏళ్ల విశేష అనుభవం ఉంది. డిఒటి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. బిఎస్ఎన్ఎల్‌లోనూ ఆరేళ్ల పాటు అడిషనల్ జనరల్ మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

బిఎస్ఎన్ఎల్ రూ.107 చౌక ప్లాన్

ప్రయివేటు టెల్కోలు ఇటీవల భారీగా టారీఫ్‌లను పెంచిన వేళ బిఎస్ఎన్ఎల్ మాత్రం తన వినియోగదారులపై భారం మోపకుండా చౌక ప్లాన్లను ఆఫర్ చేస్తోంది. 35 రోజుల గడువుతో రూ.107కే రీచార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ కింద 200 నిమిషాలు ఏ నెట్‌వర్క్‌కైనా మాట్లాడుకోవడానికి వీలుంది. అదే విధంగా 3జిబి ఉచిత డాటాను అందిస్తుంది. ఇటీవల ప్రయివేటు టెల్కోలు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తమ టారీఫ్‌లను 25 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. కాగా.. జియో 28 రోజుల కాలపరిమితి ప్లాన్‌కు కనీసం టారీఫ్‌ను రూ.189గా నిర్ణయించింది. ఇందులో అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, 2జిబి డాటాను అందిస్తుంది. ఎయిర్‌టెల్ బేసిక్ ప్లాన్ రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్ 28 రోజుల గడువుతో ఉంది. వొడాఫోన్ ఐడియా 28 రోజుల కాలపరిమితితో రూ.199 ప్రీపెయిడ్ రీచార్జి ప్లాన్‌ను అందిస్తుంది. వీటితో పోల్చితే బిఎస్ఎన్ఎల్ చౌక ప్లాన్‌గా వినియోగదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన నగరాల్లో 4జి సేవలు అందిస్తున్న బిఎస్ఎన్ఎల్ ఆగస్ట్ చివరి నాటికి దేశ వ్యాప్తంగా విస్తరించాలని నిర్దేశించుకుంది.

బాలిక మృతదేహం కోసం సంగమేశ్వరం వద్ద గాలింపు



పగిద్యాల : నంద్యాల జిల్లా పగిద్యాల మండలం ఎల్లాల గ్రామంలో హత్యకు గురైన బాలిక మృతదేహం నేటికీ లభ్యం కాలేదు. ఐదు రోజులవుతున్న ఆచూకీ లభించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులైన ముగ్గురు బాలురు చెప్పిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కెసి కెనాల్, వనుములపాడు గ్రామ సమీపాన నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలను స్వయంగా ఎస్‌పి, జిల్లా కలెక్టర్ పర్యవేక్షించినా బాలిక మృతదేహం లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ముట్టడించారు. 'మా అమ్మాయి మృతదేహాన్ని మాకు అప్పజెప్పండి" అంటూ పోలీసులను కోరారు. ఈ నేపథ్యంలో నిందితులను పోలీసులు మరోసారి విచారించారు. సంగమేశ్వరం వద్ద మృతదేహాన్ని పడేశామని చెప్పడంతో పోలీసులు అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు.

మూడు బోట్లు, పాత ఎల్లాల సమీపాన మరో మూడు బోట్ల ద్వారా రెస్క్యూ టీమ్‌లు గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే ఎల్లాల గ్రామం పరిసరాల్లోనూ జల్లెడ పట్టాయి. త్వరలో మృతదేహాన్ని కనుగొంటామని పోలీసులు చెబుతున్నారు. నిందితుల కుటుంబసభ్యులను రెండు రోజులుగా పోలీసులు విచారిస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యమే : ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఐదురోజులైనా బాలిక మృతదేహం లభ్యం కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైసిపి కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. బాలిక కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. చిన్నారి హత్యపై హోం మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆమె మాటలకే పరిమితమయ్యారని, బాధిత కుటుంబసభ్యులను కనీసం పరామర్శించలేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

తనిఖీలు చేస్తూ.. వేగం పెంచుతూ...

వడివడిగా 'కాళోజీ కళాక్షేత్రం' పనులు

సెప్టెంబర్ 9న ప్రారంభోత్సవానికి సన్నాహాలు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రవీంద్రభారతిని తలదన్నేలా కాళోజీ కళాక్షేత్రాన్ని ఆరు నెలల్లోనే నిర్మిస్తామని నాటి సీఎం కేసీఆర్ ప్రకటించారు తప్ప పూర్తిచేయలేకపోయారు. హన్మకొండలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి 2014 సెప్టెంబర్ 9 అంటే కాళోజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సెప్టెంబర్ 9తో పదేండ్లు పూర్తి అవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో కళాక్షేత్ర నిర్మాణంపై దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9 కల్లా కళాక్షేత్రాన్ని పూర్తి చేసి ప్రారంభించడానికి అధికారులు వడివడిగా పనులు చేస్తున్నారు. కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా ప్రారంభించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏదేమైనా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కళాక్షేత్రాన్ని పూర్తిచేయకపోవడం విమర్శలకు తావిచ్చింది.

హన్మకొండ జిల్లా కేంద్రంలోని 'కుడా' మైదానంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి తొలుత అంచనా వ్యయం రూ.15 కోట్లు కాగా, అనంతరం రూ.30 కోట్లకు పెంచారు. తీవ్ర జాప్యంతో ఈ కళాక్షేత్రం అంచనా వ్యయం రూ.85 కోట్లకు పెరిగింది. భవన డిజైనింగ్‌ను ఖరారు చేయడానికే 7-8 నెలలు పట్టింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) నిధులను కేటాయించింది. ఈ నేపథ్యంలో పనులు ప్రారంభించినా.. అనంతరం కరోనా వైరస్ వ్యాప్తితో ఏడాదిన్నరపాటు పనులు నిలిచిపోయాయి. అనంతరం పనులు మందకోడిగా ప్రారంభమయ్యాయి.

ఆర్లీ విమానాశ్రయం మోడల్‌గా..

ఫ్రాన్స్ దేశపు ఆర్లీ విమానాశ్రయం మోడల్‌లో కాళోజీ కళాక్షేత్రానికి ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్ సొరబ్ డిజైన్‌ను రూపొందించారు. 4.5 ఎకరాల ప్రాంగణంలో 12,990 చదరపు మీటర్లలో (32 వేల చదరపు అడుగులు), నాలుగంతస్తుల్లో ఈ కళాక్షేత్రాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్ట్ గ్యాలరీ, 1,300 మంది కూర్చునేలా ఆడిటోరియం, రిహార్సల్స్ గదులు, గ్రీన్ రూమ్, లాబీలను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి అంతస్తులో ఆర్టియం, ప్రీ ఫంక్షన్ ఏరియా, కార్యాలయం, ఫుడ్ కోర్టు, స్టోర్ రూమ్, వాష్ రూమ్‌లను నిర్మిస్తున్నారు. రెండో అంతస్తులో గ్రంథాలయం, ఆఫీస్, స్టోర్స్, లాబీ, వాష్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మూడు, నాలుగు అంతస్తుల్లో ప్రీ ఫంక్షన్ లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్ వాక్ లాబీలను ఏర్పాటు చేస్తున్నారు.

వడివడిగా పనులు..

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల వరంగల్ నగరంలో పర్యటించిన సందర్భంగా నగరం, కుడా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో కాళోజీ కళాక్షేత్రాన్ని త్వరితగతిన పూర్తి చేసి సెప్టెంబర్ 9న ప్రారంభించుకునేలా అన్ని పనులు పూర్తిచేసి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ పి. ప్రావీణ్య, గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, 'కుడా' చైర్మెన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి నిత్యం తనిఖీలు చేస్తూ పనుల్లో వేగం పెంచుతున్నారు. కళాక్షేత్రం భారీ నిర్మాణపు పనులన్నీ పూర్తయ్యాయి. సీలింగ్, ఫ్లోరింగ్, ఎలక్ట్రిసిటీ, సౌండ్, లైటింగ్ పనులను పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం సీలింగ్, ఎలక్ట్రిసిటీ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే ఫ్లోరింగ్, అనంతరం సీటింగ్ పనులను పూర్తి చేయనున్నారు. ఆగస్టులోనే అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మోడల్ స్కూళ్ల రెగ్యులర్ టీచర్లకు జీతాలు చెల్లించాలి

- మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదనీ, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు ఏడు నెల్ల నుంచి ఏ నెలలో కూడా ఒకటో వేతనాలు చెల్లించకపోవడం మోసపూరితం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికే ఈనెల 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లకు జీతాలు అందకపోవటంతో ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల ఎనిమిదిన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు, ఎనిమిది జిల్లాలో పని చేస్తున్న వెయ్యి మందికి ఇంకా వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. వీరితో పాటు మోడల్ స్కూళ్లలో పని చేసే ఔట్ సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్లు (హెచ్‌బీటీ) దాదాపు రెండు వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించి ప్రతి నెలా ఒకటిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం మాట తప్పడం బాధాకరమని తెలిపారు. అధికారంలోకి రాగానే రూ.42 వేల వేతనం చెల్లిస్తామని అభయహస్తం మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ , వారి ఉద్యోగ భవిష్యత్‌ను దెబ్బతీసేలా కేవలం మార్చి31 నుంచి జులై 31 వరకే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు.

ఏప్రిల్, మే నెలల్లో సెలవులే ఉండగా, కేవలం జూన్, జులై నెలకు మాత్రమే పొడిగింపు ఇచ్చి చేతులుదులుపుకున్నారని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల పదేండ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న1,654 మంది గెస్ట్ లెక్చరర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే, ఎలా బతికేది అని లెక్చరర్లు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా వారికి భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ.42వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ పాలనలో చీకటి ఒప్పందాలు, చీకటి జీవోలు

- ప్రభుత్వ ఖజానాకు వేలకోట్ల రూపాయల గండి : బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చీకటి జీవోలు, చీకటి ఒప్పందాలతో సీఎం రేవంత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దొంగలు పోయి, గజదొంగలు వచ్చినట్టుగా పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. అమృత్ నిధులకు సంబంధించి అవినీతి టెండర్లను రద్దు చేసి, గ్లోబల్ టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా మెఘా కృష్ణారెడ్డిని జైలుకు పంపిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, అదే మేఘాకు రూ.4వేల కోట్ల పనులను అప్పగించేందుకు చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. "రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తున్నది. జవాబుదారీతనం, పారదర్శకత లేని ప్రభుత్వం నడుస్తున్నది. ప్రజాదర్బార్ కానరాకుండా పోయింది. ప్రజాపాలన పేరు మీద అవినీతి, అక్రమ పాలన నడుస్తున్నది" అని ధ్వజమెత్తారు. అమృత్ నిధులతో చేపట్టనున్న పనులకు గ్లోబల్ టెండర్లు పిలవకుంటే ఆందోళన చేపడతామని ఏలేటి హెచ్చరించారు.

కరెంట్ అఫైర్స్

మోడీకి రష్యా పురస్కారం



భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న లక్ష్యంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల రష్యాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి మోడీ చేస్తున్న సేవలకి గుర్తింపుగా రష్యా అందించే అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్తల్'ని పుతిన్ అందచేశారు. దీంతో ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడిగా మోడీ రికార్డు సృష్టించారు. రష్యా తొలి క్రైస్తవ మత భోదకుడైన సెయింట్ ఆండ్రూ పేరిట 1698 నుండి రష్యా చక్రవర్తి పీటర్ కృషితో ఈ అవార్డును ప్రధానం చేస్తున్నారు.

భూమిని పోలిన మరొక గ్రహం



భూమిని పోలిన మరొక గ్రహాన్ని కెనడా దేశానికి చెందిన యూనివర్సిటి ఆఫ్ మాంట్రియల్‌కి చెందిన శాస్త్రవేత్తల బృందం తాజాగా గుర్తించింది. ఎల్‌హెచ్‌ఎస్ 1140బి పేరుతో పిలుస్తున్న ఈ గ్రహంలో వాతావరణ పరిస్థితులు సరిగ్గా భూమి మీద ఉన్నట్టే వారు గుర్తించారు. జేమ్స్ వెబ్ స్పేస్‌తో పాటు, స్పిట్జర్, హాబుల్ వంటి అంతరిక్ష టెలిస్కోపుల ద్వారా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి ఈ గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను వారు అంచనా వేస్తున్నారు. భూమికి 48 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ గ్రహంపై నీరు చాలా వరకూ ద్రవ రూపంలోనే ఉందని, భూమి పైన మాదిరిగానే నైట్రోజన్‌తో కూడిన వాతావరణ వ్యవస్థ ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

వాయుకాలుష్యంతో భారత్‌లో ఏటా 33వేల మరణాలు



దేశంలో రోజురోజుకి పెరుగుతున్న వాయుకాలుష్యం వల్ల ఒక్క భారతదేశంలోనే ప్రతి ఏటా దాదాపు 33వేల మంది మరణిస్తున్నారని లాన్సెట్ జరిపిన ఒక అధ్యయనంతో తేలింది. ప్రపంచ ఆరోగ్య, వాతావరణ సంస్థలు నిర్దేశించిన ప్రమాణాల కన్నా అధికంగా కాలుష్యం కలిగి ఉండటం వల్ల ఈ మరణాలు సంభవిస్తున్నాయని లాన్సెట్ నివేదిక స్పష్టం చేసింది. వాయుకాలుష్యం అధికంగా ఉన్న అహ్మదాబాద్, బెంగుళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబై, పూణే, సిమ్లా వారణాసి వంటి నగరాల్లో ఈ మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని ఆ నివేదిక తెలిపింది.

జనాభాలో దూసుకుపోతున్న భారత్



భారతదేశంలో జనాభా విస్ఫోటనం వేగంగా కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి తాజాగా ప్రకటించింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2100 నాటికి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో 145కోట్ల మంది జనాభా ఉన్నారని, 2060 నాటికి భారత్ జనాభా 170 కోట్లకి చేరుకుంటుందని 'ది వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024 పేరుతో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఆర్థిక, సామాజిక వ్యవహారాలు, జనాభా విభాగం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. దీంతో పాటు ప్రస్తుతం 820 కోట్లు ఉన్న ప్రపంచ జనాభా 2080 దశకం నాటికి 1030 కోట్లకు చేరుకుంటుందని లెక్కగట్టింది. ఇదిలావుండగా, ప్రపంచలోనే అత్యధిక జనాభా కలిగిన నగరాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ రెండవ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఢిల్లీలో 3.3 కోట్ల మంది నివాసం ఉంటున్నారు. 2028 నాటికి ఢిల్లీ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన నగరంగా అవతరిస్తుందని ఐక్యరాజ్యసమితికి చెందిన వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రాస్పెక్ట్స్ నివేదిక వెల్లడించింది.



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

జూన్ 25 రాజ్యాంగ హత్యా దినం



భారత్ చరిత్రలో చీకటి అధ్యాయంగా అనేక మంది భావించే ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదిన రాజ్యాంగ హత్యా దినంగా జరుపుకోవాలని కేంద్రం నిర్ణయించింది. 1975లో దేశంలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితి దృష్ట్యా జూన్ 25న అత్యవసర స్థితిని విధించారు. ఎమర్జెన్సీ సమయంలో ఎంతో వేదనను అనుభవించి, త్యాగాలకు సిద్ధపడిన వారిని గుర్తు చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను ఇటీవల విడుదల చేసింది.

తగ్గుతున్న భూగర్భ జలాలు

మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల దేశంలో భూగర్భ జలాలు అత్యంత వేగంగా తగ్గి పోతున్నాయని హైదరాబాద్‌లోని నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఎఫ్) మరి కొంత మంది ఐఐటి శాస్త్రవేత్తలతో సంయుక్తంగా జరిపిన ఒక తాజా అధ్యయనం తెలియచేసింది. సకాలంలో వర్షాలు పడకపోవటం, నీటి వనరులను తగిన రీతిలో సంరక్షించుకోక పోవటంతో పాటు, పెద్దఎత్తున్న భూగర్భ జలాలను తోడేయటం కూడా దేశవ్యాప్తంగా భూగర్భ జలాల లభ్యత తగ్గిపోవడానికి కారణాలని ఆ అధ్యయనం తేల్చి చెప్పింది. దక్షిణ భారతదేశంతో పోల్చుకుంటే, ఉత్తర భారతదేశంలోనే భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయని, 2002-2021 మధ్య కాలంలో ఉత్తర భారతం దాదాపుగా 450 క్యూబిక్ కిలోమీటర్ల మేర భూగర్భ జలాలను కోల్పోయిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఇంగ్లీషు ఛానెల్‌ని ఈదిన తల్లి తన్వీ చవాన్ దేవరే

ప్రపంచంలోనే అత్యంత పొడవైన ఛానల్స్‌లో ఒకటైన ఇంగ్లీషు ఛానల్‌ని ఇద్దరు పిల్లలకి తల్లైన తన్వీ చవాన్ దేవరే ఈది రికార్డు సృష్టించింది. బ్రిటన్‌లోని డోవర్ నుండి ఫ్రెంచ్ తీరం వరకు సుమారు 42 కిలోమీటర్ల దూరం కలిగిన ఇంగ్లీషు ఛానెల్‌ని 17.42 గంటల వ్యవధిలో తన్వీ చేరుకున్నారు. దీంతో ఇంగ్లీషు ఛానల్‌ని ఈదిన మొదటి మాతృమూర్తిగా మహారాష్ట్రకి చెందిన తన్వీ చవాన్ చరిత్రలో నిలిచారు. ఎటువంటి విరామం, విశ్రాంతి లేకుండా ఈ లక్ష్యాన్ని ఆమె సాధించటం మరో విశేషం.



రోష్నీ నాడార్‌కి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



కంప్యూటర్ రంగంలో దిగ్గజ సంస్థ అయిన హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాకి ఫ్రాన్స్ ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే పౌర పురస్కారం 'షెవెలియర్ డెలా లీజియన్ డీ హానర్' లభించింది. వ్యాపారంలో స్థిరత్వం సాధించడానికి ఆమె అందించిన సేవలకుగానూ ఈ గుర్తింపు లభించిందని హెచ్‌సిఎల్ ప్రకటించింది. వివిధ రంగాల్లో సమర్థులైన వారికి అందించే ఈ పౌర పురస్కారం అందుకోవటం చాలా ఆనందంగా ఉందని, భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య కొనసాగుతున్న వ్యూహాత్మక బంధాలను ఇది మరింత బలపరుస్తుందని రోష్ని తెలిపారు.

రికార్డు స్థాయిలో దేశంలో ఆయుధాల ఉత్పత్తి



భారతదేశ వార్షిక ఆయుధ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుందని కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్‌సింగ్ తెలిపారు. 2022-23లో దేశీయ ఆయుధాల ఉత్పత్తి విలువ 1,08,684 కోట్లు ఉంటే, 2023-24లో 16.8 శాతం వృద్ధి రేటుతో దాదాపు 1.27 కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. అయితే ఆయుధాల ఉత్పత్తి వ్యయంలో 79.2 శాతం వాటాని ప్రభుత్వ రంగ ఆయుధ పరిశ్రమలు కలిగి ఉంటే, ప్రైవేటు రంగం 20.8 శాతం వాటాను కలిగి ఉంది.

కేంద్రానికి కెనరా బ్యాంక్ 1838 కోట్ల డివిడెంట్ చెల్లింపు

గత వార్షిక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి కెనరా బ్యాంక్ సుమారు 1838 కోట్ల రూపాయల డివిడెంట్‌ను చెల్లించింది. ఈ మేరకు దీనికి సంభందించిన చెక్కును కెనరా బ్యాంకు ఎండీ, సిఇఒ. కె.సత్యనారాయణ రాజు నేతృత్వంలోని అధికారుల బృందం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కి అందచేశారు.

ఎన్‌బిడిఏ అధ్యక్షుడిగా రజత్‌శర్మ



దేశంలోనే వార్తా పత్రికలు, డిజిటల్ మీడియా రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతిపెద్ద సంఘం 'న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఏ) అధ్యక్షుడిగా ఇండియా టీవీ ఛైర్మన్ రజత్‌శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎన్‌బిడిఏ బోర్డు సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. దేశంలోని దాదాపు అన్ని పెద్ద న్యూస్ నెట్‌వర్క్ సంస్థలకీ ఎన్‌బిడిఏలో సభ్యత్వముంది.

సుప్రీం కోర్టుకు 75 ఏండ్లు

దేశం అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఏర్పడి 75 ఏండ్లు కావస్తున్న సందర్భంగా 75 రూపాయల వెండి నాణెం విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 99.9 వెండితో తయారు చేసే ఈ నాణెం 40గ్రాముల బరువుతో ఒక వైపు ఆశోక స్థూపం, మరొక వైపు సుప్రీం కోర్టు చిత్రాలతో రూపొందించనున్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మణిపూర్ వాసి



భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుకు తొలిసారిగా మణిపూర్‌కి చెందిన జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ పేరును సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవికీ, భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసింది. వీరితో పాటు మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ మహాదేవన్ పేరును కూడా కొలిజీయం సిఫార్సు చేసింది. దీనిపై కేంద్రం ఆమోద ముద్ర వేస్తే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన మొదటి మణిపూర్ వాసిగా జస్టిస్ ఎన్ కోటేశ్వర్‌సింగ్ రికార్డు సృష్టిస్తారు. ప్రస్తుతం ఆయన జమ్మూ కాశ్మీర్, లద్ధాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్నారు. ■

కావ్య ప్రబంధాలు



నానాపురం నర్సింహులు
9030057994

పురాణాల్లో ప్రసిద్ధ కథను గ్రహించి వివిధ వర్ణన, అలంకారాలతో, పాత్ర చిత్రణతో, రస, భావ ప్రధానంగా రచించడం కావ్య పద్ధతి. ప్రకృష్టమైన బంధం(కూర్పు) కలది ప్రబంధం. తెలుగు సాహిత్య చరిత్ర శ్రీకృష్ణదేవరాయల (16వ శతాబ్దం) కాలానికి ప్రబంధయుగం అని పేరు. ఆకాలంలో వెలువడ్డ కావ్యాలకు 'ప్రబంధాల'ని పేరు. ప్రబంధం కూడా కావ్యమే ఐనా వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయం, రసాధిక్యత, నాటకీయత, అలంకారిక రచన, అష్టాదశ వర్ణనలు, స్వతంత్ర రచన అనేకావ్య కళాధర్మాలకు ప్రాధాన్యం ఉంటుంది. శ్రీకృష్ణదేవరాయాల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులు రాసిన గ్రంథాలకు ప్రబంధాలని వ్యవహారం గలదు.

సాధన ప్రశ్నలు

1. 1910-11లో నన్నెచోడుడి 'కుమార సంభవాన్ని' ప్రకటించి, నన్నెచోడుని కాలాన్ని క్రీ.శ.940గా ప్రకటించినవారు?
   ఎ. వేటూరి ప్రభాకర శాస్త్రి
   బి. శ్రీ మానవల్లి రామకృష్ణ
   సి. జయంతి రామయ్య
   డి. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
2. తిక్కన తాను రాసిన 15 పర్వాల భారతాన్ని ఇలా పేర్కొన్నాడు
   ఎ. శాస్త్రీయ ఇతిహాసం
   బి. కావ్యేతిహాసం
   సి. పంచమవేదం
   డి. ప్రబంధ మండలి
3. కావ్యయుగమని ఏకాలానికి పేరు?
   ఎ. తిక్కనయుగం బి. శ్రీనాధయుగం
   సి. రాయలయుగం డి. దక్షిణాంధ్రయుగం
4. ప్రబంధ శబ్దాన్ని తొట్ట తొలుత ప్రయోగించిన కవి
   ఎ. నన్నెచోడుడు బి. తిక్కన
   సి. ఎర్రన డి. పెద్దన
5. 'ప్రబంధ పరమేశ్వరుడు' అనే బిరుదు ఎర్రనకు ఏ రచనల వల్ల వచ్చింది?
   ఎ. నృసింహపురాణం
   బి. రామాయణం
   సి. అరణ్యపర్వశేషం
   డి. హరివంశం
6. జతపర్చుము
   1. శ్రీనాధుడు అ. నవనాథచరిత్ర
   2. నాచనసోమన ఆ. ఉత్తరహరివంశం
   3. పిల్లలమర్రి పినవీరన ఇ. హరవిలాసం
   4. గౌరన ఈ. శృంగార శాకుంతలం

	1	2	3	4
ఎ.	ఇ	ఆ	ఈ	అ
బి.	ఇ	అ	ఈ	ఆ
సి.	ఈ	ఇ	అ	ఆ
డి.	ఇ	ఆ	ఈ	అ

7. 'ఆంధ్ర కవితా పితామహుడు' ఎవరు?
   ఎ. నన్నయ బి. శ్రీకృష్ణదేవరాయలు
   సి. పెద్దన డి. శ్రీనాథుడు
8. శ్రీకృష్ణదేవరాయల సభాభవనం పేరు?
   ఎ. ఇందిరామందిరం
   బి. విజయ భువనం
   సి. సారస్వత మందిరం
   డి. భువన విజయం
9. అల్లసాని పెద్దన రచించిన 'స్వరోచిష మనుసంభవము' అనే నామాంతరం గల 'మనుచరిత్ర'కు మూలం?
   ఎ. నన్నయ భారతం
   బి. మారన మార్కండేయ పురాణం
   సి. స్కంద పురాణం
   డి. మనువు చరిత్ర
10. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని పొగిడినదెవరు?
   ఎ. అల్లసాని పెద్దన బి. నన్నయ
   సి. శ్రీకృష్ణదేవరాయలు డి. అన్నమయ్య
11. శ్రీకృష్ణదేవరాయల విషయంలో సరికానిది ఏది?
   ఎ. విష్ణుచిత్తీయమనే నామాంతరం గల 'ఆముక్త మాల్యద'ను రచించాడు.
   బి. తెలుగు సాహిత్య చరిత్రలో రాయల యుగం 'స్వర్ణయుగం'గా ప్రసిద్ధి.
   సి. ఆయుక్తమాల్యదను వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చెను.
   డి. శ్రీకృష్ణదేవరాయల సభామందిరం 'విజయభవనం'.
12. గండపెండేరం తొడిగించుకొన్న ప్రబంధయుగపు కవి?
   ఎ. నంది తిమ్మన బి. అల్లసాని పెద్దన
   సి. ధూర్జటి డి. తెనాలి రామకృష్ణ
13. 'మాధురీ మహిమ' కవితా లక్షణం ఎవరిది?
   ఎ. నంది తిమ్మన
   బి. అల్లసాని పెద్దన
   సి. ధూర్జటి
   డి. తెనాలి రామకృష్ణ
14. 'వసుచరిత్ర' రచించిన రామరాజభూషనుడికి మరొక పేరు?
   ఎ. భట్టుమూర్తి బి. ముక్కు తిమ్మన
   సి. వికటకవి డి. శ్లేషకవి
15. తెనాలి రామకృష్ణ కవి రచించిన శైవ ప్రబంధం?
   ఎ. శ్రీకాళహస్తి మహత్యం
   బి. ఉద్భటారాధ్య చరిత్ర
   సి. పాండురంగ మహత్యం
   డి. ఘటికాచల మహత్యం ■

సమాధానాలు

1. బి	2. డి	3. బి	4. ఏ
5. సి	6. ఏ	7. సి	8. డి
9. బి	10. సి	11. డి	12. బి
13. సి	14. ఏ	15. బి	

ప్రపంచంలోనే అతి ఎక్కువ మంది యువత ఉన్న మనదేశంలో సరైన విద్యా సౌకర్యాలు లేక వెలవెలబోవడం ఎంతమాత్రం సరికాదనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. విద్యా రంగాన్ని బలోపేతంచేసి, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపా యాలు కల్పించాలి. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు అత్యంత ప్రాధాన్యత నిచ్చేలా నిధులు కేటాయించాలి. " స్కిల్ డెవలప్మెంట్" కు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించడంతో పాటు దాన్ని అమలయ్యేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. చిన్న సౌకర్యాలు ఉంటేనే మనవాళ్లు అనేక అద్భుతాలు ఆవిష్కరణలు చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. అదే అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ప్రపంచ దేశాల సరసన అనేక రంగాల్లో మనదేశాన్ని ముందు వరుసలో నిలబెడతారని గ్రహించాలి.

నైపుణ్యాలతోనే 'వికసిత భారత్' సాధ్యం



ఐ.ప్రసాదరావు
6305682733

అనాది కాలంలో అన్ని దేశాల్లో మానవుని జీవనాధారం వ్యవసాయం. కాలక్రమేణా మానవుని మేధస్సు వృద్ధి చెందుతూ అనేక అవసరతలు, సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు.ఇందులో భాగంగానే అనేక వస్తువులు తయారు చేయడం మొదలుపెట్టారు. పారిశ్రామికీకరణ ఊపందుకుంది. ఆదాయం పెరిగి, వలసలు ప్రారంభమయ్యాయి. 17వ శతాబ్దం నుండి ప్రారంభం అయిన వివిధ రంగాల అభివృద్ధి, నేడు 21వ శతాబ్దంలో సాఫ్ట్‌వేర్ రంగం పురోగాభివృద్ధితో అత్యున్నత స్థాయికి చేరుకుంది. దీనికి ప్రధాన కారణం చదువులో అనేక విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. పూర్వం పొట్ట పోషణకు, విజ్ఞానానికి సంబంధించిన సిలబస్ మాత్రమే అభ్యసించే పరిస్థితి. నేడు అనేక అద్భుతాలు, ఆవిష్కరణలు చేయడమే ప్రధాన ధ్యేయంగా అనేక నూతన సిలబస్ ప్రవేశపెడుతున్నారు. దీనికి తోడు ప్రతీ రంగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాలు రోజురోజుకూ నూతన ఒరవడులు సంతరించుకుంటున్నాయి. రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి చదువులు ప్రవేశపెట్టడం చూస్తూనే ఉన్నాం. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్ (స్టెమ్) అనే పేరుతో విద్యావిధానం దుస్సెల్లుతోంది.



గ్లోబలైజేషన్ పేరుతో ప్రపంచం అంతా కుగ్రామంగా మారింది. ప్రతీ పని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడింది. కంప్యూటర్, లాప్ టాప్, టాబ్లెట్, రాడార్ వ్యవస్థ వంటి వాటితో అనుసంధానం కీలకమైంది. ప్రతీ విషయం డిజిటలైజేషన్ చేయబడుతుంది. వి.ఎఫ్ ఎక్స్, గ్రాఫిక్స్ , ఇమేజ్ మిర్రరింగ్ వంటివి అందుబాటులో ఉన్నాయి.. ప్రపంచంలో అనేక దేశాలు అమెరికా, రష్యా, జపాన్, చైనా, ఫ్రాన్స్ జర్మనీ ఆస్ట్రేలియా వంటి దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో, సాఫ్ట్వేర్ రంగంలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. కారణం వారి విద్యా విధానంలో అనేక నూతన సిలబస్‌లతోపాటు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని రూపొందించి అమలు చేయడం. దానికితోడు నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగడం. ప్రపంచ స్థాయిలో ఉత్తమ విశ్వవిద్యాలయాలు ఈ దేశాల్లో ఉండుటచే మిగిలిన దేశాల విద్యార్థులు ప్రతీ సంవత్సరం లక్షల సంఖ్యలో వలసెళ్లుతున్న పరిస్థితి ఉంది. దీనికి భిన్నంగా మనదేశంలో విద్యారంగం కునారిల్లుతున్నది. దేశవ్యాప్తంగా ఏ కళాశాల, విశ్వవిద్యాలయం చూసినా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొరత, మౌలిక సదుపాయాలు లేమి, లేబరేటరీలు, గ్రంథాలయాలు లేకపోవడం వలన నాణ్యమైన విద్య ప్రశ్నార్థకమైంది. అశాస్త్రీయ ప్రమాణాలతో విద్యార్థులు ఉత్తీర్ణత పట్టాలు పట్టుకుని బయటకు వచ్చి, నైపుణ్యాలు లేక నిరుద్యోగంతో మగ్గిపోతున్న దుస్థితి ఉంది. ప్రభుత్వ విద్యా రంగానికి నిధులు లేక సతమతమవుతున్నాయి. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ విద్యారంగంపై నమ్మకం లేక చాలామంది ప్రయివేటుకు మొగ్గు చూపుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. దీంతో దేశవ్యాప్తంగా అనేక లక్షల మంది విద్యార్థులకు సరైన ప్రమాణాలు నైపుణ్యాలు లేక, ప్రపంచ పోటీలో నిలువలేక ఉద్యోగ లేమితో బాధపడుతున్నారు... నైపుణ్యాలు లేక పోవడంతో అసంఘటిత రంగంలో కార్మికులుగా, తక్కువ జీతంతో పనివారిగా మారుతున్న పరిస్థితి. కువైట్, యు.ఏ.ఈ , ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలకు అతి తక్కువ వేతనాలకు సమ్మతించి వలసెళ్లడం, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ కూలీలుగా మారడం, కొంతమంది ఏజెంట్ల మోసాలతో జైళ్లల్లో మగ్గడం నిత్యం వార్తల్లో కనిపిస్తున్న వాస్తవాలే. దీనికి ప్రధాన కారణం మన దేశంలో నైపుణ్యాలకు కొదవలేదు, కానీ దీన్ని అందిపుచ్చుకునే పాలకులు, నాణ్యమైన విద్యకు ఖర్చు పెట్టకపోవడం వల్ల ఈ దుస్థితి వెంటాడుతోంది.

ప్రపంచంలోనే అతి ఎక్కువ మంది యువత ఉన్న మనదేశంలో సరైన విద్యా సౌకర్యాలు లేక వెలవెలబోవడం ఎంతమాత్రం సరికాదనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. విద్యా రంగాన్ని బలోపేతం చేసి, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు అత్యంత ప్రాధాన్యత నిచ్చేలా నిధులు కేటాయించాలి. " స్కిల్ డెవలప్మెంట్" కు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించడంతో పాటు దాన్ని అమలయ్యేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. చిన్న సౌకర్యాలు ఉంటేనే మనవాళ్లు అనేక అద్భుతాలు ఆవిష్కరణలు చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. అదే అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ప్రపంచ దేశాల సరసన అనేక రంగాల్లో మనదేశాన్ని ముందు వరుసలో నిలబెడతారని గ్రహించాలి. విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలు చేపట్టాలి. అనుభవం, మేధస్సు గలవారిని నియమించాలి. కుల మత ఛాందస భావాలకు చరమగీతం పాడాలి. పారిశ్రామికీకరణ, సాఫ్ట్‌వేర్ రంగాన్ని పరుగు పెట్టించే చర్యలు తీసుకోవాలి. నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఒరవడులు సృష్టించబడాలి. నిరుద్యోగం లేకుండా చూడాలి. యువత మేధస్సు, నైపుణ్యాలతో నూతన ఆవిష్కరణలు చేస్తూ, ఎగుమతులు పెంచి, దిగుమతులు తగ్గించాలి. తలసరి ఆదాయంతో పాటు జాతీయ ఆదాయం పెంచాలి. జీడీపీ వృద్ధి రేటు పెరగడానికి యువతలో నైపుణ్యాలు పెంచుట ద్వారానే సాధ్యం అని గ్రహించాలి. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించాలంటే, విద్యారంగాన్ని ప్రభుత్వం రంగంలో కొనసాగిస్తూ, అధిక నిధులు సమకూర్చి ప్రమాణాలు నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయుటయే రాబోయే 2047 సెంచున్యరీ స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలకు మనం దేశానికి ఇచ్చే పెద్ద బహుమతి. ఇది పాలకులు గుర్తించినప్పుడే " వికసిత భారత్" సాధ్యం. అంతవరకు ఇది ఒక నినాదం మాత్రమే.

(జులై15 ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం) ■

అవయవ అక్రమ వ్యాపారంలో పేదలే సమిధలు

పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆట్రో డ్రైవర్ ఆర్థిక పరిస్థితి, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ.1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అమి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా పదిశాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.



ఖిజర్ పాషా
8008710143

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ అవయవ వ్యాపారం ధనవంతుల జీవన ప్రమాణాలను పెంచుతుండగా.. మధ్యవర్తులకు లాభాల పంటను పండిస్తున్నది. అదే సమయంలో 'పేదలను మాత్రం 'సమాధి' చేస్తున్నది. ఇటీవల ఢిల్లీ, విజయవాడలో వెలుగుచూసిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ ఈ ఆర్గాన్ రాకెట్ యథేచ్ఛగా కొనసాగుతుండటం ఆందోళనకు గురి చేస్తున్నది.ఇండియాలో విదేశీయుల హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ రాకెట్‌ను ఇటీవల ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఒక మహిళా డాక్టర్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందులో దాతలు, గ్రహీతలతోపాటు కీలక సూత్రధారి బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. 2019 నుంచి ఈ ఆర్గాన్ రాకెట్ కొనసాగుతున్నదని నిర్ధారించారు. ఒక్కొక్కరి నుంచి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు చేస్తున్నారని భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ రాకెట్ ఢిల్లీలోని ఒక మహిళా డాక్టర్ సహాయంతో నోయిడాలోని ఆస్పత్రిలో 15 నుండి 16 కిడ్నీలు మార్పిడి చేసినట్లు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కడికి తీసుకొచ్చి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, బంధువుల పేరుతో ప్రవేశపెట్టి కిడ్నీ మార్పిళ్లు చేస్తున్నట్లు నిర్ధారించారు.

భారతీయులను విదేశాల్లోకి తీసుకెళ్లి..

ఇండియాలో వెలుగుచూసిన పలు ఆర్గాన్స్ రాకెట్స్‌లో అంతర్జాతీయంగా వ్యాపారం కొనసాగుతున్నట్లు తేలింది. 2024 మేలో వెలుగు చూసిన హైదరాబాద్ వయా కొచ్చి టూ ఇరాన్ కేంద్రంగా నడిచిన ఓ కిడ్నీ రాకెట్ గతంలో భారతదేశంలో సంచలనం సృష్టించింది. ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కిడ్నీ రాకెట్ ముఠా గుట్టురట్టు చేశారు. ఈ ముఠా పేద యువకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో కిడ్నీకి రూ.20 లక్షలు ఇస్తామని ఆశజూపి.. ఇరాన్‌కు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిడ్నీలు తీసుకుని.. తిరిగి ఇండియాకు తీసుకొస్తున్నట్లు నిర్ధారించారు.



హైదరాబాద్, కేరళకు చెందిన 40 మంది యువకులను ఇలా ఇరాన్ కు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీలంక, ఈజిప్ట్, టర్కీలకు సైతం తీసుకెళ్లి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొన్ని కేసుల్లో నిర్ధారించారు.

పేదరికాన్ని ఆసరాగా చేసుకొని..

పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆట్రో డ్రైవర్ ఆర్థిక పరిస్థితి, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ.1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అమి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా పదిశాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.

సోషల్ మీడియా ద్వారా..

సోషల్ మీడియా ద్వారానూ అక్రమ అవయవ వ్యాపారం కొనసాగుతున్నట్లు అర్థమవుతున్నది. ఇటీవల విజయవాడలో వెలుగు చూసిన కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వ్యవహారం కూడా సోషల్ మీడియా పరిచయాల ద్వారానే జరిగినట్లు తెలుస్తున్నది. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇవ్వడంతోనే మధుబాబు దానికి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్ సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు 2023లో గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఓ ముఠా ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నడుపుతున్నట్లు కేసు దర్యాప్తులో తేలింది. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్‌బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్‌ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.అవయవాల మార్పిడిలో కిడ్నీలకు ఫుల్ డిమాండ్ ఉంటున్నది. జీవన్ దాన్ వెబ్ సైట్స్ లో వంద మంది అవయవదానం కోసం ఎదురు చూస్తుంటే వాటిలో కిడ్నీల కోసం ఎదురు చూస్తున్నవారే 70 మంది వరకు ఉంటారు. కిడ్నీ మార్పిడి అవసరమైన వాళ్ల దేశంలో ఏటా సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది పెరుగుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల నుంచి 9 లక్షల మంది వరకు కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

కఠిన శిక్షలున్నా..

ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. అలాగే రక్త సంబంధీకులు వారి కుటుంబ సభ్యులకు అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. అయితే అవయవదానం చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఎవరైనా అవయవదానం చేస్తే అది నేరం. వారికి ఐదు నుంచి పది సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది.

అవయవ మార్పిడి చట్టం-1994 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి ఆపరేషన్ చేసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, ఆపరేషన్ జరిగిన ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారు. అవయవదాన చట్టంలో 2023లో కేంద్రం కొన్ని మార్పులు చేసింది. నోటో (నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గనైజేషన్)లో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అందుబాటులో ఉంచింది. ■